సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 177

సోమవారం 13-3-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'



కోహ్లి కొట్టిన సెంచరీతో..

నాలుగో టెస్టులో టీమిండియా పట్టు.. 91 పరుగుల ఆధిక్యం - 12లో



వైవిధ్యమే పెట్టుబడులకు రక్ష!

పెట్టుబడులన్నీ ఒకేచోట ఉంటే రిస్క్ ఈక్విటీ, గోల్డ్ మంచి కలయిక - 13లో



ఆ వివాహాలు చట్ట విరుద్ధమే!

స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీం కోర్టులో కేంద్రం తీవ్రంగా వ్యతిరేకించింది.


వివరాలు 6లో ▸



నాకు సమాధి తవ్వే పనిలో..

దేశాభివృద్ధి కోసం తాను శ్రమిస్తుంటే, ప్రతిపక్షాలు తనకు సమాధి తవ్వే పనిలో ఉన్నాయని ప్రధాని మోదీ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



కరోనా మూలాలు తేల్చాలి

కరోనా మూలాలు కనుక్కుంటేనే భవిష్యత్‌లో ఇతర వైరస్‌లు వ్యాప్తి చెందకుండా అడ్డుకట్ట వేయగలమని డబ్ల్యూహెచ్‌వో పేర్కొంది.

వివరాలు 6లో ▸



ఈ వేసవి గండం గట్టెక్కగలమా?

దేశంలో ఈ ఏడాది వేసవి భగభగలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి అత్యంత వేడి నెలగా రికార్డులకెక్కింది.

వివరాలు 6లో ▸

మళ్లీ చదువుల ఒడికి

1.47 లక్షల మంది పిల్లలు తిరిగి బడి బాట

సత్ఫలితాలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కృషి.. దారికొస్తున్న డ్రాపౌట్లు

- ప్రత్యేక యాప్‌తో హాజరు నిరంతర పర్యవేక్షణ
- వరుసగా మూడు రోజులు రాకుంటే విద్యార్థి ఇంటికి వలంటీర్, విద్యా అసిస్టెంట్
- కారణాలు తెలుసుకుంటూ సమస్యకు పరిష్కార మార్గాలు
- తల్లిదండ్రులతో చర్చించి తిరిగి బడి బాట పట్టిస్తున్న అధికార యంత్రాంగం
- పర్యవేక్షణకు పాఠశాలల వారీగా కమిటీల నియామకం
- బడి మానేయడానికి కారణాలు సీఎం జగన్ ఆదేశాలతో సచివాలయాల వారీగా నమోదు
- ప్రతి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్, ఉన్నతాధికారుల సమీక్ష



సాక్షి, అమరావతి: కారణం ఏదైనప్పటికీ ఓ చిన్నారి చదువులకు దూరమైతే రేపటి తరాలకు పూడ్చలేని నష్టం వాటిల్లుతుంది. ఆ ఒక్క కుటుంబమే కాకుండా సమాజం మొత్తంపై ఈ ప్రభావం పడుతుంది. పేద కుటుంబాల్లో విద్యా కుసుమాలు వికసించినప్పుడే దుర్భర దారిద్ర్యానికి సంపూర్ణంగా తెర పడుతుంది. ఒకవైపు విద్యారంగ సంస్కరణలతో చదువులను చక్కదిద్ది అడుగడుగునా ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు వివిధ కారణాలతో స్కూళ్లకు దూరమైన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అర్ధాంతరంగా బడి మానేసిన చిన్నారులను గుర్తించి తిరిగి పాఠశాల బాట పట్టించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో చేపట్టిన కార్యక్రమాలు

మిగతా 10వ పేజీలో ▶

దీర్ఘకాలం డ్రాపౌట్లపై ప్రత్యేక దృష్టి..

దీర్ఘకాలం డ్రాపౌట్స్‌గా గుర్తించిన విద్యార్థులకు సంబంధించిన కారణాలను ఇంటింటి సర్వేలో వలంటీర్లు సేకరిస్తున్నారు. బాల్య వివాహాలు, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, వ్యవసాయ పనులకు వెళ్తున్నారా? అనే వివరాలను సేకరించడంతో పాటు తల్లిదండ్రులకు నచ్చచెప్పి చదువుల ద్వారా చేకూరే ప్రయోజనాలను వివరిస్తూ బడిబాట పట్టిస్తున్నారు. ఈ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారు.



తవ్వీన కొద్దీ... 'చీట్స్'

అక్రమాలపుట్ట 'మార్గదర్శి'లో.. నలుగురు మేనేజర్ల అరెస్టు

ఒక్క రూపాయి కూడా లేకుండా కంపెనీ పేరిట వేలాది చిట్లు

- డిస్కౌంట్‌నే తమ చందాగా చూపిస్తూ రికార్డుల కనికట్టు.. ఈ గొలుసు తెగితే చందాదారుల పరిస్థితి అగమ్యగోచరం
- ఒక్క బ్యాంకు ఖాతా నుంచే మొత్తం లావాదేవీలు.. చట్ట విరుద్ధంగా గ్రూపు సంస్థల్లోకి, షేర్లలోకి మళ్లింపు
- హైరిస్క్ ఉన్న మ్యూచువల్ ఫండ్లలోకీ మళ్లిస్తున్న సంస్థ
- కాగితపు రసీదులిస్తూ అక్రమంగా డిపాజిట్ల సేకరణ
- టీడీఎస్ మినహాయింపు లేదని చెప్పి మరీ స్వీకరణ.. రామోజీ రాజ్యంలో.. అడుగడుగునా అతిక్రమణలే
- నలుగురు బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసిన సీఐడీ.. కొందరికి ఈ నెల 24 వరకూ రిమాండు

సాక్షి, అమరావతి: సోదాలు చేస్తున్న కొద్దీ అక్రమాల పుట్టగా బయటపడుతున్న మార్గదర్శి చిట్ ఫండ్స్ వ్యవహారంలో అరెస్టులకు తెరలేచింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తున్న సీఐడీ అధికారులు... నలుగురు బ్రాంచి మేనేజర్లను అరెస్టు చేసి ఆదివారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఇప్పటికే ఏ1గా రామోజీరావును, ఏ2గా చెరుకూరి శైలజను, ఎ3గా బ్రాంచి మేనేజర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చిన సీఐడీ... ఫోర్‌మన్లుగా పిలిచే కామినేని శ్రీనివాసరావు (విశాఖ- సీతమ్మధార బ్రాంచి), సత్తి రవి శంకర్ (రాజమండ్రి), బి.శ్రీనివాసరావు (విజయవాడ- లబ్బీపేట), గొరిజవోలు శివ రామకృష్ణ (గుంటూరు)లను అరెస్టు చేసి ఆయా ప్రాంతాల్లో న్యాయమూర్తుల ఎదుట హాజరుపరిచారు. వీరిలో కొందరికి 24 వరకూ రిమాండు విధించారు. ఈ సందర్భంగా వెలుగుచూసిన అక్రమాలు అధికారులను సైతం దిగ్భ్రాంతికి గురిచేశాయి. చిట్ సభ్యుల స్థానంలో

మిగతా 5వ పేజీలో ▶

న్యూస్‌రీల్


దత్తపుత్రుడుకి కులదైవం, మత దైవం బాబే



దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌కు కులదైవం, మత దైవం చంద్రబాబేనని మంత్రి బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఏం చెబితే అది బయటకొచ్చి చెప్పడం.. తమ ప్రభుత్వంపై బురద జల్లడమే అజెండాగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

వివరాలు 2 ▸

తెలంగాణ కొట్టాల్సిందే!



తెలంగాణలో బీజేపీ అధికారం చేజిక్కించుకోవాల్సిందేనని ఆ రాష్ట్ర బీజేపీ నేతలకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది. విచారణలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి అరెస్టులు జరిగే అవకాశాలు ఉన్నాయని.. అప్పుడు బీజేపీ వ్యతిరేక ప్రచారాన్ని ఎండగట్టేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పినట్లు సమాచారం.

వివరాలు 2 ▸

పర్యాటకంలో మౌలిక వసతులకు పెద్దపీట



పర్యాటక రంగంలో పెద్దఎత్తున మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడంపై ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ దృష్టి సారించింది. ఏపీటీడీసీకి చెందిన వివిధ ఆస్తులను ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ప్రాతిపదికన వినియోగంలోకి తెస్తోంది. పలు పర్యాటక ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, గెస్ట్‌హౌస్‌లు, టూరిస్ట్ ఎమినిటీస్ సెంటర్ల నిర్వహణకు టెండర్లు ఆహ్వానించింది.

వివరాలు 3 ▸

నేడే 'ఎమ్మెల్సీ' పోలింగ్

టీచర్, పట్టభద్రులు, స్థానిక సంస్థల నియోజకవర్గాల్లో తొమ్మిది స్థానాలకు ఓటింగ్

- 1,538 పోలింగ్ స్టేషన్లలో ఓటు హక్కు వినియోగించుకోనున్న 10.59 లక్షల మంది ఓటర్లు
- ఉ.8 గంటల నుంచి సా.4 గంటల వరకు అనుమతి.. ప్రశాంత పోలింగ్‌కు ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు
- 584 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు.. తిరుపతి పట్టణ ప్రాంతంలోనే బోగస్ ఓట్లపై అత్యధిక ఫిర్యాదులు
- 16న ఉ.8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా



ఒంగోలులోని పీవీఆర్ హైస్కూల్‌లో పోలింగ్ పేపర్లను సరిచూసుకుంటున్న సిబ్బంది

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సోమవారం జరగనున్న తొమ్మిది ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉ.8 గంటల నుంచి సా.4 గంటల వరకు పోలింగ్ జరిగేందుకు పటిష్టమైన ఏర్పాట్లుచేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఆదివారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం మొత్తం 1,538 పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. మూడు పట్టభద్రులు..

మిగతా 10వ పేజీలో ▶

హెచ్3ఎన్2పై వైద్య శాఖ అప్రమత్తం



రాష్ట్రంలో హెచ్3ఎన్2 ప్రభావం లేనప్పటికీ ముందస్తు నియంత్రణ చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. జ్వరం, దగ్గు, జలుబు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారిని గుర్తించి వారికి వైద్య సహాయం అందించడానికి సోమవారం నుంచి ఫీవర్ సర్వేను చేపట్టనుంది. ఏటా సీజన్ మారుతున్న సమయంలో కేసులు కొంత పెరుగుతాయని.. ఆందోళన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు.

- వివరాలు 2లో



గుంటూరులో 500 మీటర్ల వైఎస్సార్‌సీపీ జెండాతో ర్యాలీ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

ఊరూరా సందడే సందడి

14లో

- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం
- రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున వేడుకలు
- దివంగత సీఎం వైఎస్సార్‌కు ఘనంగా నివాళి
- ర్యాలీలు.. కేక్ కటింగ్‌లు.. దుస్తుల పంపిణీ
- గుంటూరులో 500 మీటర్ల పార్టీ జెండాతో ర్యాలీ
- మిన్నంటిన జై జగన్ నినాదాలు

ఇంకాజోక్



జెండాను గుండెగా మార్చుకున్న నా కార్యకర్తలకు కృతజ్ఞతలు

- పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ 13వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతలు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. '12 వసంతాలు పూర్తి చేసుకుని, నేడు 13వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అభిమానులకు, కార్యకర్తలకు, నాయకులకు, రాష్ట్ర ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. గత 12 ఏళ్లుగా ప్రయాణంలో నాతో నిలబడి, నాకు వెన్నుదన్నుగా ఉన్న ప్రతి ఒక్కరికీ, మన పార్టీ జెండాను తమ గుండెగా మార్చుకున్న నా కార్యకర్తలకు పేరు పేరునా కృతజ్ఞతలు. మన ప్రయాణం ఎప్పటికీ ఇలాగే కొనసాగుతూ ఉండాలని కోరుకుంటున్నాను' అని ఆదివారం ట్వీట్ చేశారు.

నూతన దంపతులకు సీఎం శుభాశీస్సులు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ సోదరుడు వ్యాస్‌ప్రసాద్ కుమార్తె వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరయ్యారు. నూతన దంపతులు ఉషశ్రీ, ప్రశాంత్ కుమార్‌లను ఆశీర్వదించారు.

వైఎస్సార్‌సీపీ నుంచి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సస్పెన్షన్

సాక్షి, అమరావతి: వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్టు వైఎస్సార్‌సీపీ ప్రకటించింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదులపై పార్టీ క్రమశిక్షణ సంఘం విచారించి ఈ మేరకు సిఫార్సు చేసిందని వివరించింది. దాంతో ఆయన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించినట్టు పేర్కొంది.

మన్యానికి రైలొస్తోంది!

- మల్కన్‌గిరి నుంచి భద్రాచలం వరకు 173 కి.మీ. కొత్త రైల్వేలైను
- మన్యంలోని చింతూరు, కూనవరం, ఎటపాక మండలాల్లో నాలుగు స్టేషన్లు
- సర్వే పూర్తి.. త్వరలో పనులు





చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): త్వరలోనే మన్యంలో రైలుకూత వినపడనుంది. ఇప్పటి వరకు బస్సులు, లాంచీలు మాత్రమే తిరిగిన మన్యం ఏరియాలో రైళ్లు కూడా రాకపోకలు సాగించనున్నాయి. ప్రస్తుతం మన్యం ప్రజలు రైలులో ప్రయాణించాలంటే రాజమహేంద్రవరం, ఖమ్మం, కొత్తగూడెం వెళ్లాల్సి ఉంది. నూతన లైను ఏర్పాటులో భాగంగా మన్యం ఏరియాలో నాలుగు రైల్వే స్టేషన్లు నిర్మించనున్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలను అనుసంధానం చేస్తూ రవాణాను సులభతరం చేసేందుకు ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి భద్రాచలం వరకు సుమారు 173 కిలో మీటర్ల మేర రైల్వే లైను మంజూరైంది. దీని నిర్మాణానికి రూ 2,800 కోట్లు అవసరమని అంచనా. ఈ లైన్‌ను మల్కన్‌గిరి నుంచి భద్రాచలం సమీపంలోని పాండురంగాపురం రైల్వేస్టేషన్ వరకు నిర్మిస్తారు. ఈ లైను ఏర్పాటులో భాగంగా పలుచోట్ల 213 వంతెనలు నిర్మించనున్నారు. వీటిలో 48 పెద్ద వంతెనలు, 165 చిన్న వంతెనలు ఉన్నాయి.

విలీన మండలాల మీదుగా...

మల్కన్‌గిరి నుంచి భద్రాచలం వరకు నిర్మించనున్న రైల్వేలైను విలీన మండలాలైన చింతూరు, కూనవరం, ఎటపాక మండలాల మీదుగా సాగనుంది. దీనిలో భాగంగా ఒడిశాలోని మల్కన్‌గిరి, కోవాసిగూడ, బదలి, రాజన్‌గూడ, మహరాజ్‌పల్లి, లూనిమన్‌గూడ, ఆంధ్రాలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం కన్నాపురం, కూనవరం మండలం కూటూరు గట్టు, పల్లూరు, ఎటపాక మండలం నందిగామలో స్టేషన్లు ఏర్పాటుచేస్తారు. నందిగామ నుంచి తెలంగాణలో గోదావరి మీదుగా భద్రాచలం, అక్కడి నుంచి పాండురంగాపురం వరకు ఈ రైల్వేలైను నిర్మించనున్నారు.

తెలంగాణ

తెలంగాణ కొట్టాల్సిందే!

- బీజేపీ కీలక నేతలకు అమిత్‌షా దిశా నిర్దేశం
- కేసీఆర్ కుటుంబ అవినీతిని ఎండగట్టండి
- సంజయ్, లక్ష్మణ్, కిషన్‌రెడ్డిలతో మంతనాలు

సాక్షి, హైదరాబాద్ : ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణలో బీజేపీ అధికారం చేజిక్కించుకోవాల్సిందేనని, అందుకు తగ్గట్టుగా స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్లాలని రాష్ట్ర బీజేపీ కీలక నేతలకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దిశా నిర్దేశం చేసినట్టు తెలిసింది. సీబీఐ, ఈడీ తదితర దర్యాప్తు సంస్థల విచారణలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి అరెస్టులు అనివార్యంగా జరిగే అవకాశాలున్నాయని.. అప్పుడు బీజేపీకి ప్రతికూలంగా జరిగే ప్రచారాన్ని ఎండగట్టేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పినట్టు సమాచారం. కేసీఆర్ కుటుంబ సభ్యుల అవినీతిని విస్తృతంగా ప్రచారం చేసి బీజేపీకి అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలని సూచించారు. ఆదివారం సీఐఎస్ఎఫ్ రైజింగ్‌డేలో పాల్గొనేందుకు ఇక్కడకు వచ్చిన ఆయన 11.40 గంటలకు కేరళలోని కొచ్చికి వెళ్లాల్సి ఉండింది. ఐతే ఆయన వెళ్లాల్సిన బీఎస్ఎఫ్ విమానంలో సాంకేతిక సమస్యలు ఏర్పడడంతో దాదాపు నాలుగున్నర గంటల పాటు ఆయన హకీంపేట ఎయిర్‌పోర్టులోనే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ లక్ష్మణ్ తదితరులతో అమిత్‌షా కీలక చర్చలు జరిపారు.

దర్యాప్తు సంస్థల విచారణ తీరును వివరించాలి

బీఆర్ఎస్ ప్రభుత్వం, ఆ పార్టీ పెద్దలు, నేతలు అవినీతి, అక్రమాల్లో కూరుకుపోవడం, ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత ఇరుక్కోవడం తదితర అంశాలతో బీజేపీకి, ప్రధాని మోదీకి ఎలాంటి సంబంధం లేదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అమిత్ షా సూచించినట్టు తెలిసింది. తెలంగాణ సంపద కేసీఆర్ సర్కార్ హయాంలో ఎలా అన్యాక్రాంతమైంది.. వంటి అంశాలను బలంగా ప్రచారం చేయాలని చెప్పినట్టు సమాచారం. 'జాతీయ దర్యాప్తు సంస్థలు జరుపుతున్న విచారణలో బయట పడుతున్న వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఎమ్మెల్సీ కవితపై ఈడీ విచారణ నేపథ్యంలో ఢిల్లీలో, హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నిరసనలు, కేంద్రాన్ని, ప్రధాని మోదీని, దర్యాప్తు సంస్థలను తప్పుపడుతూ చేస్తున్న ప్రచారాన్ని ఆధారాలతో సహా తిప్పికొట్టాలి' అని అమిత్‌షా దిశా నిర్దేశం చేసినట్టు సమాచారం.

హెచ్3ఎన్2పై వైద్య శాఖ అప్రమత్తం

రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి ఫీవర్ సర్వే

- డీఎంహెచ్‌వోలకు ప్రభుత్వం ఆదేశం
- రెండు రోజుల్లో అన్ని బోధనాస్పత్రులకు టెస్టింగ్ కిట్‌లు
- రాష్ట్రంలో వైరస్ ప్రభావం లేనప్పటికీ ముందస్తు నియంత్రణ చర్యలు
- సీజన్ మారినప్పుడల్లా జలుబు, దగ్గు, జ్వరాలు మామూలేనంటున్న వైద్యులు



ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో హెచ్3ఎన్2 ప్రభావం లేనప్పటికీ ముందస్తు నియంత్రణ చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో జ్వరం, దగ్గు, జలుబు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారిని గుర్తించి వారికి వైద్య సహాయం అందించడానికి సోమవారం నుంచి ఫీవర్ సర్వేను చేపట్టనుంది. ఈ మేరకు ఇప్పటికే అన్ని జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖాధికారుల (డీఎంహెచ్‌వో)కు ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, గ్రామ, వార్డు వలంటీర్‌లు ఇంటింటికీ వెళ్లి ప్రజలను స్క్రీనింగ్ చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశించింది. శీతాకాలం ముగిసి వేసవి ప్రారంభమవుతున్న క్రమంలో వాతావరణ మార్పులతో దగ్గు, జలుబు, వైరల్ జ్వరాలు దేశవ్యాప్తంగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న సంగతి తెలిసిందే. ఇన్‌ఫ్లుయెంజా ఎ ఉపరకం హెచ్3ఎన్2 అనే వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతోందని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ఇప్పటికే వెల్లడించింది. కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ సైతం రాష్ట్రాలకు ఇప్పటికే పలు మార్గదర్శకాలు జారీ చేసింది.

సీజన్ మారడం వల్లే..

హెచ్3ఎన్2 ఫ్లూ అనుమానిత లక్షణాలున్న వారికి పరీక్షలు చేయడం కోసం టెస్టింగ్ కిట్‌లను వైద్య ఆరోగ్య శాఖ కొనుగోలు చేస్తోంది. రెండు రోజుల్లో అన్ని బోధనాస్పత్రులకు వీటిని పంపనుంది. ప్రస్తుతం తిరుపతి స్విమ్స్‌లోని వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో హెచ్3ఎన్2 నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇక్కడ జనవరిలో 12, ఫిబ్రవరిలో తొమ్మిది పాజిటివ్ కేసులను నిర్ధారించారు. అయితే ఆందోళన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. ఏటా సీజన్ మారుతున్న సమయంలో కేసులు కొంత పెరుగుతాయని అంటున్నారు. ప్రస్తుతం వేసవి సీజన్ మొదలవుతుండటంతో అవే పరిస్థితులు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఆస్పత్రులకు వస్తున్న బాధితులకు చాలా అరుదుగా మాత్రమే అడ్మిషన్ అవసరమవుతోందని చెబుతున్నారు. సాధారణంగా ఆస్పత్రులకు వచ్చే ఓపీల్లో 5 నుంచి 6 శాతం వరకు జ్వరం, దగ్గు, జలుబు వంటి కేసులే ఉంటాయని గుర్తు చేస్తున్నారు.

వైద్యులు సూచిస్తున్న జాగ్రత్తలు..

- క్రమం తప్పకుండా చేతులను సబ్బుతో కడుక్కోవాలి.
- ఫ్లూ లక్షణాలున్నవారు మాస్క్ ధరించాలి.
- వీలైనంత ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి.
- షేక్‌హ్యాండ్, ఆలింగనాలు మానుకోవాలి.
- బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మకూడదు.

కంగారు పడవద్దు..



వాతావరణం మారుతున్నప్పుడు సాధారణంగా జలుబు, దగ్గు, జ్వరం వంటివి వస్తాయి. వీటికే ప్రజలు కంగారు పడిపోవద్దు. ఈ లక్షణాలు ఉన్నవారు సమీపంలోని ఆశా వర్కర్, ఏఎన్ఎంలను సంప్రదించవచ్చు. వారు మందులు ఇవ్వడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను చెబుతారు. హెచ్3ఎన్2 ప్రభావం రాష్ట్రంలో లేదు. అయినప్పటికీ ముందు జాగ్రత్తల్లో భాగంగా నియంత్రణ చర్యలు తీసుకుంటున్నాం.
– డాక్టర్ రామిరెడ్డి, డైరెక్టర్, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ

రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారు జాగ్రత్త..



రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిపై వైరస్‌లు, బ్యాక్టీరియాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులు, షుగర్, హెచ్ఐవీ బాధితులు మాస్క్ ధరించాలి. జలుబు, దగ్గు, జ్వరం ఉంటే పారాసెటమాల్, బ్రూఫెన్ మాత్రలు, గొంతు ఉపశమనానికి విక్స్ బిళ్లలు వేసుకోవాలి. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలి. ఒసెల్టామివిర్ 75 ఎంజీ మాత్ర రోజుకు రెండుసార్లు వేసుకోవాలి.
– డాక్టర్ ఎస్.రఘు, సూపరింటెండెంట్, ఛాతీ, సాంక్రమిక వ్యాధుల ఆస్పత్రి, గుంటూరు

మారుమూల పల్లెల్లో బ్యాంకింగ్ సేవల విస్తరణ

- అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొత్తగా 11 బ్రాంచ్‌లు
- పార్వతీపురం మన్యం జిల్లాలో 6 శాఖలు
- డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై 15 నుంచి అవగాహన

సాక్షి, అమరావతి: బ్యాంకింగ్ రంగం మరింత విస్తరిస్తోంది. మైదాన, గిరిజన ప్రాంతాల్లోని మారుమూల పల్లెల్లో సైతం బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కార్యాచరణ సిద్ధమైంది. పరిపాలన సౌలభ్యం కోసం 13 జిల్లాలను 26 జిల్లాలకు విస్తరించిన ప్రభుత్వం ఆ దిశగా కొత్త జిల్లాల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించింది. రాష్ట్రంలో వివిధ బ్యాంకులకు చెందిన 7,769 బ్రాంచ్‌లున్నాయి. వీటిలో మెట్రో ప్రాంతాల్లో 764, అర్బన్‌లో 2,025, సెమీ అర్బన్‌లో 2,247, గ్రామీణ ప్రాంతాల్లో 2,733 ఉన్నాయి. గ్రామస్థాయిలో సచివాలయ, ఆర్బీకే వ్యవస్థలను ఏర్పాటుచేసిన ప్రభుత్వం అదే బాటలో బ్యాంకింగ్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించింది. 2019–20 నాటికి రాష్ట్రంలో 7,509 బ్రాంచ్‌లుండగా.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గత మూడేళ్లలో 260 కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటయ్యాయి. 2019లో 9,600 ఏటీఎంలు ఉండగా.. నేడు వాటిసంఖ్య 10,553కు చేరింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇప్పటికే 11 గ్రామాలు కొత్త బ్రాంచ్‌ల ఏర్పాటుకు అనువైనవని గుర్తించి సిఫార్సు చేశారు. ఆ మేరకు ఎస్‌బీఐ, యూబీఐలు మూడేసి, ఏపీజీవీ బ్యాంక్ రెండు, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, డీసీసీబీ ఒక్కొక్క బ్రాంచి ఏర్పాటుకు ప్రతిపాదించాయి. తొలిదశలో ఆ గ్రామాల్లో కొత్త బ్రాంచ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. మారేడుమిల్లి, ఏటిపాక, కొయ్యూరులతోపాటు రాజవొమ్మంగి మండలం లబ్బర్తి లేదా రాజవొమ్మంగిలో ఎస్‌బీఐ, యూబీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఏపీజీవీ బ్యాంక్ బ్రాంచ్‌లు ఏర్పాటు చేయనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో జనాభా ప్రాతిపదికన ఆరు గ్రామాల్లో కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. జియ్యమ్మవలస మండలం బొమ్మిక, కొమ్మరాడ మండలం గంగరేగువలస, కురుపాం మండలం మొండెంఖల్లు, పచ్చిపెంట మండలం మాతుమూరు, పి.కోనవలస, భమిని మండలం గురండి గ్రామాల్లో కొత్త బ్రాంచ్‌ల ఏర్పాటుకు ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూబీఐ ముందుకొచ్చాయి. రాష్ట్రంలో మండల కేంద్రానికి ఐదు కి.మీ. పరిధిలో మూడు వేలకు పైగా జనాభా ఉండి, బ్యాంక్ శాఖ గానీ, పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సెంటర్‌గానీ లేని 21 గ్రామాలను గుర్తించి వీటిలో బ్యాంకు శాఖల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

6 నెలలపాటు అవగాహన

ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్, డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన కల్పించేందుకు పంచాయతీ స్థాయిలో 15 నుంచి ఆరు నెలల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలకు కార్యాచరణ సిద్ధం చేశారు. ప్రతి పౌరుడితో బ్యాంక్ ఖాతా తెరిపించడం, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి బీమా, పింఛన్ పథకాలను వర్తింపజేయడం, ముద్ర, జగనన్న తోడు పథకాల కింద రుణపరపతి కల్పించడమేగాక కిసాన్ క్రెడిట్ కార్డులు జారీచేయనున్నారు. ఆర్బీకేలకు అనుబంధంగా నియమించిన బ్యాంకింగ్ కరస్పాండెంట్లకు సామర్థ్యం పెంపు (కెపాసిటీ బిల్డింగ్)పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

పదేళ్లైనా.. ఫ్చ్!

- జనసేన అనుకూల పవనాలు ఇంకా రాలేదు
- కాపు సంక్షేమసేన సమావేశంలో పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి: జనసేన పార్టీ ఏర్పాటై పదేళ్లు పూర్తవుతున్నా పార్టీకి అనుకూల పవనాలు ఇంకా రాలేదని పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. కాపులందరూ ఓటు వేసి ఉంటే భీమవరం, గాజువాకలో తాను ఓడిపోయేవాడిని కాదన్నారు. 'రాష్ట్రంలో ఇంత సంఖ్యా బలం ఉన్న కాపు, బలిజ కులాలకు నిజంగా కట్టుబాటు ఉంటే వేరేవారు అధికారంలోకి వచ్చే పరిస్థితి ఉంటుందా? ఇది గ్రహించనంత వరకు రాజ్యాధికారాన్ని మరిచిపోండి' అని పేర్కొన్నారు. ఆదివారం మంగళగిరిలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో కాపు సంక్షేమ సేన ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం బదలాయింపు జరగాలంటే కాపులు పెద్దన్న పాత్ర వహించి బీసీలు, ఎస్సీలను కూడగట్టి కమ్మ, రెడ్డి, క్షత్రియులకు గౌరవం ఇచ్చి తీరాలన్నారు. 'మా అమ్మ గాజుల బలిజ, నాన్న కాపు. నా కులం ఉనికిని నేను ఎప్పుడూ తీసివేయలేదు. నా కులం వాస్తవం. కాపులు ఐక్యంగా ఉంటే దక్షిణాదిలో బలమైన శక్తిగా ఎదగవచ్చు' అని పేర్కొన్నారు. కాపులు కోస్తాలో గొంతు ఎత్తగలరుగానీ రాయలసీమలో బలిజలు నోరెత్తేందుకు భయపడతారని, ఐక్యత లేకపోవడమే అందుకు కారణమన్నారు.

సీఎం పదవిస్తేనే పొత్తు!

ముఖ్యమంత్రి పదవి ప్రాతిపదికనే ఏ పార్టీతోనైనా పొత్తులు ఉండాలని కాపు సంక్షేమ సేన పవన్ కళ్యాణ్‌కు సూచించింది. ఆదివారం నిర్వహించిన సమావేశంలో హరిరామ జోగయ్య మాట్లాడుతూ జనసేనను బలహీనపరిచేందుకు టీడీపీ పలు ప్రయత్నాలు చేస్తోందని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ రెండింటితో యుద్ధాన్ని ప్రకటించి ముందుకు వెళ్లాలని తాను పవన్‌కళ్యాణ్‌ను కోరుతున్నట్టు చెప్పారు. లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకోనని మాటిస్తున్నట్లు ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. అవమానాలు ఎదుర్కొంటూ తానెందుకు ఉంటానని ప్రశ్నించారు. 'నమ్మిన వారిని తగ్గించం. ఎవరి అజెండాల కోసమూ పనిచేయం' అని తెలిపారు.

సచివాలయ వ్యవస్థకు చట్టబద్ధత

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

- ప్రస్తుతం ఆర్డినెన్స్ రూపంలో అమలు
- ప్రభుత్వ సేవలన్నీ సచివాలయాల వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే
- అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం జగన్
- ఒకే విడత 1.34 లక్షల మందికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల కల్పన

సాక్షి, అమరావతి: కుగ్రామం, నగరం అన్న తేడా లేకుండా ప్రజలందరికీ వారి సొంత ఊళ్లో ప్రభుత్వ సేవలన్నీ అందుబాటులో తెచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించేందుకు సంబంధించిన బిల్లును ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ 2022 డిసెంబర్‌లో జారీచేసిన ఆర్డినెన్స్ స్థానంలో అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి.. ఆ వ్యవస్థకు పూర్తి చట్టబద్ధతను కల్పించనుంది. ఇప్పటికే ఆర్డినెన్స్‌లో పేర్కొన్న వివరాల మేరకు ఇందుకు సంబంధించి ముసాయిదా బిల్లును గ్రామ, వార్డు సచివాలయ శాఖ అధికారులు రూపకల్పన చేస్తున్నారు. ఈ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు ముందు ఈ నెల 14న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో ఆమోదానికి వెళ్లనున్నట్టు అధికారులు వెల్లడించారు.

జగన్ సీఎం అయ్యాక 4 నెలలకే ఈ వ్యవస్థకు శ్రీకారం

జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన వెంటనే 2019 అక్టోబరు 2వ తేదీ నుంచి రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ సచివాలయాల్లో పనిచేసేందుకు అప్పటికప్పుడే కొత్తగా 1.34 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు మంజూరు చేశారు. వెంటనే ఉద్యోగాలను భర్తీ చేశారు. ఇవన్నీ కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే ప్రభుత్వం పూర్తిచేసింది.

- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి రెండువేల జనాభాకు ఒక సచివాలయం చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు కొలువుదీరాయి.
- అంతకుముందు వరకు కనీసం ఒక్క శాశ్వత ఉద్యోగి కూడా నియామకం జరగని చాలా గ్రామాల్లో కొత్తగా ఏర్పాటైన సచివాలయాల్లో పది నుంచి 11 మంది వరకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వం నియమించింది.
- కుగ్రామాలతోసహా ప్రతి చోటా.. ప్రజలకు తమ గ్రామ సచివాలయంలోనే ప్రభుత్వ సేవలన్నీ అందేలా ఏర్పాటు చేసింది. 545 రకాల ప్రభుత్వ సేవలను సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతి సచివాలయానికి ఇంటర్‌నెట్ వసతితోపాటు కంప్యూటర్లు, ప్రింటర్లసహా ఇతర ఫర్నిచర్‌ను ప్రభుత్వం అందజేసింది.
- ఇప్పటివరకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలు వారి సొంత ఊరు దాటాల్సిన అవసరం కూడా లేకుండా దాదాపు ఏడుకోట్లకు పైగా ప్రభుత్వ సేవలను వినియోగించుకున్నారు.

ఉద్యోగులకు బకాయిల చెల్లింపు ప్రారంభం

- నేడు ఏపీజీఎల్ఐ క్లెయిమ్స్ నగదు ఉద్యోగుల ఖాతాల్లో జమ
- జీపీఎఫ్ బిల్లుల్లో కొన్ని క్లియర్
- మంత్రివర్గ ఉప సంఘం హామీ మేరకు చర్యలు

సాక్షి, అమరావతి: ఈ నెల ఏడో తేదీన జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం ఇచ్చిన హామీ మేరకు ఆరు రోజుల్లోనే ఉద్యోగులకు వివిధ రకాల బకాయిల చెల్లింపులను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ నెల 31వ తేదీలోగా ఉద్యోగులకు సంబంధించిన రూ.3వేల కోట్ల బకాయిలను చెల్లిస్తామని మంత్రివర్గ ఉప సంఘం హామీ ఇచ్చింది. ఈ మేరకు ఆర్థిక శాఖ తొలుత ఏపీజీఎల్ఐ క్లెయిమ్‌లను చెల్లించేందుకు సర్వం సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించిన నగదు సోమవారం ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమకానుంది. అలాగే జీపీఎఫ్‌కు సంబంధించిన కొన్ని బిల్లులను కూడా ఆర్థిక శాఖ క్లియర్ చేసింది. మంత్రివర్గ ఉప సంఘం చెప్పిన విధంగా ఉద్యోగులకు ఈ నెల 31వ తేదీలోపు రూ.3వేల కోట్ల బకాయిలను చెల్లించేందుకు ఆర్థిక శాఖ చర్యలు చేపట్టింది.

హామీని నెరవేరుస్తున్న ప్రభుత్వం: ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ఈ నెల 31 నాటికి ఉద్యోగులకు సంబంధించిన వివిధ బకాయిలు రూ.3వేల కోట్లను చెల్లిస్తామని మంత్రివర్గ ఉప సంఘం ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేరుస్తోందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ అరవ పాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హామీల అమల్లో భాగంగా మొదటగా ఏపీజీఎల్ఐ క్లెయిమ్స్‌ను క్లియర్ చేసేందుకు చర్యలు చేపట్టామని, ఇందుకు సంబంధించిన నగదు సోమవారం ఉద్యోగుల ఖాతాల్లో జమ అవుతుందని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారని ఆయన పేర్కొన్నారు. జీపీఎఫ్‌కు సంబంధించి కూడా కొన్ని బిల్లులు క్లియర్ చేసినట్లు చెప్పారని, మిగతా బిల్లులు కూడా షెడ్యూల్ ప్రకారం మార్చి 31లోపు చెల్లిస్తామని తెలిపినట్లు అరవ పాల్ వివరించారు.

పవన్.. సామాజిక న్యాయంపై చర్చకు సిద్ధమా?

- జనసేన అధినేతకు మంత్రి జోగి రమేష్ సవాల్
- చర్చకు రండి... బీసీలకు ఎవరు మేలు చేశారో తేలుద్దాం



సాక్షి, అమరావతి: పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు, సోము వీర్రాజు.. ముగ్గురూ కలిసి 2014 ఎన్నికలప్పుడు బీసీలకు సంబంధించి 125 హామీలతో ఒక పెద్ద మేనిఫెస్టో విడుదల చేసి, అందులో ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మోసం చేశారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మండిపడ్డారు. అటువంటి పవన్ కళ్యాణ్ బీసీల కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించటం ఏమిటని, వారికి క్షమాపణలు చెప్పాలని నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగి రమేష్ మాట్లాడుతూ బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు పవన్‌కు లేదన్నారు. 'జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, బీసీ డిక్లరేషన్ చేస్తామని నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఆ సభకు నేను ఒక్కడినే వస్తాను. ఆ వేదిక మీద సామాజిక న్యాయంపై చర్చిద్దాం. అందుకు మీరు సిద్ధమా?' అని పవన్‌కు సవాల్ విసిరారు. జనసేన ఆవిర్భవించిన ఈ పదేళ్లలో ఏనాడూ బీసీల గురించి మాట్లాడలేదని ధ్వజమెత్తారు. చంద్రబాబు చంక నాకటం తప్ప పవన్‌కు ఏమి తెలియదని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు పెద్ద పాలేరు పవన్ అని దుయ్యబట్టారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే..

బీసీల పొట్ట కొట్టింది చంద్రబాబే..

- బీసీల గురించి డిక్లరేషన్ చేయడం కాదు.. దమ్ముంటే 175 చోట్ల పోటీ చేస్తామని ప్రకటించండి. లేకుంటే చంద్రబాబు ప్యాకేజీకి అమ్ముడుపోనని ప్రకటించండి. బీసీలు, కాపులతో బాబు పల్లకీ మోయించడమే పవన్ ఉద్దేశం. సీఎం వైఎస్ జగన్ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం దేశమంతా చూసింది. ఎన్నో రాష్ట్రాలు పలు విషయాల్లో ఏపీ బాటలో నడిచేందుకు ఆసక్తి చూపుతున్నాయి.
- నిజానికి బీసీల పొట్టకొట్టింది చంద్రబాబు. అందుకే ఆయన్ను 2019 ఎన్నికల్లో తరిమి కొట్టాం. 2024 ఎన్నికల్లో చంద్రబాబు కనిపించరు. సీఎం జగన్‌ను బీసీలు గుండెల్లో పెట్టుకున్నారు.
- బీసీల్లో ఉన్న 139 కులాల వారిని ఒకే తాటి పైకి తెచ్చిన ఘనత సీఎం జగన్‌దే. మాపై అంతులేని ప్రేమ చూపడమే కాక అధికారంలో భాగస్వామ్యం ఇచ్చారు. విద్య, వైద్యాన్ని మా దరికి చేరుస్తున్నారు. గతంలో సీఎం జగన్ గురించి తెలియని వారు కూడా, ఇప్పుడు అర్థం చేసుకుని ఆదరిస్తున్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబుతో పవన్ పొత్తు పెట్టుకున్నా, ఒక్క బీసీ కూడా వారి వెంట వెళ్లడు.

దత్తపుత్రుడుకి కులదైవం, మత దైవం బాబే

- అప్పుడప్పుడు బయటకొచ్చే ప్యాకేజీ స్టార్ ఇప్పుడు బీసీ మంత్రం జపిస్తున్నాడు
- రాష్ట్రంలో ఉనికి కోసం పవన్ పాట్లు
- కులం లేదనే ఆయన గంటకోమారు కులాల కుంపటి పెడతాడు
- మంత్రి బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న మంత్రి బొత్స, పంచకర్ల రమేష్‌బాబు

సాక్షి, విశాఖపట్నం : దత్తపుత్రుడికి కులదైవం, మత దైవం అన్నీ చంద్రబాబేనని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఏం చెబితే అది బయటకొచ్చి చెప్పడం.. తమ ప్రభుత్వంపై బురద జల్లడమే ఎజెండాగా వారిద్దరూ పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్యాకేజీ స్టార్ ఇప్పుడు కొత్తగా బీసీ మంత్రం జపిస్తున్నాడని.. బీసీలంతా ఒక్కటవ్వాలనీ కొత్త నినాదం ఇస్తున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో తన ఉనికి కోసమే పవన్ పాట్లు పడుతున్నారన్నారు. ఆదివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో 26 బీసీ కులాలను తీసేశారని, అప్పుడు తాము అధికారంలో లేకపోయినా తమ పార్టీ తరఫున పోరాడామని.. ఆ అంశంపై న్యాయ స్థానానికి వెళ్లడానికి కూడా ప్రయత్నించామని గుర్తుచేశారు. కానీ, అప్పుడు చంద్రబాబుతో కలిసి అధికారంలో ఉన్న నువ్వేం చేశావని పవన్‌ను బొత్స ప్రశ్నించారు. ఇప్పుడు బీసీలకు న్యాయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను వ్యతిరేకించడమేంటని మండిపడ్డారు. ఇక రాష్ట్రంలో రూ. 2 లక్షల కోట్లు డీబీటీ ద్వారా ఇస్తే అందులో 50 శాతం బీసీల కోసమే తమ ప్రభుత్వం ఖర్చుచేసిందని, లెక్కలతో సహా చెప్పడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఇక నిన్న గాక మొన్న 18 ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులను ప్రకటిస్తే అందులో 11 మంది బీసీలకే ఇచ్చిన ఘనత మా వైఎస్సార్‌సీపీదని గుర్తుచేశారు.

కులం లేదంటాడు. కానీ..

పవన్‌కళ్యాణ్ కాసేపు కులం లేదంటాడని, మళ్లీ కాసేపటికే కులం కులం అంటాడని బొత్స ఎద్దేవా చేశారు. తూర్పు కాపుల్లో బొత్స ఒక్కడే మంత్రి అయితే ఆ కులం బాగుపడుతుంది అనుకుంటే పొరపాటేనని.. తన కంటే ముందు చాలామంది మంత్రులుగా పనిచేశారని.. వారివల్ల బాగుపడ్డది ఉందా.. అలాగే, నీవల్ల కాపులకు ఏమైనా ఒరిగిందా.. అని ప్రశ్నించారు.

ఆర్డీఎస్ఎస్‌తో డిస్కంల అభివృద్ధి

ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు ప్రపంచస్థాయి సేవలు అందించేలా విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లను పునరుద్ధరణ పంపిణీరంగ పథకం (ఆర్డీఎస్ఎస్) ద్వారా అభివృద్ధి చేస్తున్నట్లు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెప్పారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ మద్దతుతో రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.11 వేల కోట్ల పెట్టుబడి పెడుతోందని తెలిపారు. ఈ మొత్తం పెట్టుబడిలో 60 శాతం కేంద్రం నుంచి గ్రాంట్‌గా పొందవచ్చని చెప్పారు. ఆయన ఆదివారం ఇంధనశాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్డీఎస్ఎస్ ద్వారా డిస్కంలు బలోపేతం కావడం వల్ల అన్నివర్గాల వినియోగదారులకు అధిక నాణ్యత గల విద్యుత్‌ను అందించవచ్చనితెలిపారు. విద్యుత్ సంస్థ (పవర్ యుటిలిటీస్)ల ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నష్టాల తగ్గింపు, ఇంధన సామర్థ్యం, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, పంప్డ్ హైడ్రో స్టోరేజి ప్రాజెక్టులు మొదలైన వాటితోసహా అనేక రాష్ట్ర ప్రభుత్వం పథకాలను నవరత్నాల కింద విజయవంతంగా అమలు చేస్తున్నట్లు వివరించారు. తద్వారా గత మూడునెలల స్వల్ప వ్యవధిలో విద్యుత్ సంస్థలు జాతీయస్థాయిలో ఆరు అవార్డులు సాధించాయని చెప్పారు. 9 గంటల పగటిపూట ఉచిత విద్యుత్ సరఫరాతోపాటు వ్యవసాయానికి సబ్సిడీ రూపంలో రూ.8,400 కోట్లు ఏటా కేటాయిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లను అమర్చడం వల్ల డిస్కంలకు, రైతులకు ప్రయోజనమని చెప్పారు. ఏ రైతు తమ జేబులోంచి ఒక్కపైసా చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే బిల్లు మొత్తాన్ని రైతుల ఖాతాలో జమచేస్తుందని చెప్పారు. 16,66,282 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు బిగించాలని నిర్ణయించగా.. 16,55,988 కనెక్షన్లకు సంబంధించిన రైతులు అంగీకారం తెలిపారని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, డిస్కంల సీఎండీలు జె.పద్మజనార్దనరెడ్డి, కె.సంతోషరావు, ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

పర్యాటకంలో మౌలిక వసతులకు పెద్దపీట

- ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద వినియోగంలోకి ఏపీటీడీసీ ఆస్తులు
- 15 చోట్ల హోటళ్లు, రెస్టారెంట్లు, టూరిస్ట్ సెంటర్ల నిర్వహణకు టెండర్లు
- పర్యాటకులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు స్థానికులకు ఉపాధి

సాక్షి, అమరావతి: పర్యాటక రంగంలో పెద్దఎత్తున మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడంపై ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఏపీటీడీసీకి చెందిన వివిధ ఆస్తులను ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) ప్రాతిపదికన వినియోగంలోకి తెస్తోంది. 10 జిల్లాల్లో సుమారు 15 చోట్ల హోటళ్లు, రెస్టారెంట్లు, గెస్ట్‌హౌస్‌లు, టూరిస్ట్ ఎమినిటీస్ సెంటర్ల నిర్వహణకు టెండర్లు ఆహ్వానించింది. ఇటీవల రాష్ట్రంలో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కోవిడ్‌లో గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్న పర్యాటక రంగం ఇప్పుడు గణనీయంగా వృద్ధి చెందింది. ఈ క్రమంలోనే పర్యాటక ప్రాంతాల్లోని వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు ఏపీటీడీసీ ప్రణాళికలు రూపొందించింది.

ఓ అండ్ ఎం నిర్వహణకు ఇలా..

వైఎస్సార్ జిల్లాలోని బ్రహ్మగిరి మఠం (టూరిస్ట్ గెస్ట్‌హౌస్), ఆడపూర్ (టూరిస్ట్ సెంటర్), ఇడుపులపాయ (హోటల్–రెస్టారెంట్), ఏలూరు జిల్లాలోని కొంగువారి గూడెం (హరిత రిసార్ట్), అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అడ్డూరు (టూరిస్ట్ సెంటర్), కర్నూలు జిల్లాలోని గార్గేయపురం (హరిత లేక్‌వ్యూ రెస్టారెంట్), అనంతపురం జిల్లాలోని మడకశిర (రెస్టారెంట్), లేపాక్షి (హరిత హోటల్), ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్, నెల్లూరు జిల్లాలోని కస్మూర్ దర్గా (రెస్టారెంట్), గొలగమూడి (టూరిస్ట్ సెంటర్), ప్రకాశం జిల్లాలోని చందవరం (రెస్టారెంట్), చిత్తూరు జిల్లాలోని అలిపిరి (103 గదుల హోటల్), పల్నాడు జిల్లాలోని అమరావతి (ధరణి గెస్ట్‌హౌస్), విశాఖపట్నం జిల్లాలోని రుషికొండ (ఫుడ్‌కోర్టు)ను ఓ అండ్ ఎం కింద నిర్వహించేందుకు టెండర్లు పిలిచింది. వీటిని వినియోగంలోకి తీసుకురావడం ద్వారా పర్యాటకులకు సౌకర్యాలను అందించడంతో పాటు స్థానికులకు ఉపాధిని కూడా కల్పించనుంది.

వీపున కత్తిపోటు.. ప్రాణం పోసిన కర్నూలు పెద్దాస్పత్రి

- వీపున కత్తితో అలాగే వచ్చిన వ్యక్తికి శస్త్రచికిత్స



శ్రీనివాసరెడ్డి



ఆపరేషన్ చేసి తొలగించిన కత్తి

కర్నూలు(హాస్పిటల్): కత్తిపోట్లకు గురై వీపున కత్తితో వచ్చిన ఓ వ్యక్తికి కర్నూలు వైద్యులు సకాలంలో స్పందించి శస్త్రచికిత్స చేసి ప్రాణం పోశారు. వైఎస్సార్ జిల్లా ముద్దనూరుకు చెందిన శ్రీనివాసరెడ్డికి ఆస్తి వివాదాలు ఉండటంతో కొంత కాలంగా అనంతపురం పట్టణంలోని మారుతినగర్‌కు వచ్చి స్థిరపడ్డాడు. శనివారం రాత్రి భోజనం ముగించుకుని బయట వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై కత్తులతో దాడి చేశారు. ఈ ఘటనలో ఓ కత్తి శ్రీనివాసరెడ్డి వీపున అలాగే దిగబడిపోయింది. వెంటనే అతన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కర్నూలు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. విషయం తెలుసుకున్న కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ వెంటనే కార్డియోథొరాసిక్ హెచ్‌వోడి డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డికి ఫోన్ చేశారు. శ్రీనివాసరెడ్డి ఆరోగ్యపరిస్థితి గురించి అక్కడి వైద్యులు, పోలీసులతో మాట్లాడారు. వెంటనే కర్నూలుకు తీసుకురండి ఆపరేషన్ చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. దీంతో అర్ధరాత్రి దాటాక 1.30 గంటల సమయంలో శ్రీనివాసరెడ్డిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చారు. తెల్లవారుజాము నుంచే ఎక్స్‌రే, సీటీస్కాన్ తీసి కత్తి ఎంత వరకు వెళ్లిందో పరిశీలించారు. ఆదివారం ఉదయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరికృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్రలతోపాటు అనస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ కొండారెడ్డితో కలిసి శ్రీనివాసరెడ్డికి ఆపరేషన్ చేసి ప్రాణం పోశారు. ప్రస్తుతం శ్రీనివాసరెడ్డి కోలుకుంటున్నారని వివరించారు.

సాగరంలో సీ–వీడ్ సాగు!

- ఇందుకు విశాఖ తీరం అనుకూలం
- మత్స్యకార, డ్వాక్రా మహిళలకు అవకాశం
- విశాఖ, అనకాపల్లి జిల్లాకు 2,700 యూనిట్లు మంజూరు
- సీవీడ్‌లో అత్యధిక ఔషధ గుణాలు
- రాష్ట్రంలో తొలిసారిగా దీని సాగుకు మత్స్యశాఖ సన్నాహాలు



సముద్రంలో సీ-వీడ్ సాగుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: ఎన్నో పోషక విలువలు, మరెన్నో ఔషధ గుణాలు కలిగిన సీ–వీడ్ (మొక్కలాంటి ఒక రకం సముద్రపు నాచు) సాగుపై ఆసక్తి పెరుగుతోంది. ఇందుకు విశాఖ సాగర తీరం ఎంతో అనుకూలంగా ఉంది. మారుతున్న జీవనశైలి, ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతున్న నేపథ్యంలో సీ–వీడ్, దీని ఆధారిత ఆహార ఉత్పత్తులపై ప్రజలకు మక్కువ అధికమవుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐఏఆర్ఐ), సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (సీఐఎఫ్‌టీ)లు ఈ సీ–వీడ్ సాగును ప్రోత్సహిస్తున్నాయి. సీ–వీడ్‌తో విభిన్న ఆహార ఉత్పత్తుల తయారీపై ఆసక్తిని, వినియోగాన్ని పెంచడంపై దృష్టి సారిస్తున్నాయి. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే సీ–వీడ్‌తో సూప్‌లు, నూడుల్స్, పాస్తాల్లో పొడి, రోల్ రూపంలో తినడానికి వీలుగా తయారు చేస్తున్నారు. ఇంకా బిస్కెట్లు, కుకీస్, న్యూట్రియెంట్ బార్స్, బ్రెడ్లు, సాచెట్లు వంటివి తయారీకి సన్నాహాలు జరుగుతున్నాయి. సీ–వీడ్‌తో తినే పదార్థాలు, సూప్, సాచెట్లు వంటివి తయారుకు అవసరమైన సాంకేతికతను విశాఖలోని ఐకార్–సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు.

ఉమ్మడి విశాఖలో అనుకూల ప్రాంతాలు

ఆంధ్రప్రదేశ్‌లో 49 ప్రాంతాల్లో తీరానికి ఆనుకుని సముద్రంలో 1,215 హెక్టార్లు సీ–వీడ్ పెంపకానికి అనువైన ప్రాంతం ఉన్నట్టు సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) శాస్త్రవేత్తలు గుర్తించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆర్కే బీచ్ వద్ద 40 హెక్టార్లు, వుడా పార్క్ 10, తెన్నేటి పార్క్ 50, తొట్లకొండ 25, భీమిలి 25, తిమ్మాపురం 50, మంగమారిపేట 50, ఎండాడ 25, ముత్యాలమ్మపాలెం 25, పూడిమడక 50, బంగారమ్మపాలెం 25, రాంబిల్లి ప్రాంతంలో 25 వెరసి 400 హెక్టార్లు అనుకూలంగా ఉందని తేల్చారు.

మంగమారిపేటలో పైలట్ ప్రాజెక్టు

సీ–వీడ్ సముద్రంలో సహజ సిద్ధంగానే పెరుగుతుంది. ఇప్పుడు దీనిని కృత్రిమంగానూ పెంచేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పైలట్ ప్రాజెక్టు కింద భీమిలి మండలం మంగమారిపేటను సీ–వీడ్ సాగు కోసం ఎంపిక చేశారు. సీఎంఎఫ్ఆర్ఐ నేతృత్వంలో అక్కడ రాఫ్ట్ మోడల్‌లో కప్పాఫాగస్ అనే రకం సీ–వీడ్‌ను సాగు చేయనున్నారు. సముద్రతీరానికి 250–300 మీటర్ల దూరంలో కెరటాల ఉధృతి తక్కువగా ఉన్న ప్రాంతంలో సీ–వీడ్ సాగుకు అనువుగా ఉంటుంది. అక్కడ వెదురుకర్రలతో మంచాల మాదిరిగా సముద్రంపై తేలియాడేలా రాఫ్ట్‌లను నిర్మిస్తారు. అవి కెరటాలకు కొట్టుకుపోకుండా దిగువన సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేసి వాటిని గొలుసులతో కడ్తారు.

2,700 యూనిట్ల మంజూరు

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు 2,700 సీ–వీడ్ యూనిట్లు మంజూరయ్యాయి. ఒక్కొక్కరికి కనీసం 10 యూనిట్లు కేటాయించవచ్చు. ఒక్కో యూనిట్ విలువ రూ.1,500 ఉంటుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం చొప్పున సబ్సిడీ ఇస్తారు. ఒకసారి వేసిన సీ–వీడ్ 40–45 రోజుల్లో కోతకు వస్తుంది. పది కిలోల సీ–వీడ్ విత్తనం వేస్తే వంద కిలోల దిగుబడినిస్తుంది. అనంతరం దానిని పది రోజుల పాటు ఎండబెట్టాల్సి ఉంటుంది. పది కిలోల పచ్చి సీ–వీడ్ ఎండాక మూడు కిలోలకు తగ్గుతుంది. ప్రస్తుత మార్కెట్లో కిలో సీ–వీడ్ ధర రూ.వెయ్యి వరకు ఉంది. ఇలా ఏడాదిలో వర్షాకాలం 2–3 నెలలు మినహా మిగతా కాలమంతా సీ–వీడ్ సాగుకు అనుకూలమే.


సీ–వీడ్‌తో ప్రయోజనాలివీ..

సీ–వీడ్‌లో తినడానికి వీలయ్యే 221 రకాల జాతులున్నాయి. వీటిలో సోడియం, కాల్షియం, క్లోరిన్, మెగ్నీషియంలతో పాటు ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్లు, ఫోలిక్ యాసిడ్లు, తక్కువ కొవ్వు, కేలరీలు ఉంటాయి. సీ–వీడ్‌తో తయారైన ఆహార పదార్థాలను తినడం వల్ల క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, హెచ్ఐవీ, కోవిడ్ వంటివి నియంత్రణలోకి వస్తాయని సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పౌష్టికాహారంగా మునగాకు

అంగన్‌వాడీల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ

ఆకివీడు: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. అందులో భాగంగా మునగ చెట్ల ఆకుల్ని వారానికి రెండు రోజులు అందజేసే ప్రక్రియ విజయవంతంగా నడుస్తోంది. మునగ ఆకు పప్పు, మునగ ఆకు రసం, లేదా కూర రూపంలో వారానికి రెండు రోజులు అందజేయడం ద్వారా వారికి పౌష్టికాహారం సమృద్ధిగా లభిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాలలోని పెరటిలో ఆకుకూరలు, మునగ మొక్కల్ని పెంచాలని ప్రభుత్వం సూచించింది. మునగ ఆకులో ఐరన్, విటమిన్ ఏ, సీ, యాంటీ ఆక్సిడెంట్స్, కాల్షియం, అమినో యాసిడ్స్, ఫాస్పరస్, ప్రొటీన్లు, క్లోరోజెనిక్ యాసిడ్, నీరు, పిండి పదార్థాలు, ఫ్యాట్స్, మాంసకృతులు ఉన్నాయి. ఇలాంటి బలవర్ధక ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్నారు. మునగ రక్త హీనతను, కంటి చూపును తొలగిస్తుంది. వ్యాధి నిరోధక శక్తిని అందిస్తుంది. గర్భిణీల్లో పిండం ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడుతుంది. ఎముకల పటుత్వంతో పాటు థైరాయిడ్‌ను తగ్గిస్తుంది. బాలింతల్లో పాల ఉత్పత్తిని పెంచుతుంది. సుఖ ప్రసవానికి సహకరిస్తుంది. ఆరోగ్యకరమైన కొవ్వును అందిస్తుంది. రక్తంలో సుగర్ స్థాయిల్ని తగ్గిస్తుంది. ఆస్తమా, టీబీ, పొడి దగ్గులు దరికి చేరనివ్వవు. మహిళలకు మునగాకు వరప్రదాయిని.



మునగ ఆకులు

వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఒక వరం

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా వారంలో ప్రతి శుక్రవారం మునగ ఆకు, పప్పుకూర, మరో రెండు రోజులు బుధ, గురువారాల్లో ఆకుకూరల పప్పును అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్నారు. జిల్లాలోని 1562 అంగన్‌వాడీ కేంద్రాల్లో 10,200 మంది గర్భిణులు, 8,400 మంది బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 71,600 మందికి మధ్యాహ్న భోజనం ద్వారా సంపూర్ణ పోషణ అందుతుంది.

మునగాకులో మంచి పోషకాలు



గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాలున్న ఆహారం అందజేస్తున్నాం. మునగ ఆకును పప్పు కూరగా ఒక రోజు ఇస్తున్నాం. మునగాకులో విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉన్నాయి. అపర సంజీవనిగా మునగాకును మన పూర్వీకుల నుంచి ఉపయోగిస్తున్నాము.

–సుజాతా రాణి, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ, పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం

ఆకుకూరలతో పాటు మునగాకు



మా జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆకు కూరలతో పాటు అప్పుడప్పుడూ మునగ ఆకు కూర కూడా పెడుతున్నాం. మునగాకు తీసుకుంటే రక్తహీనత ఉండదు. ఎముకల పటుత్వం పెరుగుతుంది.

–శ్రీకాళహస్తీశ్వరుడు, ప్రధానోపాధ్యాయుడు, పెదకాపవరం, ఆకివీడు మండలం

బోయింగ్ -737.. ఇక ఫ్రైటర్

- ప్యాసింజర్ విమానానికి సరుకు రవాణా ఫ్రైట్‌గా మార్పులు
- హైదరాబాద్ కేంద్రంగా మొదటిసారి చేపట్టిన ప్రాజెక్ట్
- జీఎమ్మార్ ఎయిరో టెక్నిక్–బోయింగ్ మధ్య ఒప్పందం




సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల విమానాలను ఫ్రైటర్లుగా మార్చే సరికొత్త ప్రాజెక్టు హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కేంద్రంగా ప్రారంభమైంది. ప్రయాణికులకు రవాణా సదుపాయాన్ని కల్పిస్తున్న బోయింగ్–737 విమానాన్ని ఫ్రైటర్‌గా మార్చనున్నారు. ఈ మేరకు విమానాశ్రయంలో మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాలింగ్ (ఎంఆర్ఓ) సేవలు అందజేసే జీఎమ్మార్ ఎయిరో టెక్నిక్ (జీఏటీ)కి, బోయింగ్ సంస్థకు మధ్య తాజాగా ఒప్పందం కుదిరింది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు తరువాత అతిపెద్ద ఎయిర్‌పోర్టుగా సేవలందిస్తున్న హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలోనే మొట్టమొదటిసారి విమానాల మార్పు రంగంలోకి అడుగుపెట్టినట్లయింది. ఈ తరహా కన్వర్షన్ సాంకేతిక పరిజ్ఞానం అమలులో చైనా, బ్రిటన్, కోస్టారికా తరువాత నాలుగో స్థానంలో హైదరాబాద్ నిలిచినట్లు ఎయిర్‌పోర్టు అధికారవర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందం మేరకు బోయింగ్ –737 నుంచి బోయింగ్ –800 వరకు ప్రయాణికుల విమానాలను బోయింగ్ కన్వర్టెడ్ ఫ్రైటర్స్ (బీసీఎఫ్)గా మార్పు చేయనున్నారు. ఈ ఏడాది నుంచి రానున్న ఐదేళ్లలో 30 విమానాలను ఫ్రైటర్లుగా అభివృద్ధి చేయనున్నారు.

ఒప్పందం ప్రతిష్టాత్మకం

విమానాల కన్వర్షన్ కోసం బోయింగ్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాలింగ్ కేంద్రాల నుంచి బిడ్‌లను ఆహ్వానించగా చివరకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టులోని ఎంఆర్ఓకు ఈ కాంట్రాక్ట్ లభించడం విశేషం. రానున్న రోజుల్లో బోయింగ్ సరుకు రవాణా రంగంలో తన సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. సుమారు 75 ఫ్రైటర్లను బోయింగ్ అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది. దీంతో ఎయిర్ కార్గోలో ఇది 6.3 శాతం వరకు విస్తరించనుందని పేర్కొన్నారు. మరోవైపు ఈ–కామర్స్ రంగం పెద్దఎత్తున అభివృద్ధి చెందిన దృష్ట్యా హైదరాబాద్ నుంచి అమెరికాతోపాటు వివిధ దేశాలు, మన దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు మధ్య ఫ్రైటర్స్ డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. కోవిడ్ దృష్ట్యా అంతర్జాతీయంగా రాకపోకలు తగ్గుముఖం పట్టడంతో పలు ఎయిర్‌లైన్స్ సరుకు రవాణా రంగంలోకి తమ సేవలను మార్పు చేశాయి. ఈ క్రమంలోనే బోయింగ్ సైతం ఈ రంగంలో విస్తరణకు చర్యలు చేపట్టింది. బోయింగ్ సంస్థ గత 40 ఏళ్లుగా ప్రయాణికుల సేవలో ఉంది.

ఎంఆర్ఓలదే భవితవ్యం

ప్రపంచవ్యాప్తంగా విమానాల మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాలింగ్(ఎంఆర్ఓ) సేవలకు గొప్ప భవిష్యత్తు ఉందని జీఎమ్మార్ ఎయిరో టెక్నిక్ సంస్థ సీఈవో అశోక్ గోపీనాథ్ వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తాము ఎంఆర్ఓ సేవలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి అన్ని ప్రధాన అంతర్జాతీయ నగరాలకు కార్గో సేవలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.





అందమంటే భారత మహిళలదే!

ప్రపంచంలో 200కుపైగా దేశాలు ఉన్నాయి. ఏటా ప్రపంచ సుందరి, విశ్వ సుందరి పోటీల్లో ఏదో ఓ దేశానికి చెందిన, ఎవరో ఒకరు గెలుస్తూ ఉంటారు. ఇలా ఒకరిద్దరి అందం గురించి కాకుండా.. సగటున అత్యంత అందమైన మహిళలు భారతీయులే మరి. ఈ అంశంపై యూకేకు చెందిన మల్టీనేషనల్ వస్త్రాల కంపెనీ 'పోర్ మోయి' ఆన్‌లైన్‌లో అధ్యయనం చేసి తాజాగా నివేదిక విడుదల చేసింది.

పోస్టులు, ప్రశంసలను విశ్లేషించి..

ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'రెడ్డిట్'లో గత ఏడాది మహిళలు, పురుషుల అందానికి సంబంధించి వచ్చిన లక్షలాది పోస్టులను 'పోర్ మోయి'సంస్థ కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా విశ్లేషించింది. వివిధ దేశాలకు చెందిన మహిళలు, పురుషుల చిత్రాలతో కూడిన పోస్టులు, వాటిలోని 'అట్రాక్టివ్, బ్యూటిఫుల్, హ్యాండ్‌సమ్, ప్రెట్టీ, గుడ్ లుకింగ్, గార్జియస్, ప్రెట్టీ..'వంటి కామెంట్లను.. ఆ పోస్టులు, చిత్రాలకు వచ్చిన అప్‌వోట్‌లను (ఫేస్‌బుక్‌లో లైక్‌ల తరహా ఇచ్చేవి) పరిగణనలోకి తీసుకుంది. వీటి ఆధారంగా ఆయా దేశాల వారికి ర్యాంకులను ఇచ్చింది. కృత్రిమ మేధ ఇమేజ్ జనరేషన్ టూల్ 'మిడ్‌జర్నీ'సాయంతో ఆయా దేశాల వారి రూపురేఖలపై రూపొందించిన చిత్రాలను కూడా విడుదల చేసింది.

భారత మహిళలే టాప్..

- 'పోర్ మోయి'స్టడీలో అత్యంత అందమైన మహిళలుగా భారతీయులే నిలిచారు. జపాన్, స్వీడన్ మహిళలు రెండు, మూడో స్థానం సాధించగా.. వరుసగా పోలాండ్, ఇటలీ, బ్రెజిల్, ఉక్రెయిన్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, యూఎస్ఏ వారు ఉన్నారు. ఓవరాల్‌గా మహిళలు, పురుషులు కలిపి చూస్తే కూడా.. భారతీయులే టాప్‌లో ఉండటం గమనార్హం.
- అదే పురుషుల కేటగిరీలో చూస్తే.. బ్రిటన్లు టాప్‌లో ఉండగా, భారతీయులు రెండో స్థానంలో నిలిచారు. తర్వాతి స్థానాల్లో ఇటలీ, యూఎస్ఏ, స్వీడన్, జపాన్, ఫ్రాన్స్, ఐర్లాండ్, బెల్జియం, బ్రెజిల్ వారు ఉన్నారు.

వైభవంగా మల్లన్న జాతర



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ శ్రీమల్లికార్జునస్వామి జాతర వైభవంగా జరుగుతోంది. ఈ సందర్భంగా ఆదివారం బోనాల ఉత్సవం నిర్వహించారు. నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 50వేల మందికి పైగానే బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. - మెట్‌పల్లి (కోరుట్ల)

వైభవంగా రాజన్న రథోత్సవం



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం రాజన్న రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అందంగా అలంకరించిన రథాలపై స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగించారు. దారిపొడవునా అధికారులు, ప్రజాప్రతినిధులు, పురప్రముఖులు రంగులు చల్లుకుని వేడుక జరుపుకొన్నారు. పోలీసులు, ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. -వేములవాడ

జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి రథోత్సవం ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చేపట్టిన రథోత్సవానికి తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలిచ్చారు. స్వామివారి రథం లాగి, మొక్కులు చెల్లించుకున్నారు. -ధర్మపురి

వైభవంగా నృసింహుని రథోత్సవం



టికెట్‌లేని ప్రయాణికులతో రైల్వేకి ఇబ్బంది

- ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్ల జరిమానా వసూలు
- దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 28.27 లక్షల కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్: 'టికెట్ లేని'ప్రయాణాలు రైల్వేని ఇబ్బంది పెడుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఏకంగా 28.27 లక్షల కేసులు బుక్ కావటం దీనికి నిదర్శనమని చెపుతున్నారు. టికెట్ల అమ్మకాలు, సరుకు రవాణా ద్వారా రికార్డు స్థాయి ఆదాయాన్ని సాధించిన దక్షిణ మధ్య రైల్వే, తాజాగా టికెట్ లేని ప్రయాణికుల నుంచి జరిమానా వసూళ్లలో కూడా రికార్డు సృష్టించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఏకంగా రూ.200.17 కోట్లను వసూలు చేసింది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.154.29 కోట్లు ఇప్పటి వరకు గరిష్ట మొత్తంగా నమోదైంది. టికెట్ లేని ప్రయాణికులతోపాటు, ముందస్తు బుకింగ్ లేకుండా లగేజీని తరలించేవారిపై కూడా అధికారులు కేసులు నమోదు చేసి జరిమానా వసూలు చేశారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ప్రయాణికుల టికెట్ల అమ్మకాల ద్వారా దక్షిణ మధ్య రైల్వే రూ.4,825.72 కోట్ల మొత్తాన్ని ఆర్జించింది.

భువనగిరిలో బయటపడిన చారిత్రక సంపద


యాలీ పిల్లర్‌లు, శిలాశాసనం, దేవాలయ స్తంభాలు





భువనగిరిలో తవ్వకాల్లో బయటపడ్డ దేవాలయ స్తంభాలు, యాలీ పిల్లర్

సాక్షి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో శనివారం చారిత్రక సంపద వెలుగు చూసింది. పట్టణంలోని ఖిలా కందకం వద్ద అభివృద్ధి పనుల కోసం చేపట్టిన తవ్వకాల్లో పురాతన కాలంనాటి దేవాలయం ఆనవాళ్లు బయటపడ్డాయి. పదిరోజులుగా కందకం వద్ద ఉన్న మట్టికుప్పలను చదును చేసే పనులు జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కందకం ప్రాంతంలో ఉన్న మట్టిదిబ్బలను చదును చేసి పార్క్‌గా అభివృద్ధి చేయడానికి సంకల్పించి, అందులో భాగంగా పనులు చేపట్టారు. అయితే ఇప్పటికే గాంధీనగర్‌లో మురికి కాలువ కోసం జరిపిన తవ్వకాల్లో సంస్కృత లిపి ఉన్న శిలాశాసనం బయటపడింది. కందకం పక్కన గల కోటగడ్డ కింద దేవాలయాలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలో కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారులు జరిపిన కోటగడ్డ తవ్వకాల్లో భైరవుడి విగ్రహం బయటపడింది. ప్రస్తుతం తవ్వకాల్లో బయటపడ్డ స్తంభాలు, యాలీ పిల్లర్లు రాష్ట్ర కూటులు, కల్యాణ చాళుక్యుల రాజుల కాలం నాటివని చరిత్ర పరిశోధకుడు శ్రీ రామోజు హరగోపాల్ అంటున్నారు. కోటగడ్డ కింద దేవాలయాల సముదాయం ఉంటుందని భావిస్తున్నారు. కందకం వద్ద బయటపడ్డ పిల్లర్ల అనవాళ్ల ప్రకారం ఇక్కడ త్రికూటాలయం, లేక ఏక కూట ఆలయం ఉంటుందని హరగోపాల్ అన్నారు. ఇది 16 లేదా అంతకంటే ఎక్కువ రాతి పిల్లర్లతో నిర్మించిన అర్ధమంటపమై ఉంటుందని చెప్పారు. భువనగిరి కుమ్మరివాడలో గతంలో సింహయాలీ పిల్లర్‌కు చెందిన ముక్క దొరికిందని చెప్పారు. బ్రాహ్మణ వాడ, కుమ్మరివాడ మొదలు ఈ ప్రాంతంలో కోటగడ్డ కింద ఉన్న చారిత్రక సంపదను కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాగా, పోలీసులు ఈ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని పనులు నిలిపివేశారు. ఈ మేరకు ఆర్కియాలజీ, రెవెన్యూ శాఖలకు సమాచారం ఇచ్చినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ చెప్పారు. ఆదివారం ఆయా శాఖల అధికారులు వచ్చి పరిశీలిస్తారన్నారు.



ఆశ అనేది మెలకువతో ఉన్న స్వప్నం.
– అరిస్టాటిల్

సాక్షి
సోమవారం, మార్చి, 13

మాటలు పలుచన

జె.డి.శాలింజర్ తన నవల 'క్యాచర్ ఇన్ ద రై'తో ప్రఖ్యాతం. అమెరికాలో లక్షల మంది అభిమానులను సంపాదించుకుని ఒక్కసారి కలిస్తే చాలు, చెప్పేది వింటే బాగుండు అని తహతహలాడించాడు. కాని ఎప్పుడూ జనం మధ్యలోకి రాలేదు. శాలింజర్‌ని ఇంటర్వ్యూ చేయడానికి మహామహులు ప్రయత్నిస్తే ఆశాభంగమే ఎదురైంది. అమెరికాలో తన నవల 'హౌ టు కిల్ ఎ మాకింగ్‌బర్డ్'తో సంచలనం సృష్టించిన రచయిత్రి హార్పర్ లీ ఎవరినీ తన ఇంటిలోకి అడుగు పెట్టనీయలేదు. ఆమెని చూడాలని, ఇంటర్వ్యూ చేయాలని ఎందరో ప్రయత్నించి ఆమె ఇంటి గేట్ బయట నుంచే వెనుతిరిగే వారు. ప్రఖ్యాత కవి సాహిర్ లూధియాన్వీ తాను పాల్గొనే ముషాయిరాల్లో కవితా జ్ఞానం లేని శ్రోతలను గమనించాడంటే నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టేవాడు. సంఘంలో గొప్పలు చెప్పుకోవడానికి కొంతమంది శ్రీమంతులు అతడు పాల్గొనే ప్రయివేటు ముషాయిరాలకు వచ్చినా వారికీ అదే గతి పట్టేది. అతణ్ణి ఇంటర్వ్యూ చేయడం దుర్లభం. చేయాలనుకున్న వ్యక్తికి ఉర్దూ సాహిత్యం, కవిత్వం కూలంకషంగా తెలిసి ఉండాలి. 'నా గురించి నీకేం తెలుసో చెప్పు. అప్పుడు ఇంటర్వ్యూ ఇస్తాను' అనేవాడు.

మాటలకు చాలా విలువ ఉంటుంది. మాట్లాడే మనిషిని బట్టి, మాటలను వెలికి తీసే మనిషిని బట్టి ఆ సంభాషణ, ముఖాముఖికి విలువ వస్తుంది. ఓప్రా విన్‌ఫ్రే తన ఇంటర్వ్యూలతో ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. ఆమె తన నైపుణ్యంతో ఎదుటివారి మాటల్లో ఉండే జ్ఞాపకాల గాఢతను వెలికి తెస్తుంది. ఆమె మైకేల్ జాక్సన్‌ని ఇంటర్వ్యూ చేస్తే ఆ రోజుల్లో కోట్ల మంది టీవీలకు అతుక్కుపోయి చూశారు. ఇప్పటికీ అమెరికన్ టెలివిజన్ చరిత్రలో అదే ఎక్కువ వ్యూయర్‌షిప్ పొందిన ఇంటర్వ్యూ. అడిగేవారి అంతస్తు చెప్పే వారి అంతస్తు తాలుమేలుగా కలిసినప్పుడు వచ్చే విలువ, గౌరవం అది.

మన దేశంలో కూడా మంచి సంభాషణతో వ్యక్తిత్వాలను వెలికి తీసే పని స్త్రీలే మొదలెట్టారు. దూరదర్శన్‌లో నాటి బాలనటి తబస్సుమ్ చేసే టాక్ షోలకు విశేషంగా ఆదరణ ఉండేది. ఆమె తమను ఇంటర్వ్యూ చేయడం చాలామంది గౌరవంగా భావించేవారు. ఆ తర్వాత నటి సిమీ గెరేవాల్ చాలా విపులమైన ఇంటర్వ్యూలు చేసి అది చాలా శ్రద్ధతో పని చేయవలసిన రంగమని చాటింది. జయలలిత వంటి మొండిఘటం చేత తన ఇంటర్వ్యూలో పాట పాడించింది సిమీ. రతన్ టాటా, రాజీవ్ గాంధీ, రాజ్ కపూర్... వీరందరూ ఆమెతో మాట కలిపినవారిలో ఉన్నారు. రజత్ శర్మ 'ఆప్ కీ అదాలత్' ఒక భిన్నమైన ఫార్మాట్‌తో నింద-సంజాయిషీల ద్వారా చాలా మంది వ్యక్తిత్వాలను ప్రదర్శనకు పెట్టింది. ఆ తర్వాత చాలా కాలానికి ఆమిర్ ఖాన్ 'సత్యమేవ జయతే' షోతో ముఖాముఖి కార్యక్రమాలు తన వంటి సూపర్ స్టార్ నిర్వహించడం వల్ల వచ్చే సీరియస్‌నెస్‌ను, సామాజిక ప్రయోజనాన్ని లోకానికి తెలియచేశాడు.

అయితే రాను రాను ఈ మాటల సేకరణ ఒక జీవనోపాధిగా మారింది. ప్రముఖులతో సంభాషణలు వినోదానికి, హాస్యానికి, కాలక్షేపానికి వనరుగా మారాయి. కరణ్‌జోహార్ వంటి హోస్ట్‌లు మునిగాళ్ల లోతుకే ఎదుటివారిని ఉంచుతూ సగటు ప్రేక్షకులను ఉత్సుకత పరిచే కబుర్లను వినిపించడం మొదలెట్టారు. శేఖర్ సుమన్ 'మూవర్స్ అండ్ షేకర్స్' ఇదే కోవలోకి వస్తుంది. కపిల్ శర్మ వంటి వారు బయలుదేరి హాస్యం కోసం ఎదుట ఉన్నది ఎవరైనాసరే వారితో నేలబారు మాటలు మాట్లాడించవచ్చని నిరూపించారు. ప్రచారం కోసం, ఏదో ఒక విధాన గుర్తుండటం కోసం ఒకనాడు తమ తమ రంగాలలో ఎంతో కృషి చేసినవారు కూడా ఇలాంటి షోలకు హాజరయ్యి 'మీ ఇంట్లో సబ్బు అరిగిపోతే ఏం చేస్తారు?' వంటి ప్రశ్నలకు జవాబులు ఇస్తూ వారి అభిమానులను చానల్ మార్చేలా చేస్తున్నారు.

ఇప్పుడు ఈ మాటల సేకరణ పతాక స్థాయికి చేరింది. యూ ట్యూబ్ పుణ్యాన ప్రతి ఒక్కరూ కాసిన్ని వీడియోల కోసం, వాటి మీద వచ్చే జరుగుబాటు కోసం మైక్ పట్టుకుని సాంస్కృతిక, కళారంగాల్లో ఉన్న రకరకాల స్థాయి పెద్దల వెంటబడుతున్నారు. వీరికి తాము ఇంటర్వ్యూ చేస్తున్న కళాకారుల/సృజనకారుల గురించి ఏమీ తెలియదు. అధ్యయనం చేయరు. గతంలో ఏం జరిగిందో తెలియదు. ఇప్పుడు ఏం జరుగుతున్నదో తెలుసుకోరు. 'చెప్పండి సార్... చెప్పండి మేడమ్' అంటూ 'చెప్పండి' అనే ఒక్కమాట మీద ఇంటర్వ్యూలు 'లాగిస్తున్నారు'. విషాదం ఏమంటే గొప్ప గొప్ప గాయనీ గాయకులు, నటీనటులు, సంగీతకారులు, రచయితలు, రాజకీయవేత్తలు, దర్శకులు, నిర్మాతలు... వీరి 'బారిన' పడుతున్నారు. తమను అడుగుతున్నవారు 'పిల్లకాకులు' అని తెలిసినా క్షమించి జవాబులు చెబుతున్నారు. 'హోమ్ టూర్' అని వస్తే తమ ఇళ్లు బార్లా తెరిచి చూపిస్తున్నారు. పిచ్చి ప్రశ్నలకు హతాశులవుతూనే ఏదో ఒకటి బదులు ఇస్తున్నారు. వారికి ఉన్న అభిమానులు వారి పట్ల ఉండే గౌరవాన్ని పోగొట్టుకునేలా ఈ ఇంటర్వ్యూలు ఉంటున్నాయి. అన్నింటినీ మించి వీరి ఇంటర్వ్యూలలోని శకలాలను వక్రీకరించే థంబ్‌నైల్స్‌తో పోస్టులు వస్తుండటం దారుణం.

దినపత్రికలు పలుచబడి, అచ్చులో వచ్చే ఇంటర్వ్యూల స్థలం కుదింపునకు లోనయ్యాక సంభాషణలు, ముఖాముఖీలు ఇప్పుడు ఎలక్ట్రానిక్/డిజిటల్ మీడియాలోనే సాగుతున్నాయి. కొత్తగా మొదలైన ఓటిటి ప్లాట్‌ఫామ్స్ తమ సబ్‌స్క్రిప్షన్‌లు పెంచుకోవడానికి పాపులర్ సినిమా స్టార్‌లను రంగంలోకి దింపి ఆ స్టార్‌ల ములాజాతో ఇతర స్టార్‌లను పిలిపించి టాక్‌షోలు నిర్వహిస్తున్నాయంటే ఊహించుకోవచ్చు. ఈ షోలన్నీ ఉంటే ఉండొచ్చు. కాని మాటను పలుచన చేయరాదు.

పెద్దలారా! మాటకు విలువివ్వండి! మీ పెద్దరికానికి మాటతో మాట రానీకండి!!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.షష్ఠి సా.6.33 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** అనూరాధ తె.5.30 వరకు(తెల్లవారితే మంగళవారం), తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** ఉ.9.58 నుండి 11.34 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.32 నుండి 1.21 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** రా.7.22 నుండి 8.54 వరకు.

సూర్యోదయం : 6.13
సూర్యాస్తమయం: 6.05
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

కాంగ్రెస్ కథ ముగిసినట్టా?

కామెంట్



కరణ్ థాపర్

తమ పార్టీ తిరిగి ఎలాగైనా లేస్తుందని ఏ రాజకీయ నాయకుడైనా నమ్ముతాడు. ఆ పునరుజ్జీవనం తదుపరి ఎన్నికల్లో లేదా కొన్ని ఎన్నికల తర్వాత జరగవచ్చు. అలాంటప్పుడు ఆ పార్టీ పని అయిపోయిందని చెప్పడం 'హాస్యాస్పదమైన ఆలోచన' అవదా? కానీ వరుసగా రెండుసార్లు ఘోర పరాజయాలు ఎదుర్కొన్న కాంగ్రెస్ పార్టీ విషయంలో అది ఎంతమాత్రమూ హాస్యాస్పదం కాకపోవచ్చు. పార్టీలు ప్రభ కోల్పోతాయన్న విషయాన్ని ఆమోదించడానికి మీరు ఒకప్పటి బ్రిటన్ ఉజ్జ్వలమైన ఉదారవాదుల కేసి చూడనవసరం లేదు. మన దేశంలోనే అలాంటి ఘటనలు చాలా సమీపంలో జరిగాయి. స్వతంత్ర, జనతా పార్టీ, బహుశా భారత కమ్యూనిస్టు పార్టీకి కూడా అలాంటి స్థితి ఏర్పడింది. కాంగ్రెస్ సొంత ఉదంతం విషయానికి వస్తే – బిహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎన్నికల్లో క్షీణతను చవిచూశాక, అది అధికారంలోకి రాలేకపోయింది.

ఓటమికి సంబంధించిన నిరాశా నిస్పృహల నడుమ ఉంటున్నప్పటికీ, తమ పార్టీల పునరుజ్జీవన సంకేతాలను రాజకీయ నాయకులు చూస్తున్నట్లయితే అది అర్థం చేసుకోదగినదే. ఆ పునరుజ్జీవనం తదుపరి ఎన్నికల్లో లేదా కొన్ని ఎన్నికల తర్వాత జరగవచ్చు. అలాంటప్పుడు వరుసగా రెండుసార్లు ఘోర పరాజయాలు ఎదుర్కొన్న కాంగ్రెస్ పని అయిపోయిందని చెప్పడం 'హాస్యాస్పదమైన ఆలోచన' అవుతుందా? కచ్చితంగా కాదు.



ప్రభ కోల్పోయిన పార్టీలు

పార్టీలు ప్రభ కోల్పోతాయన్న విషయాన్ని ఆమోదించడానికి మీరు ఒకప్పటి బ్రిటన్ ఉజ్జ్వలమైన ఉదారవాదుల కేసి చూడనవసరం లేదు. మన దేశంలోనే అలాంటి ఘటనలు చాలా సమీపంలో జరిగాయి. స్వతంత్ర, జనతా పార్టీ, బహుశా భారత కమ్యూనిస్టు పార్టీకి కూడా అలాంటి స్థితి ఏర్పడింది. కాంగ్రెస్ సొంత ఉదంతం విషయానికి వస్తే – బిహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎన్నికల్లో క్షీణతను చవిచూశాక, అది అధికారంలోకి రాలేక పోయింది.

అయినప్పటికీ, కాంగ్రెస్ కథ 'ముగిసిందని' చెప్పడం హాస్యాస్పదమైనదని రాహుల్ గాంధీ అతిశయిస్తున్నారంటే దాన్ని నిజమని రుజువు చేయాల్సి ఉంటుంది. ఊరికే వేచి ఉండడం ద్వారా, మంచి జరుగుతుందని ఆశించడం ద్వారా అది జరగదు. ప్రొఫెసర్ సుహాస్ పల్శీకర్ ఎత్తి చూపినట్లుగా, 'బహుళ పార్టీ సమాఖ్య రాజకీయాల్లో పోటీలో ఉండటం' అనేది దాదాపు కాంగ్రెస్‌కు 35 ఏళ్లనుంచీ సవాలుగానే ఉంటోంది. 1989లో పార్టీ అధికారం కోల్పోయినప్పుడు ఇది ప్రారంభమైంది. అప్పటి నుంచి అది ప్రభుత్వంలో ఉంటూ వచ్చినప్పటికీ, మెజారిటీని ఎన్నడూ గెలుచుకోలేదు. త్వరలోనే ఈ సవాలు 'దాటలేనిది'గా మారి పోయింది.

అలా జరగకూడదంటే, కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా, రాజకీయ సమీకరణల పరంగా రెండు రంగాల్లో తప్పక పనిచేసితీరాలని పల్శీకర్ విశ్వాసం. ఆ పార్టీ ఆయన సలహాను పాటించడానికి సమ్మతించక పోయినప్పటికీ, ఉజ్జ్వల ప్రతిపక్షాన్ని కోరుకుంటూ, కాంగ్రెస్ పునరుత్థానంపై నమ్మకం పెట్టుకున్న మనలాంటి వారికి అది మంచి ఆశను కలిగిస్తోంది.

ఎన్నికలే ప్రాణవాయువు

రాజకీయ సంస్థ గురించి పల్శీకర్ రెండు అంశాలు చెబుతున్నారు. అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే, పార్టీ పనితీరును ప్రజాస్వామ్యీకరించడమే! వర్కింగ్ కమిటీకి ఎన్నికలు నిర్వహించకపోవడం ద్వారా, పార్టీ ప్రజాస్వామ్యీకరణ విషయంలో కాంగ్రెస్ విఫలమైంది. ఎన్నికలు సృష్టించే మథనం పార్టీకి 'ప్రాణ వాయువు'ను ఇస్తుంది కాబట్టి ఇది ముఖ్యమైనదని పల్శీకర్ అంటారు. నామినేషన్లు అనేవి సుప్తావస్థను కొనసాగేలా చేస్తాయి.

రెండో సంస్థాగతమైన అవసరం ఏమిటంటే, ఒక కుటుంబానికి ఒక పదవి అనే నిబద్ధతను పూర్తి చేయడమే! ఇది గాంధీలకు మాత్రమే అన్వయించదు. 'స్థానిక పార్టీ యూనిట్లను నియంత్రించే అనేక కుటుంబాల స్థిరపడిన ఆసక్తులతో ఇది ఎక్కువగా ముడిపడి ఉంది. ఇది ఎక్కువగా స్థానిక రాజకీయాల నిర్వహణకు సంబంధించినది'. ఈ ఆధిపత్య కుటుంబాలు 'యువ కార్యకర్తలను స్పర్థాత్మక రాజకీయాల్లోకి అనుమతించడం' ముఖ్యమని గుర్తించాల్సిన అవసరం ఉంది.

రాజకీయ సమీకరణపై కూడా పల్శీకర్ రెండు అంశాలను జోడించారు. పెద్ద మాటలు, పవిత్రమైన ఆశలను పక్కనపెడితే... కాంగ్రెస్ పార్టీ నిర్దాక్షిణ్యమైన పోటీదారును ఎదుర్కొంటున్న సమయంలో సంకీర్ణం కోసం సరైన ఫార్ములాను ఎంచుకోవలసిన అవసరముంది. ఆయన సలహా సరళమైనదే కానీ పదునైనది. 'కాంగ్రెస్ పార్టీ మరింత నమ్రతతో ఉండడానికి సిద్ధం కావలసి ఉంటుంది'. మరో మాటలో చెప్పాలంటే, కాంగ్రెసే నాయకత్వం వహిస్తుందని పట్టుబట్టొద్దు.

సమర్థంగా వివరించాలి

సమీకరణ గురించిన రెండో అంశం మరింత సవాలుతో కూడుకున్నది. ఇది కాంగ్రెస్ సైద్ధాంతిక సందేశానికి సంబంధించింది. 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, మతతత్వం వంటి అంశాలపై ప్రజారాశులను పార్టీ ఎలా మేల్కొల్పబోతోంది?' ఎందుకంటే ఇవి సాధారణ ప్రజలు పెద్దగా పట్టించుకోని నైరూప్య భావనలు. వారి రోజువారీ జీవితాలకు అనువుగా వీటిని సమర్థంగా వివరించకుంటే ఫలితం ఉండదు. ఇప్పటికైతే వీటిని చెబుతున్నప్పుడు వాటి అర్థం నష్టపోతోంది.

బీజేపీకి వ్యతిరేకంగా మతతత్వ ఆరోపణల గురించి మాట్లాడే విషయాలను పల్శీకర్ ప్రత్యేకించి నొక్కి చెప్పారు. 'మంచి హిందువుగా ఉండటం లేదా మంచి జాతీయవాదిగా ఉండటానికి ముస్లిం వ్యతిరేకిగా ఉండాల్సిన అవసరం లేదని సగటు హిందువుకు అర్థం అయ్యేట్టు చెప్పాలి, ఇది కొంచెం కష్టమైన పనే'. దీనికి సమాధానం ఏమిటంటే తన సొంత హిందూ విశ్వసనీయతపై ఆడంబరంగా చెప్పుకోవలసిన పనిలేదు కానీ హిందూయిజం గురించి కాంగ్రెస్ మాట్లాడాల్సి ఉంది. దానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం గురించి అది విభిన్నరీతిలో నొక్కి చెప్పాల్సి ఉంది. కానీ ఇది చేయడం కంటే చెప్పడం సులభం!

హాస్యాస్పదం కాదు

కాంగ్రెస్ పార్టీ తన సందేశాన్ని సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించడం ఓటర్ల దృష్టిలో ఎంతో విలువైన విషయం. కులం, తెగ, సంస్కృతి, ఆహార ప్రాధాన్యతలు వంటి అంశాల్లో వ్యత్యాసాలను అధిగమించడం చాలా కష్టమైన పని.

ఇది నేను ఎక్కడ మొదలెట్టానో అక్కడికే నన్ను తీసుకెళుతోంది. సవాలును కాంగ్రెస్ అధిగమించలేకపోతే, పార్టీ భవిష్యత్తు సందేహంలో పడుతుందని సుహాస్ పల్శీకర్ చెప్పడం నిజంగా హాస్యాస్పదమైన విషయమేనా? కాకపోతే ఈశాన్య భారత్‌లో ఫలితాలు భిన్నమైన విషయాన్ని సూచిస్తున్నాయి. అయినా కూడా రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను నిలుపుకోవడంలో విఫలమైతే, కర్ణాటకలో గెలుపు సాధించలేకపోతే మాత్రం అది స్పష్టమైన సంకేతం. తర్వాత 2024 సార్వత్రిక ఎన్నికలు ఎటూ ఉండనే ఉన్నాయి.

అయితే, అయితే, అయితే... బ్రిటన్‌లో కేమరాన్ నాయకత్వంలో తిరిగి అధికారంలోకి రావడానికి ముందు వరుసగా మూడు ఎన్నికల్లో టోరీలు ఓడిపోయారు. లేబర్ పార్టీ అదృష్టాన్ని టోనీ బ్లెయిర్ మార్చివేయడానికి ముందు నాలుగు సార్లు ఆ పార్టీ కూడా అపజయం ఎదుర్కొంది. అయితే, రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీకి అలాంటిది తెచ్చిపెట్టగలరా అనేదే ప్రశ్న!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

గోలగోల!



ఇండియన్ ఎయిర్ పోర్టు లౌంజులు ఈరోజుల్లో చేపల మార్కెట్లలా ఉంటున్నాయి. మొత్తంగా విస్మరించదగినవి!

– రాజేశ్ సహానీ, ఇన్వెస్టర్

అంతటా ఉన్నారు



వీధుల్లో లైంగిక హింసకు ఎక్కువగా పాల్పడేది ఉత్తర భారత మగవాళ్లు అని కొంతమంది చెబుతున్నారు. నిజం చెప్పాలంటే, ఇలాంటి వ్యాఖ్యలు చేసేవాళ్లు దేశంలో తగినంతగా ప్రయాణించలేదని అర్థం.

– మంజులా నారాయణ్, జర్నలిస్ట్

ఆమె తీరు



నేను విమానంలో ఉన్నాను. ఫస్ట్ క్లాసులో నా పక్కన కూర్చున్న వ్యక్తికి లక్ష డాలర్లు చెల్లిస్తానన్నా కూడా తన మాస్కును తీయడానికి ఒప్పుకోలేదు. అది కూడా అవి పనిచేయవని నేను వివరించిన తర్వాత! ప్రయాణమంతా మాస్కులోనే ఉంది. ఆమె ఒక ఫార్మా కంపెనీలో పనిచేస్తోంది.

– స్టీవ్ కిర్ష్, కోవిడ్-19 ట్రీట్‌మెంట్ ఫండ్ స్థాపకుడు

నచ్చని మాట



నాకు 'సాలీ ఆధీ ఘర్‌వాలీ' (మరదలు అర పెళ్లాం) అన్న వాక్యం విన్నప్పుడల్లా అసహ్యం పుడుతుంది. అసలు ఎవరైనా అలా ఎందుకు అనాలి? ఆమె నీ అర్ధ భార్య ఎంత మాత్రమూ కాదు!

– రీతూపర్ణా ఛటర్జీ, సంపాదకురాలు

అసలు రంగు



మహిళలు, బాలికల పట్ల చెడుగా ప్రవర్తించడానికి హోలీ ఒక సాకు కాగలదని ఒప్పుకొందాం. నీచమైన వ్యాఖ్యలు, చిల్లర తంత్రాలకు రంగులు, తాగుబోతుతనం అనేవి మాస్కులుగా మారాయి. చాలామంది మహిళలు ఈ రకమైన హింసను అనుభవించినవారే. ఇది పండుగను తప్పు పట్టడం కాదు. మగవాళ్లు ఏం చేయగల సమర్థులో బయటపెట్టడం.

– వైశాలీ మాథుర్, ప్రచురణకర్త

ఇలా చేయొచ్చు



ప్రతీ సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా చాలామందిని 'ఫ్లూ' ప్రభావితం చేస్తుంది. ఈ సంవత్సరం హెచ్3ఎన్2 ప్రత్యేకించి చీకాకైన అనారోగ్యం కలిగిస్తోంది. లక్షణాలు ఏవంటే– తీవ్ర జ్వరం, చలి, దగ్గు, ముక్కు దిబ్బడ, డయేరియా, తల, ఒంటి నొప్పులు. దీనికి చికిత్స: ప్యారసెటమాల్ మాత్రలు, విశ్రాంతి, ద్రవాలు, ఆవిరి పట్టడం, పుక్కిలింతలు.

– జోయీతా, ఫిజీషియన్

స్వేచ్ఛాదేశం



సున్నీ ముస్లింలు తమ మతాన్ని ఇరాన్‌లో స్వేచ్ఛగా అనుసరించలేరు. షియా ముస్లింలు తమ మతాన్ని సౌదీ అరేబియాలో స్వేచ్ఛగా అనుసరించలేరు. అహ్మదీయ ముస్లింలు తమ మతాన్ని పాకిస్తాన్‌లో స్వేచ్ఛగా అనుసరించలేరు. షియాలు, సున్నీలు, అహ్మదియాలు స్వేచ్ఛగా తమ మత హక్కును అనుసరించగలిగే దేశం– ఇండియా!

– ఒమర్ ఘాజీ, రచయిత

అక్షర రూపంతో అందరికీ ఉపయోగమే!

విశ్లేషణ



మంగారి రాజేందర్

న్యాయవాది (స్థాయి)ని చూసి కోర్టులు తీర్పులు ఇస్తాయన్న అభియోగం ఉంది. ప్రజలు ఆ విధంగా అనుకునే విధంగా పరిస్థితులూ ఉన్నాయి. రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ ఉన్నప్పటికీ ఫేస్ వ్యాల్యూ కోసం ఢిల్లీ నుంచి పెద్ద తలకాయను దాదాపు ప్రతి రాష్ట్రం దిగుమతి చేస్తూనే ఉంది. ఈ అభిప్రాయం పోవాలంటే ఆ న్యాయవాదులు ఏం వాదనలు వినిపిస్తారో ప్రజలకు తెలియాలి. అది తెలిస్తే ఈ అభిప్రాయం తొలగిపోవడానికి అవకాశం ఉంది.

ఈ మధ్య కోర్టులోని వాదనలనూ, అదేవిధంగా ప్రొసీడింగ్స్‌నూ లైవ్‌లో చూపించే విధంగా సుప్రీంకోర్టు, హైకోర్టులు చర్యలు తీసుకుంటున్నాయి. అయితే వీటిని మొదట కోర్టులో ప్రయోగాత్మకంగా చేస్తున్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు మరో ప్రయోగాన్ని చేస్తోంది. న్యాయవాదులు చేసే వాదనలన్నీ వెనువెంటనే అక్షర రూపంలోకి మార్చడానికి అవసరమైన చర్యలను ప్రయోగాత్మకంగా సుప్రీంకోర్టు చేపట్టింది. ఈ విషయాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఇటీవల ప్రకటించారు. ఆ విధంగా అక్షర రూపంలోకి మారిన వాదనలను 'శాశ్వత రికార్డు'గా కూడా ఉంచే విధంగా ప్రయత్నం చేస్తామని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ ప్రయోగాన్ని రాజ్యాంగ బెంచి విచారణల కోసం మాత్రమే పరిమితం చేశారు.

దేశంలోని అన్ని వ్యవస్థల కన్నా కోర్టులు చాలా బెటర్. ఇవి బహిరంగ విచారణలు చేస్తాయి. భారత ప్రధాన న్యాయమూర్తి కోర్టులో ఏం జరుగుతుందన్న విషయం తెలుసుకోవడానికి ప్రజలు ఎవరైనా ఆ కోర్టుకి వెళ్ళి చూడ వచ్చు. న్యాయమూర్తుల చర్చలు బహిరంగ కోర్టులో ఉంటాయి. ఈ పరిస్థితిని ఏ రాజ్యాంగ సంస్థలలోనూ చూడలేం. అయినా కూడా ప్రజలకు ఏవో అభిప్రాయాలు కోర్టుల మీద ఉన్నాయి. ప్రత్యక్ష ప్రసారాల వల్ల కోర్టుల పనితీరును దేశంలోని మారుమూల ప్రజలు కూడా తెలుసు కునే అవకాశం ఏర్పడుతుంది. ట్రాన్స్‌క్రిప్షన్ అనేది మరో అడుగు. దీనివల్ల న్యాయవ్యవస్థ ప్రజలకు మరింత చేరువవుతుంది. ఈ వాదనల అక్షరీకరణ ఎలా పని చేస్తుందో చూడాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. ఈ చర్యను దేశంలోని అనేక మంది న్యాయవాదులు స్వాగతించారు. దీనివల్ల మంచి ఫలితాలు వస్తాయని అంటున్నారు. న్యాయస్థానాల్లో వాదనలు కూడా మెరుగుపడతాయని భావిస్తున్నారు.



కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ను ఈ పని కోసం వినియోగిస్తున్నారు. కోర్టులో జరిగే వాదనలు, న్యామూర్తులు వేసే ప్రశ్నలు, జవాబులు అన్నీ ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా అక్షర రూపం దాలుస్తాయి. జరిగిన వాదనలను ఆ మరురోజు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లోకి పంపించి ప్రజలకి అందుబాటులో ఉంచుతారు. అంతేకాదు, ముందుగా వీటి ప్రతులను ఆ వాదనలను చేసిన న్యాయవాదులకి అందజేసి వైరుధ్యాలు ఉంటే సరి చేస్తారు.

ఒకేసారి ఇద్దరు ముగ్గురు మాట్లాడితే అది అక్షర రూపంలోకి మారడంలో కొంత సమస్యగా మారే అవకాశం ఉంది. ఈ అక్షర రూపంలోకి మారిన వాదనలను ఎట్లా అప్‌లోడ్ చేయాలన్న విషయంలో ఎలాంటి నియమాలూ ఖరారు కాలేదు. పారదర్శకత, జవాబుదారీతనం కోసం కోర్టు కార్యకలాపాలను ప్రసారం చేయాలని సుప్రీంకోర్టు 2018లో పేర్కొంది. ప్రత్యక్ష ప్రసారాల గురించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయవాది ఇందిరా జైసింగ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆడియో వీడియో విజువల్స్‌ను, అక్షర రూపంలో వాదనలను మార్చడం మంచిదని అప్పటి అటార్నీ జనరల్ కె.కె వేణుగోపాల్ సిఫార్సు చేశారు. జాతీయ ప్రాముఖ్యం ఉన్న కేసుల్లో విద్యార్థులకు తమ జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి.

ఈ ప్రయోగం వల్ల అనవసర వాదనలు తగ్గు ముఖం పడతాయి. వాదనలు అక్షర రూపంలో అందు బాటులోకి రావడం వల్ల న్యాయవాదులకు, పరిశోధకులకు అదే విధంగా న్యాయ వ్యవస్థలోని భాగస్వాములందరికీ ఇది ఉపయోగపడుతుంది. న్యాయవాదుల్లో తెలియకుండానే ఓ క్రమశిక్షణ ఏర్పడి అవసరమైన వాదనలను మాత్రమే కోర్టు ముందు చేస్తారు.

వాదనలను అక్షర రూపంలోకి మార్చే ప్రక్రియ ద్వారా తమ ప్లీడింగ్స్‌లోనే వాదనలను సమకూరుస్తారనీ, ఇవి న్యాయ వాదులకు గొప్ప వనరుగా ఉపయోగపడతాయనీ ప్రొఫెసర్ మోహన్ గోపాల్ అభిప్రాయం వ్యక్తం చేశారు. న్యాయవాదులు చేసిన వాదనలు కోర్టు తీర్పుల్లో కనిపించడం లేదని చాలామంది న్యాయవాదులు తరుచూ అంటూ ఉంటారు. ఆ విధంగా తీర్పులు చెప్పే పరిస్థితి కూడా తగ్గి పోయే అవకాశం ఉంది.

కోర్టు కార్యకలాపాలను చాలా వెబ్‌సైట్లు రిపోర్టు చేస్తు న్నాయి. ఆ రిపోర్టు కూడా మంచిగా రావడానికి ఇవి ఉపయోగపడతాయి. ప్రత్యక్ష ప్రసారాల వీడియోలను ఆసాంతం చూడడం కొన్నిసార్లు కష్టసాధ్యం అవుతుంది. ఆ వాదనలు, న్యాయమూర్తుల ప్రశ్నలు – జవాబులు అక్షర రూపంలోకి మారడం వల్ల చదువుకోవడం సులువవుతుంది. అవసరమైన భాగాన్ని హైలెట్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

కొద్ది సంవత్సరాలుగా 'లైవ్ లా', 'బార్ అండ్ బెంచ్' అన్న వెబ్‌సైట్లు కోర్టుల్లోని ప్రముఖమైన కేసులలోని వాదన లను ఎప్పటికప్పుడు పాఠకులకు అందిస్తున్నాయి. ఇప్పుడు ఈ వాదనలు అక్షర రూపంలోకి మారడం వల్ల కోర్టులో సీనియర్ న్యాయవాదులు ఎలా వాదనలు చేశారన్న విషయం తెలుస్తుంది. యువ న్యాయవాదులకే కాదు, దేశంలోని చాలా మందికి కోర్టు కార్యకలాపాలు తెలుసుకునే వీలు కలుగుతుంది. సీనియర్ న్యాయవాదులు ఉంటేనే కేసులు గెలుస్తామన్న అభిప్రాయం కూడా తగ్గిపోయే అవకాశం ఉంది. వాదనల గురించి తెలిస్తే కేసు గురించి బాగా తెలుస్తుంది. కేసు గెలవడానికి, ఓడిపోవడానికి దారి తీసిన పరిస్థి తులు బోధపడతాయి.

కోర్టు కార్యకలాపాల ప్రత్యక్ష ప్రసారాలు ఎంత అవసరమో, వాదనలు అప్పటికప్పుడు అక్షరరూపం దాల్చి ప్రజలకు అందుబాటులోకి రావడమూ అంతే అవసరం. ఇది విజయవంతం అయితే న్యాయ చరిత్రలో మరో మైలురాయి చేరుకున్న వాళ్ళం అవుతాం.

వ్యాసకర్త మాజీ జిల్లా జడ్జి, సెషన్స్ జడ్జి

అహింసా స్వరూపం

ఇది హింస, ఇది అహింస అని స్పష్టంగా నిర్వచించడానికి సాధ్యం కాదు. నదులు, సముద్రాలు, భూమి, ఆకాశం అన్నీ ప్రాణులతో కూడుకుని ఉన్నాయి కాబట్టి... అన్ని పనులలో కొంత హింస జరగక తప్పదు. హింస అస్సలు చేయకుండా మానవ జీవితం గడవదు. ఈ విషయాన్ని గుర్తించలేని కొందరు తాము ఎప్పుడూ హింస చేయలేదని భావిస్తూ ఉంటారు. కేవలం కందమూలాలూ, ఫలాలూ తిని జీవించే మునులు కూడా అహింసావ్రతులు కారు. కంద మూలాలలోనూ ప్రాణం ఉంటుంది కదా! అదీ హింసే అవుతుంది. నాగలితో రైతు భూమిని దున్నేటప్పుడు ఆ నాగలి కర్రుకు తగిలి ఎన్ని జీవాలు చచ్చిపోతాయి? అది హింస కాదనగలమా! మనుషులు నేలపై నడిచేటప్పుడు కాళ్ళ కింద వేల కొద్దీ ప్రాణులు చచ్చిపోతాయి. ఇది హింస కాదా! రోజూ మనం దోమలను అసంఖ్యాకంగా చంపుతుంటాం. అదీ హింసే! కాని వాటిని నిర్మూలించకపోతే మన ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది.



జ్యోతిర్మయం

అహింసా స్వరూపంలో ధర్మ సూక్ష్మముంది. మన ప్రాణాలకు, జీవితాలకు హాని కలుగుతున్నప్పుడు ఇటువంటి హింస చేయక తప్పదు. ఇతరులకు మేలు చేసే అసత్యం చెప్పటంలో తప్పులేనట్లే ఇదీనూ! అందువల్ల, హింస చేయనివారు ఒక్కరైనా ఉండరు. అయితే, తమకు సాధ్యమైనంత వరకూ హింసకు దూరంగా ఉండి జీవన యాత్ర సాగించటం ఉత్తమ లక్షణం.

ఇతరులకు అనవసరంగా బాధ కలిగించటం, హాని చేయటం మానసిక హింస. అసత్యాలు పలకటం; కఠినంగా, పరుషంగా మాట్లాడటం వాచిక హింస. ఇతరుల్ని గాయపరచడం, కొట్టడం, చంపడం శారీరక హింస. ఇటువంటి పనులు చేయకుండా ఇతర ప్రాణులకు మనసా, వాచా, కర్మణా కీడు తలపెట్టకుండా ఉండడమే అహింస. అన్ని ధర్మాలలోకీ అహింస ఉత్తమోత్తమ ధర్మమని పెద్దలు చెబుతారు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

అవిగో.. అరుదైన పక్షులు!

రాష్ట్రంలో అడవి గుడ్లగూబ, ఎలుక గద్దలను గుర్తించిన బర్డ్ వాచర్స్

- గ్రేట్ బ్యాక్ యార్డ్ బర్డ్ కౌంట్‌లో రికార్డయిన పలు రకాల పక్షులు
- దేశవ్యాప్తంగా 1,067 జాతులు.. రాష్ట్రంలో 313 జాతుల నమోదు
- గణనలో పాల్గొన్న పలు విద్యా సంస్థలు, డాక్టర్లు, సిటిజన్లు


ఏలూరు సీఆర్‌ఆర్ మహిళా కళాశాలలో పక్షుల గణనలో పాల్గొన్న విద్యార్థులు


గోధుమ రంగు అడవి గుడ్ల గూబ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలు అరుదైన పక్షి జాతుల్ని బర్డ్ వాచర్స్ గుర్తించారు. గోధుమ రంగు అడవి గుడ్ల గూబ(బ్రౌన్ వుడ్ ఓల్), ఎలుక గద్ద(కామన్ బజార్డ్), నల్ల బాజా(బ్లాక్ బాజా) వంటి అరుదైన పక్షులు కనిపించాయి. తిరుపతి ఐఐఎస్‌ఈఆర్ విద్యార్థులు సుదీర్ఘకాలం తర్వాత నల్ల బాజాను గుర్తించగా, రాజమండ్రిలో బర్డ్ వాచర్ మోహన్ శ్రీకర్ గోధుమ రంగు అడవి గుడ్ల గూబను రికార్డు చేశారు. విజయవాడలో ఎలుక గద్ద పక్షి రాష్ట్రంలో రెండోసారి రికార్డయింది. రాష్ట్ర వ్యాప్తంగా 8 రకాల గుడ్ల గూబలు రికార్డయ్యాయి. ఫిబ్రవరి 17 నుంచి 20వ తేదీ వరకు 4 రోజులపాటు ఐఐఎస్‌ఈఆర్ ఆధ్వర్యంలో వరుసగా నాలుగో సంవత్సరం రాష్ట్రంలో గ్రేట్ బ్యాక్ యార్డ్ బర్డ్ కౌంట్‌గా పిలిచే ప్రపంచ పక్షుల గణన నిర్వహించారు. గణనలో దేశం వ్యాప్తంగా 1,067 జాతుల పక్షులు నమోదవగా, మన రాష్ట్రం 313 జాతుల్ని నమోదు చేసి దేశంలో 12వ స్థానంలో నిలిచింది. బర్డ్ వాచర్‌లు పక్షులను గమనించి వాటి ఫొటోలను సిటిజన్ సైన్స్ పోర్టల్ ఈబర్డ్‌లో నమోదు చేశారు.

గణనలో 84 మంది బర్డ్ వాచర్స్..

తిరుపతి ఐఐటీ, ఐఐఎస్‌ఈఆర్ తిరుపతి, తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్, ఏలూరు సీఆర్‌ఆర్ మహిళా కళాశాల, విశాఖపట్నం ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్ సహా రాష్ట్రంలోని పలు క్యాంపస్‌లు ఈ గణనలో పాల్గొన్నాయి. 2013లో తొలిసారి రాష్ట్రంలో గ్రేట్ బ్యాక్ యార్డ్ బర్డ్ కౌంట్ జరగ్గా అప్పుడు 300కి పైగా జాతుల పక్షుల్ని నమోదు చేశారు. ఐఐఎస్‌ఈఆర్ తిరుపతి విద్యార్థులు, పరిశోధకులు ఈ గణనలో తిరుపతి పరిసరాల్లో 120 జాతుల పక్షుల్ని నమోదు చేయడం విశేషం. విజయవాడ నేచర్ క్లబ్‌లో ఉన్న పలువురు వైద్యులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, కొందరు సిటిజన్లు ఒక గ్రూపుగా ఏర్పడి విజయవాడ పరిసరాల్లో 60 రకాల పక్షులను నమోదు చేశారు. ఒంగోలుకు చెందిన ఇద్దరు వైద్యులు ప్రకాశం జిల్లా ప్రాంతంలో 100 జాతులకు పైగా పక్షుల్ని రికార్డు చేశారు. రాజమండ్రి బర్డ్ నేచర్ ఫొటోగ్రఫీ గ్రూపు సభ్యులుగా ఉన్న డాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులు తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాల నుంచి 200 జాతుల పక్షులను రికార్డు చేశారు. విశాఖపట్నంలో స్థానిక ఎన్జీఓలు డబ్ల్యూసీటీఆర్‌ఈ, ఈసీసీటీలు అటవీ శాఖతో కలిసి బర్డ్ వాక్‌లు నిర్వహించి 180 జాతుల పక్షులను నమోదు చేశారు. అనంతపురంలో 160 రకాల పక్షులు, కొల్లేరు పక్షుల అభయారణ్యంలో 90 రకాల పక్షులు నమోదయ్యాయి. మొత్తం 84 మంది బర్డ్ వాచర్స్ ఈ గణనలో పాల్గొన్నారు. పక్షి శాస్త్రవేత్తలు, పరిశోధకులకంటె ఎక్కువగా సాధారణ ప్రజలు ఈ గణనలో పాల్గొనడం విశేషం.



65 శాతం పక్షులు నమోదయ్యాయి



రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం 490 జాతుల పక్షులు రికార్డవగా.. ఈ గణనలో వాటిలో 65 శాతం పక్షులు నమోదయ్యాయి. ఎక్కువ మందిని ప్రకృతికి అనుసంధానం చేయడం, పక్షులను చూడాలనే అభిరుచితో ఉన్న వారిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ గణన ఏటా నిర్వహిస్తున్నారు. ఈ ఫలితాలు ప్రాథమికంగా ఇచ్చినవే. కాగా, బర్డ్ కౌంట్ ఇండియా త్వరలో తుది ఫలితాలను వెల్లడిస్తుంది. – బండి రాజశేఖర్, ఐఐఎస్‌ఈఆర్ సిటిజన్ సైంటిస్ట్

ప్రకాశం జిల్లాలో పక్షుల సమాచారాన్ని అన్వేషిస్తున్నాం..



నా సహోద్యోగి డాక్టర్ శ్రావణ్‌కుమార్(బర్డ్ వాచర్)తో కలిసి ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పక్షుల్ని రికార్డు చేశాను. పెళ్లూరు సమీపంలోని గడ్డి భూముల్లో కొంగలు, పెలికాన్‌లు, పెయింటెడ్, ఓపెన్ బిల్ స్కార్క్‌లను ఎక్కువగా గమనించాము. దర్శి సమీపంలో ఈజిప్షియన్ వల్చర్, హనీ బజార్డ్, బ్లాక్ కైట్ పక్షుల్ని నమోదు చేశాం. ప్రకాశం జిల్లాలోని పక్షుల గురించి మరింత సమాచారాన్ని అన్వేషించడానికి ప్రయత్నిస్తున్నాం.
– డాక్టర్ రామాంజినాయక్, బర్డ్ వాచర్, ఒంగోలు

30న శ్రీవారి ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానాలు


ఆలయం వెలుపల జస్టిస్ రంగారావు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 30, 31 తేదీల్లో శ్రీరామనవమి, శ్రీరామ పట్టాభిషేకం పర్వదినాలను పురస్కరించుకుని టీటీడీ ఘనంగా ఆస్థానాలు నిర్వహించనుంది. 30న రంగనాయకుల మండపంలో శ్రీసీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్ర మూర్తి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేయనున్నారు. సాయంత్రం హనుమంత వాహనసేవ జరుగనుంది. రాత్రి శ్రీరామనవమి ఆస్థానం నిర్వహించనున్నారు. ఈ కారణంగా సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. మార్చి 31న శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తారు. కాగా, తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 79,561 మంది దర్శించుకున్నారు. హుండీలో రూ.3.82 కోట్లు సమర్పించారు. దర్శనం టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. శ్రీవారిని ఏపీ హ్యూమన్ రైట్స్ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, ఏపీ హైకోర్టు జస్టిస్ రంగారావు, తెలంగాణ హైకోర్టు జస్టిస్ వీవీ వేణుగోపాల్, ఎమ్మెల్సీ జంగా కృష్ణ మూర్తి, ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, తెలంగాణ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు, తమిళ సినీ నటుడు ప్రభు, సినీనటి లయ, టీటీడీ మాజీ సీవీఎస్‌ఓ గోపీనాథ్‌జెట్టి దర్శించుకున్నారు.

తవ్వేన కొద్దీ... 'చీట్స్'

▶ మొదటి పేజీ తరువాయి

వేల చిట్లలో తమ పేరే రాసేసుకున్న మార్గదర్శి సంస్థ... నిబంధనల మేరకు దానికి పూర్తి మొత్తాన్ని చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు!!. చిట్లలో తనకు వచ్చే కొద్ది పాటి డిస్కౌంట్ల మొత్తాన్నే దాదాపు అన్ని చిట్లలోనూ డూప్లికేట్ చేసి చూపించి... దాన్నే తమ సొమ్ముగా పేర్కొనటంతో, ఇదంతా పచ్చి 'గొలుసు' వ్యవహారంగా మారిపోయింది. గొలుసులో ఏ చిన్న లింకు తెగినా... ఇది సంస్థ దివాలాకు దారితీసే ప్రమాదముంది. అదే జరిగితే చిట్ సభ్యుల సొమ్ము వాళ్లకు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతోపాటు చిట్లకు వేర్వేరు బ్యాంకు ఖాతాలను నిర్వహించాల్సి ఉండగా... అన్నిటికీ ఒకే ఖాతాను నిర్వహిస్తూ వాటిలో డబ్బును ఇష్టం వచ్చినట్టుగా మళ్లించటం కూడా విస్మయం కలిగిస్తోంది. ఇన్వెస్ట్‌మెంట్ రూపంలో గ్రూపు సంస్థల్లోకి కోట్లాది రూపాయలు మళ్లిస్తుండటంతో పాటు... హైరిస్క్ ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లోకి కూడా ఈ ఖాతా నుంచి చిట్ సభ్యుల సొమ్మును మళ్లించటం గమనార్హం. వీటన్నిటితో పాటు... చట్ట విరుద్ధ మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థను మూసేసినా డిపాజిట్లు తీసుకోవటం మాత్రం రామోజీరావు ఆపలేదని తాజా సోదాల్లో వెల్లడయింది. చిట్ సభ్యుల నుంచి అక్రమంగా డిపాజిట్లు తీసుకుంటూ... బ్యాంకుల్లో అయితే వాటిపై టీడీఎస్ (ఆదాయపు పన్ను) చెల్లించాలని, తమ దగ్గరైతే అలాంటిదేమీ ఉండదని నమ్మబలుకుతుండటం మోసాలకు పరాకాష్టగా అధికారులు చెబుతున్నారు. ఆ అక్రమాల వివరాలివీ...

ఒక్క రూపాయి చెల్లించకుండా...తమపేరిట చిట్టీలు

సాధారణంగా ప్రతి చిట్‌కూ నిర్ణీత చందాదారుల సంఖ్య ఉంటుంది. కొన్ని గ్రూపుల్లో తక్కువ మంది సభ్యులు (టికెట్లు) చేరితే కొన్ని ఖాళీగా ఉండిపోతాయి. ఆ ఖాళీ టికెట్స్‌ను కంపెనీ తీసుకోవాలి. వాటి చందాను కంపెనీ చెల్లించాలి. తరవాత కొత్త చందాదారులు చేరితే ఆ మేరకు టికెట్స్ భర్తీ చేయొచ్చు. చిట్‌ఫండ్ చట్టంలోని 27, 32 సెక్షన్లలో నిర్దేశించిన ఈ నిబంధనలను మార్గదర్శి ఏనాడూ పట్టించుకోలేదు. గరిష్ఠంగా ఒకో గ్రూపులో 50 శాతం వరకూ టికెట్లు కంపెనీవే ఉన్నాయి. కానీ వాటికోసం మార్గదర్శి ఇప్పటిదాకా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. చిట్లపై తమకు వచ్చే డిస్కౌంట్ల మొత్తాన్ని డూప్లికేట్ చేసి అన్నిచోట్లా రికార్డుల్లో చూపిస్తోంది. ఒకవేళ పరిస్థితులు ప్రతికూలించి కొన్ని గ్రూపుల్లో చిట్ల సభ్యులు తమ చందా చెల్లించలేకపోతే... ఇక మిగతా వాళ్లకు చిట్లు పాడుకున్నా సరే డబ్బులు రావటం కష్టం. ఎందుకంటే కంపెనీ పేరిట ఉన్న వేటికీ డబ్బులు లేవు కాబట్టి!!.

ఇదిగో ఉదాహరణ.. ఎంసీఎఫ్ గుంటూరు బ్రాంచిలో 45 గ్రూపుల చిట్టీలు వేశారు. వాటిలో మొత్తం 2,040 టికెట్లు (చందాదారులు) ఉన్నాయి. 858 టికెట్లు మార్గదర్శివే. వాటి చందాగా మార్గదర్శి రూ.16.96 కోట్లు చెల్లించాలి. కానీ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని బ్రాంచి మేనేజర్(ఫోర్‌మేన్) అంగీకరించారు. కేవలం రికార్డుల్లో ఎంట్రీలను అటూ ఇటూ జంబ్లింగ్ చేసి చూపిస్తోంది. మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ మొత్తంగా 2,300 చిట్టీలను నిర్వహిస్తోంది. వాటిలో లక్షమందికిపైగా చందాదారులున్నారు. వాటిలో కొన్ని వేల టికెట్లు మార్గదర్శివే. కానీ సంస్థ యాజమాన్యం తన వాటాగా ఒక్క రూపాయి కూడా పెట్టలేదు. గొలుసు కటకట్లు మాదిరిగా ఒక చిట్ సొమ్మును వేరే చోట సర్దుబాటు చేస్తూ కొందరికి ష్యూరిటీల పేరిట ఆలస్యం చేస్తూ మరికొందరికి డిపాజిట్ల పేరిట తర్వాత ఇస్తామని చెబుతూ రోజులు నెట్టుకొస్తోంది. అదీ కథ.


మార్గదర్శి కార్యాలయం నుంచి రికార్డులు తీసుకెళ్తున్న సీఐడీ అధికారులు

ఒక్క బ్యాంకు ఖాతా చాలట!!

చిట్‌ఫండ్ సంస్థలు తమ నిర్వహించే ప్రతి చిట్టీకీ సంబంధిత బ్యాంకు ఖాతా వివరాలివ్వాలి. మార్గదర్శి దీన్ని పట్టించుకుంటే ఒట్టు. చిట్టీల ఒప్పందాల్లో బ్యాంకు పేరును చెబుతోంది తప్ప ఖాతాల నంబర్లు, ఇతర వివరాలను ఇవ్వటమే లేదు. ప్రతి చిట్టీకీ ఒక ప్రత్యేక బ్యాంకు ఖాతా ఉండాల్సి ఉండగా... దాన్నీ పాటించటం లేదు. అన్నీ ఒకే బ్యాంకు ఖాతాలో భారీగా పోగేస్తోంది. నిజానికిదో పెద్ద ఆర్థిక కుట్ర. నిబంధనల ప్రకారం చిట్టీల బ్యాంకు ఖాతాలపై సదరు బ్రాంచి మేనేజర్ (ఫోర్‌మేన్)కు చెక్ పవర్ ఉండాలి. ఆ మేనేజరే అన్నీ చూడాలి. కానీ మార్గదర్శిలో ఏ బ్రాంచి మేనేజర్‌కూ చెక్ పవర్ లేదు. అంతా హైదరాబాద్ హెడ్ ఆఫీస్ నుంచే నడిపిస్తున్నారు. అక్కడ ఒకరికే చెక్ పవర్ కల్పించడం వెనుక గూడుపుఠాణి ఏమంటే... ఆ ఖాతా నుంచి నిధులు మళ్లించటం ఈజీ కనక. మ్యూచువల్ ఫండ్స్, ఇతర స్టాక్ మార్కెట్ సాధనాల్లో పెట్టుబడి పెట్టడం నేరమైనా... మార్గదర్శి చేస్తున్నది అదే. తమ గ్రూపు సంస్థ ఉషోదయ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 88.5శాతం వాటాను మార్గదర్శి చిట్స్ కొనుగోలు చేసింది. ఇతర సంస్థల్లోకీ అక్రమంగా నిధులు మళ్లించింది. హైరిస్క్ ఉన్న వీటిలో పెట్టుబడులు పెడుతున్నట్లు చందాదారులకు కనీసం తెలియకుండా... దశాబ్దాలుగా రామోజీ సాగిస్తున్న ఆర్థిక దోపిడీ ఇది.

డిపాజిట్లు సేకరించటం నేరమే అయినా...

చిట్టీ పాడిన చందాదారుడికి చిట్టీ మొత్తం చెల్లించినట్టుగా చిట్స్ రిజిస్ట్రార్‌కు చూపిస్తున్న మార్గదర్శి... ఆ చందాదారుడికి పూర్తిగా చెల్లించకపోవటం గమనార్హం. ష్యూరిటీలు సరిగా లేవన్న కారణాలతో పలువురు చందాదారుల నుంచి ఫ్యూచర్ సెక్యూరిటీ పేరిట మిగిలిన కాలానికి చెల్లించాల్సిన చందాను తమ వద్దే ఉంచుకుంటున్నారు. దానికి ఓ రశీదు ఇస్తున్నారు. దానిపై 4–5 శాతం వడ్డీ ఇస్తున్నారు. ఇలా డిపాజిట్లు సేకరించటం చట్టప్రకారం నేరం. రామోజీ మాత్రం అదేమీ పట్టించుకోవటం లేదు. దానికి ఇదిగో ఉదాహరణ...

మేనేజర్ల పేరిట మరో పన్నాగం...

- తన అక్రమాలకు వారిని బలి చేసే కుతంత్రం
- న్యాయస్థానాన్నీ తప్పుదోవపట్టించేందుకు యత్నం

అవినీతి బాగోతం బయటపడే సమయంలో దానికి సాంకేతిక కారణాలు చూపించి తప్పించుకోవటంలో రామోజీది అందెవేసిన చెయ్యి. అదే తరహాలో చిట్స్ విషయంలోనూ ఈ ఉల్లంఘనలన్నింటినీ తమ బ్రాంచి మేనేజర్లు(ఫోర్‌మెన్) నెత్తిన రుద్దీ తప్పించుకునే దుర్మార్గానికి తెరతీశారు రామోజీ. కానీ స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు ఈ కేసును శాస్త్రీయంగా అధ్యయనం చేసి... తగిన ఆధారాలు సేకరించడం ద్వారా రామోజీ ఎత్తును చిత్తు చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు బయటపడగానే రామోజీరావు తన ఈనాడు పత్రికలో అరపేజీ ప్రకటన ఇచ్చారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు సంబంధించి అన్ని వ్యవహారాలు బ్రాంచి మేనేజర్లు(ఫోర్‌మెన్) మాత్రమే చూస్తారు ...సర్వాధికారాలు వారివేనని అందులో పేర్కొన్నారు. అంతేకాదు తెలంగాణ న్యాయస్థానంలో వేసిన పిటిషన్‌లో అదే మాట చెప్పారు. తద్వారా బ్రాంచి కార్యాలయాల్లో అక్రమాలతో తనకు సంబంధం లేదని చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేశారు. కానీ స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ విభాగాలు రామోజీరావు కుట్రను సమర్థంగా తిప్పికొట్టాయి. ఎందుకంటే మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు కేవలం నిమిత్త మాత్రులు. వారికి తమ బ్రాంచిలోని ఖాతాలకు సంబంధించి కనీసం చెక్ పవర్ కూడా లేదు. అంటే వారికి సర్వాధికారాలు ఉన్నాయని రామోజీ ఇచ్చిన ప్రకటనలో గానీ న్యాయస్థానంలో వేసిన పిటిషన్‌లో గానీ చెప్పినవన్నీ అబద్ధాలేనన్నది స్పష్టమైంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అన్ని అక్రమాలకు రామోజీరావు, ఆయన కోడలు శైలజే పూర్తి బాధ్యులనేది సుస్పష్టం.


విజయవాడలో మార్గదర్శి మేనేజర్‌ను తీసుకువెళ్తున్న సీఐడీ అధికారులు

ఒకే వ్యక్తి నుంచి రూ.కోటికిపైగా అక్రమ డిపాజిట్లు

మార్గదర్శిలో ఓ చందాదారునికి 24 చిట్టీలున్నాయి. ఆయన నుంచి మార్గదర్శి చిట్‌ఫండ్స్ 'రశీదు' రూపంలో రూ.కోటికిపైగా డిపాజిట్లు వసూలు చేసింది. దీనిపై ఆ సభ్యుడిని విచారించగా విస్మయకర అంశాలు వెల్లడయ్యాయి. టీడీఎస్ మినహాయించుకోకుండా తాము డిపాజిట్లు సేకరిస్తున్నామని మార్గదర్శి చిట్స్ తనకు చెప్పిందని ఆయన తెలిపారు. బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే టీడీఎస్ చెల్లించాలి. అదే మార్గదర్శిలో అయితే టీడీఎస్ అవసరం లేదని చెప్పి ఆయన్ని ఆకర్షించారు. ఇది ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం నేరం. నిజానికి గతంలో మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట ఎలాంటి అనుమతులూ లేకుండా రూ.2,600 కోట్లు డిపాజిట్లుగా వసూలు చేశారు. దీన్ని నాటి ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ బయటపెట్టడంతో కేసులు నమోదయ్యాయి. విచిత్రమేంటంటే కేసులు కొనసాగుతుండగా... నేరాన్ని కప్పిపుచ్చుకోవటానికి మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను రామోజీరావు మూసేశారు. ఇలా డిపాజిట్లు సేకరించటం ఐటీ చట్టం ప్రకారం నేరం. ఎంత సేకరిస్తే అంత మొత్తాన్ని పన్ను రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.ఈ మేరకు ఐటీ కూడా రామోజీకి నోటీసులు జారీ చేసింది. దానిపైనా పలు కేసులు నడుస్తున్నాయి. అలాంటి సమయంలో సంస్థను కుట్రపూరితంగా మూసేయటమే కాక... ఇపుడు చిట్స్ ముసుగులో రకరకాల పేర్లతో డిపాజిట్లు సేకరిస్తుండటం గమనార్హం.


విజయవాడ బందర్ రోడ్డు లబ్బీపేట సమీపంలో ఉన్న మార్గదర్శి కార్యాలయం

నేడు కదిరి లక్ష్మీనరసింహుడి రథోత్సవం

కదిరి: శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరగనుంది. ఉదయం 7 నుంచి 7.45 గంటల మధ్య రథోత్సవాన్ని ప్రారంభించనున్నారు. ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు కదిరికి చేరుకున్నారు. రథోత్సవంలో మూడు లక్షల మందికిపైగా భక్తులు పాల్గొననున్నట్లు అంచనా. తమిళనాడు అండాల్ అమ్మవారి శ్రీవల్లి పుత్తూరు రథం, తంజావూరు జిల్లాలోని తిరువార్ రథం తర్వాత దేశంలో అతి పెద్ద రథంగా కదిరి తేరు ప్రసిద్ధి చెందింది.

తెలంగాణ

భువనగిరిలో వెలుగుచూసిన దాన శాసనం

ప్రతాపరుద్రుని కాలం నాటిదని గుర్తింపు

సాక్షి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో అభివృద్ధి పనుల కోసం శనివారం చేపట్టిన తవ్వకాల్లో బయటపడిన పురాతన ఆలయ ఆనవాళ్లను కొత్త తెలంగాణ చరిత్ర బృందం గుర్తించింది. ఆలయాన్ని శ్రీ వీరభద్రేశ్వర క్షేత్రంగా, తెలుగు శాసనాన్ని దాన శాసనంగా గుర్తించింది. దాన శాసనంపై చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఆదివారం వెల్లడించిన వివరాలివి. ఆచంద్రార్కం.. అంటే సూర్యచంద్రులు ఉన్నంతకాలం శ్రీవీరభద్రేశ్వర దేవరకు, గర్భగుడిలో నిర్వహించే పూజాదికాలు, ఇతర సేవల నిర్వహణకు వ్యాపారులు విక్రయించే సరుకులపై సుంకం వసూలు చేయాలని నిర్ణయించారు. దేవుని ధూపదీప నైవేద్యాలకు నిత్యం సోలెడు గానుగ నూనె ఉచితంగా ఇవ్వాలని భువనగిరికి చెందిన అష్టాదశ ప్రజలు (పద్దెనిమిది కులాలు) నిర్ణయించారు. భువనగిరి ప్రజలకు పుణ్యం కలిగేందుకు సుంకం ఇవ్వడానికి వ్యాపారులు, ఉచితంగా నూనె ఇవ్వడానికి అష్టాదశ ప్రజలు ముందుకొచ్చారు. దీనికోసం ఏర్పాటు చేసిందే దాన శాసనమని హరగోపాల్ వివరించారు. మహామండలేశ్వరుడైన కాకతీయ ప్రతాపరుద్ర దేవ మహారాజు పరిపాలనా కాలం శక సంవత్సరం 1240 కాళయుక్తి సంవత్సరం ఆషాఢ శుద్ధ 15 పౌర్ణమి గురువారం (క్రీ.శ 1318 జూన్ 14న) దాన శాసనం వేసినట్లు హరగోపాల్ తెలిపారు.

అన్ని నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు

సాక్షి, హైదరాబాద్‌క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్త నుంచి పార్టీ ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర నాయకుల మధ్య ఆత్మీయ అనుబంధాన్ని బలోపేతం చేసుకునే దిశలో కార్యాచరణ రూపొందించుకోవాలని, ఇందుకోసం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'ఆత్మీయ సమ్మేళనాలు'నిర్వహించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కె. తారకరామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేస్తూ, 60 లక్షల మంది పార్టీ శ్రేణులను మరింత చైతన్యపరిచేలా విస్తృతంగా కార్యక్రమాలను చేపట్టాలని ఆయన కోరారు. ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు రూపొందించిన కార్యక్రమాల షెడ్యూల్‌ను ఆయన ఈ సందర్భంగా పార్టీ నేతలకు వివరించారు. వీలున్నంత మేరకు నాయకులు ప్రజల్లో ఉండేలా ఈ కార్యక్రమాలను రూపొందించామని చెప్పారు.

కార్యకర్తలే బలం..

బీఆర్‌ఎస్‌కు పార్టీ కార్యకర్తలే బలమని, వారితో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని కేటీఆర్ టెలీ కాన్ఫరెన్స్‌లో నాయకులకు సూచించారు. 'ఈ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలు ఎమ్మెల్యేలు తీసుకోవాలి. ఇందుకోసం ప్రతి 10 గ్రామాలను ఒక యూనిట్‌గా తీసుకోండి. ఆ 10 గ్రామాల కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేయండి. పట్టణాల్లో అయితే పట్టణానికి ఒక యూనిట్‌గా లేదంటే కొన్ని డివిజన్లను ఒక యూనిట్‌గా చేసి సమ్మేళనాలు నిర్వహించండి. ఈ సమావేశాలకు స్థానిక ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, ఇతర పార్టీ ముఖ్యులను ఆహ్వానించండి'అని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏప్రిల్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి ఈ సమ్మేళనాలు పూర్తయ్యేలా ఏ రోజు ఏ యూనిట్‌లో నిర్వహిస్తారనే షెడ్యూల్‌ను తేదీలతో సహా జిల్లా అధ్యక్షులు పార్టీకి తెలియజేయాలని సూచించారు.

అంబేడ్కర్ స్ఫూర్తిని గౌరవించుకుంటున్నాం

పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి జిల్లాల్లోని పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవాలను కూడా పూర్తి చేసుకోవాలని కేటీఆర్ ఆదేశించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బి.ఆర్. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని, ఆ దిశగా జయంతి కార్యక్రమాల షెడ్యూల్‌ను తయారు చేసుకోవాలని సూచించారు. 'దేశంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాం. మరోవైపు నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టుకుంటున్నాం. దేశ చరిత్రలో ఏ పార్టీ కూడా అంబేడ్కర్ వారసత్వ స్ఫూర్తిని ఇంత ఘనంగా గౌరవించుకోలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, పార్టీ చేపట్టిన ఈ అద్భుత కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా ఉత్సవాలు నిర్వహించాలి'అని చెప్పారు.

విద్యార్థి విభాగం బలోపేతం..

2023–24 విద్యాసంవత్సరం జూన్ నెల నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో పార్టీ విద్యార్థి విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని, సభ్యత్వ నమోదు చేపట్టడంతో పాటు విద్యార్థి విభాగానికి నూతన కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, ఇంటర్ నుంచి వృత్తి విద్యాకోర్సుల వరకు అన్ని స్థాయిల్లోని విద్యార్థులకు స్వాగత సభలు నిర్వహించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

పీహెచ్‌సీ నిర్మాణానికి రూ.కోటి విలువైన భూమి దానం

దాతృత్వం చాటిన వైఎస్సార్‌సీపీ నేత కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ



సరుబుజ్జిలి: శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం కోసం వైఎస్సార్‌సీపీ నేత కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ రూ.కోటి విలువ చేసే రెండెకరాల భూమిని దానంగా ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు. 35 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న ఆయన రెండు సార్లు సరుబుజ్జిలి ఎంపీపీగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన భార్య రమాదేవి ఎంపీపీగా ఉన్నారు. పురుషోత్తపురంలో ఎప్పటి నుంచో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించాలని అనుకుంటున్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం సహకారంతో రెండో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించి, భవన నిర్మాణానికి తన సొంత భూమిని దానమిచ్చారు.

కవితావైభవం చాటిన జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనం


జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనానికి తరలివచ్చిన కవులు

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని సర్ సీవీ రామన్ స్కూల్‌లో ఆదివారం జరిగిన జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనం కవితా వైభవాన్ని చాటింది. అటు సామాజిక కవిత్వ ప్రభావాన్ని.. ఇటు ఉగాది ఉషస్సును కాంక్షిస్తూ ఈ కవి సమ్మేళనం సాగింది. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా కమిటీ, కోనసీమ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతీయ కవి సమ్మేళనానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాల నుంచి 140 మంది కవులు హాజరై, తమ కవితలను వినిపించారు. కొందరు కవులు తెలుగు భాషా విశిష్టతను ఉగాది ఉషస్సుతో ముడిపెట్టి కవితలు చెప్పారు. మరికొందరు పచ్చని కోనసీమ అందాలను కవితా రూపంలో అభివర్ణించారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్, కవి డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన ఈ కవి సమ్మేళనాన్ని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు, కవి బీవీవీ సత్యనారాయణ, కళావేదిక ప్రతినిధులు రుద్రరాజు నానిరాజు, రవణం వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

తెలంగాణ

దర్భశయనం శ్రీనివాసాచార్యకు ఇంద్రగంటి పురస్కారం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖకవి ఇంద్రగంటి శ్రీకాంతశర్మ పేరిట ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన 'ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సాహితీ పురస్కారం'2022వ సంవత్సరానికిగాను విలక్షణకవి దర్భశయనం శ్రీనివాసాచార్యకు లభించింది. శ్రీకాంత శర్మ తనయుడు ఇంద్రగంటి మోహన కృష్ణ స్వగృహంలో ఆదివారం జరిగిన సభలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. శ్రీనివాసాచార్యను మెమెంటో, శాలువా, రూ.25 వేల నగదుతో సత్కరించారు. శ్రీకాంత శర్మ సహచరి ఇంద్రగంటి జానకీబాల ఆప్తవాక్యంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో శ్రీనివాసాచార్య కవితాప్రస్థానం గురించి ముఖ్యఅతిథి కోడూరి విజయ్‌కుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో సాహితీప్రముఖులు మహమ్మద్ ఖదీర్‌బాబు, సుబ్బరాయశాస్త్రి, ఎ.విద్యాదేవి, ఒమ్మి రమేశ్‌బాబు, కె.సజయ, ఇంద్రగంటి మోహనకృష్ణ, ఇంద్రగంటి కిరణ్మయి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

విమానంలో పొగతాగి ప్రయాణికుడి హల్‌చల్

ముంబై: యూకే రాజధాని లండన్ నుంచి మహారాష్ట్ర రాజధాని ముంబైకి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానంలో ఓ యువకుడు సిగరెట్ తాగడమే కాకుండా, తోటి ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేశాడు. వారించిన సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించాడు. గట్టిగా అరుస్తూ విమానం తలుపును బలవంతంగా తెరిచేందుకు ప్రయత్నించాడు. దీంతో విమాన సిబ్బంది అతడి కాళ్లు, చేతులు కట్టేసి సీట్లో కూర్చోబెట్టారు. ఈ సంఘటన మార్చి 11న విమానంలో జరిగిందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ''మార్చి 11న లండన్ నుంచి ముంబై వెళ్లే ఏఐ130 విమానంలో 37 ఏళ్ల రమాకాంత్ వాష్‌రూమ్‌లో సిగరెట్ తాగాడు. వెంటనే అలారం మోగింది. పొగ తాగవద్దని సిబ్బంది వారిస్తే వినకుండా వారితో అనుచితంగా ప్రవర్తించాడు. ఘర్షణకు దిగాడు'' అని ఎయిర్ ఇండియా తెలియజేసింది. ముంబైలో విమానం దిగాక అతడిని పోలీసులు అప్పగించారు. ప్రయాణికులకు ఇబ్బంది కలిగించినందుకు రమాకాంత్‌పై పోలీసులు ఐపీసీ సెక్షన్ 336తోపాటు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్–1937 కింద కేసు నమోదు చేశారు. రమాకాంత్‌కు అమెరికా పౌరసత్వం ఉంది. వాస్తవానికి విమానాల్లో పొగతాగేందుకు అనుమతి లేదు.

కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారి సోదరులు మృతి

న్యూఢిల్లీ: వీధి కుక్కలు రెండు రోజుల వ్యవధిలో సోదరులైన ఇద్దరు చిన్నారులను బలిగొన్నాయి. ఈ దారుణం సాక్షాత్తూ దేశ రాజధాని ఢిల్లీలో చోటుచేసుకుంది. నగరంలోని వసంత్‌కుంజ్ ప్రాంతానికి చెందిన ఆనంద్(7) కనిపించడం లేదంటూ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. అతడి కుటుంబం అటవీ ప్రాంతానికి దగ్గర్లోని గుడిసెలో నివసిస్తుంటుంది. పోలీసులు బాలుడి కుటుంబంతో కలిసి వెదకగా సమీప నిర్మానుష్య ప్రాంతంలో ఆనంద్ మృతదేహం కనిపించింది. శరీరంపై జంతువు చేసిన గాయాలున్నాయి. మేకలు, పందులపై తరచూ దాడి చేసే వీధి కుక్కలే చిన్నారిని చంపేసి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత ఆదివారం ఆనంద్ తమ్ముడు ఆదిత్య(5) స్నేహితులతో కలిసి ఆటకు వెళ్లాడు. స్నేహితులకు దూరంగా ఒంటరిగా వెళ్లిన ఆదిత్యను కూడా వీధి కుక్కలు ముట్టడించి తీవ్రంగా గాయపరిచాయి. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రెండు ఘటనలపై వివిధ కోణాల్లో ఆధారాలు సేకరించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ఈ వేసవి గండం గట్టెక్కగలమా?

మార్చిలోనే సూరీడు మండిపోతున్నాడు. ఈ ఏడాది వేసవి భగభగలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. మండే ఎండలకు తోడు ఎన్నో సమస్యలు ఎదురు కానున్నాయి. వడగాడ్పులు, విద్యుత్ సంక్షోభం, నీటి ఎద్దడి బాధించనున్నాయి. 1901 తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరి అత్యంత వేడి నెలగా రికార్డులకెక్కింది. సగటు ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెల్సియస్‌కు దాటాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. కొంకణ్, కచ్ ప్రాంతాల్లో ఫిబ్రవరిలోనే వేడిగాడ్పులపై ప్రభుత్వం ప్రజల్ని అప్రమత్తం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్చి నుంచి మే వరకు వడగాడ్పులు తీవ్రంగా ఉంటాయని అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో వేసవి గండాన్ని ఎలా ఎదుర్కొంటామన్న ఆందోళనలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 6న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి వేసవిని ఎదుర్కోవడానికి కావాల్సిన సన్నద్ధతలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్య నిపుణులు, స్థానిక అధికారులు, విపత్తు నిర్వహణ బృందాలతో కలిసి వేసవి కాలాన్ని ఎదుర్కోవడానికి ఏమేం చర్యలు చేపట్టాలన్న దానిపై చర్చించారు.

వేసవి ప్రభావం ఇలా..

ప్రపంచ బ్యాంకు 2022లో ఇచ్చిన నివేదిక ప్రకారం భారత్‌లో వేసవి మరణాలు ఇక అధికం కానున్నాయి. కాంక్రీట్ జంగిళ్లుగా మారిన నగరాలు వడగాడ్పులతో వేడెక్కనున్నాయి.

- ఎండవేడిమికి 2000-04 నుంచి 2017-21 మధ్య 55శాతం మరణాలు పెరిగిపోయాయి.
- 2021లో ఎండలకి 16,700 కోట్ల కార్మికుల పని గంటలు వృథా అయ్యాయి.
- ఎండాకాలంలో కార్మికులు పనుల్లోకి వెళ్లకపోవడం వల్ల దేశ జీడీపీలో గత ఏడాది 5.4% ఆదాయం తగ్గిపోయింది.
- 2022లో దేశ వ్యాప్తంగా 203 రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో వడగాడ్పులు వీచాయి. వందేళ్ల తర్వాత ఇదే అత్యధికం
- ఉత్తరాఖండ్‌లో అత్యధికంగా 28 రోజులు, రాజస్తాన్‌లో 26 రోజులు, పంజాబ్, హరియాణాలో 34 రోజులు చొప్పున వడ గాడ్పులు వీచాయి.
- వేసవికాలం వచ్చిందంటే కార్చిచ్చుల సమస్య వేధిస్తుంది. 2017లో కొండప్రాంతంలో ఉన్న ఉత్తరాఖండ్‌లో 1,244 హెక్టార్ల అటవీ ప్రాంతాన్ని కార్చిచ్చులు దహిస్తే 2021 నాటికి మూడు రెట్లు ఎక్కువగా 3,927 హెక్టార్లు కార్చిచ్చుతో నాశనమయ్యాయి.



- ఇప్పటికే హిమానీనదాలు కరిగిపోతూ ఉండడంతో సముద్ర తీర ప్రాంతాలు ముప్పులో ఉన్నాయి. వేసవిలో ఎండ ఎక్కువగా ఉంటే మరింత మంచు కరిగి ముప్పు తీవ్రత ఎక్కువైపోతుంది




- ఢిల్లీ రాజధాని ప్రాంతంలో గత ఏడాది ఎంత తీవ్రతకి 300 పిట్టలు మృతి చెందాయి. వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకోవడానికి ఊళ్లపై పడి బీభత్సం సృష్టించే ఘటనలు పెరిగిపోతాయి.

వేసవి కాలం ఎండలు ఎక్కువ ఉండడం రబీ సీజన్ పంటలపై తీవ్రంగా ప్రభావం పడుతుంది. ముఖ్యంగా ప్రపంచ గోధుమ ఎగుమతుల్లో రెండో స్థానంలో ఉన్న భారత్‌లో ఈ ఏడాది గోధుమ దిగుబడిపై ప్రభావం ఉంటుందనే ఆందోళనలున్నాయి.

ఏయే ప్రాంతంలో వడగాడ్పులు ఉండబోతున్నాయి?

మార్చి నుంచి మే వరకు దేశంలో ఉక్కబోత భరించలేనంతగా ఉంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో ఎండ వేడిమి ఎక్కువగా ఉంటుంది.మధ్య భారతం, వాయవ్య రాష్ట్రాల్లోనూ అత్యధిక ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకునే అవకాశాలున్నాయి. ఉత్తరాదితో పోల్చి చూస్తే దక్షిణాది రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా నమోదవుతాయి. ఇంటర్‌గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (ఐపీసీసీ) అంచనాల ప్రకారం వడగాడ్పులు తరచుగా వీస్తాయి. రానున్న సంవత్సరాల్లో ఎండవేడిమి మరింతగా పెరిగిపోతుంది. ఈ ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో కాలానుగుణంగా వచ్చే మార్పుల కారణంగా ఎల్‌నినో పరిస్థితి ఏర్పడుతుందని అందువల్ల వేసవికాలం మరింత వేడిగా మారుతుందని అంచనాలున్నాయి. ఎల్‌నినో సంవత్సరాల్లో పంట దిగుబడి లేక కరువు కాటకాలు ఏర్పడతాయని పలు నివేదికలు చెబుతున్నాయి. ఏళ్లు గడుస్తున్న కొద్దీ వేసవి కాలం ఎదుర్కోవడం అత్యంత దుర్లభంగా మారుతోందని హెల్త్ అండ్ క్లైమేట్ రెసిలెన్స్ ఎన్‌ఆర్‌డీసీ ఇండియా చీఫ్ అభియంత్ తివారీ చెప్పారు. గత ఏడాది మార్చి 100 ఏళ్లలోనే అత్యంత వేడి మాసంగా నమోదైతే, ఈ ఏడాది ఫిబ్రవరి 122 ఏళ్ల రికార్డుల్ని బద్దలు కొట్టిందని అన్నారు. ఈ సారి వేసవిలో వడగాడ్పులు ఎక్కువగా ఉండడంతో గోధుమ పంటపై తీవ్ర ప్రభావం పడుతుందని, దీంతో ఆహార సంక్షోభం, నిత్యావసర ధరలు పెరిగిపోవడం వంటివి జరగనున్నాయని ఆయన అంచనా వేశారు.



గత ఏడాది వేసవి కాలంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకొని సంక్షోభం ఎదురైంది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశాలైతే కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో అత్యధికంగా విద్యుత్ డిమాండ్ 229 గిగావాట్లకు చేరుకోవచ్చునని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ అంచనా వేసింది. ఇక రాత్రి వేళల్లో కూడా 217

విద్యుత్ కోతలు తప్పవా..?

గిగావాట్లకు విద్యుత్ వినియోగం చేరుకునే అవకాశాలున్నాయి. గత ఏడాది ఏప్రిల్‌లో రాత్రిపూట విద్యుత్ వినియోగం కంటే ఇది చాలా ఎక్కువ. ఇలాంటి పరిస్థితుల వల్ల గ్రిడ్లపై ఒత్తిడి పెరిగిపోతుందని గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ తెలిపింది. థర్మల్ విద్యుత్ ప్లాంట్లకి బొగ్గు కొరత, జల విద్యుత్ ప్రాజెక్టులకి నీటి కొరత కారణంగా ఈ సారి వేసవి కూడా పెను విద్యుత్ సంక్షోభానికి దారి తీసే అవకాశాలున్నాయి.

ఒడిశా బాటలో...

మన దేశంలో ఒడిశా వేసవికాలంలో ఎదురయ్యే సమస్యల్ని ఒక ప్రణాళికా బద్ధంగా ఎదుర్కొని విజయం సాధించింది. ఇప్పటివరకు ఒడిశా మాత్రమే వేసవికాలాన్ని కూడా ఒక ప్రకృతి విపత్తుగా అధికారికంగా ప్రకటించింది. 1998లో వేసవికాంలో వడదెబ్బకు ఏకంగా 2,042 మంది పిట్టల్లా రాలిపోయారు. ఆ తర్వాత ఏడాది వడదెబ్బ మృతుల సంఖ్య 91కి, తర్వాత ఏడాదికి 41కి తగ్గించగలిగింది. దీనికి ఒడిశా ప్రభుత్వం చేసిందల్లా ఎండ తీవ్రత ఉన్నప్పుడు బయట ఎవరూ తిరగకూడదంటూ నిబంధనలు విధించింది. మిట్ట మధ్యాహ్నం సమయంలో ప్రభుత్వ కార్యాలయాలు కూడా మూసేసింది. రాష్ట్రంలోని వీధివీధిలోనూ చలివేంద్రాలు, పందిళ్లు ఏర్పాటు చేసింది. విద్యుత్ కోతలు లేకుండా, నీటికి ఇబ్బంది లేకుండా ముందుగా ఏర్పాట్లు చేస్తూ వచ్చింది. సూర్యుడు అస్తమించిన తర్వాత రాత్రిపూట పనులు చేసేలా చర్యలు తీసుకుంది. వడదెబ్బతో మరణించే వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటోంది. దీంతో ఇతర రాష్ట్రాలు కూడా ఒడిశా బాటలో నడిస్తే మంచిదన్న అభిప్రాయాలైతే వినిపిస్తూ ఉన్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

నేటి నుంచి పార్లమెంటు సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆర్థిక బిల్లుకు ఎలాగైనా ఆమోదం పొందాలని అధికార బీజేపీ, అదానీ వ్యవహారం, రాజకీయ ప్రత్యర్థులపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పడం వంటివి ప్రస్తావించి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రతిపక్ష పార్టీలు చూస్తున్నాయి. వ్యూహరచన చేయడానికి ప్రతిపక్ష పార్టీలు సోమవారం ఉదయం సమావేశం కానున్నాయి. అదానీ–హిండెన్‌బర్గ్‌పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణ చేపట్టాలన్న డిమాండ్‌ను తాము కొనసాగిస్తామని కాంగ్రెస్ నాయకుడు కె. సురేశ్ చెప్పారు. ఢిల్లీ మద్యం పాలసీ అవకతవకల కేసు, లాండ్ ఫర్ జాబ్స్ కేసుల్లో సీబీఐ, ఈడీలను ప్రతిపక్ష పార్టీ నాయకులపైకి ప్రయోగిస్తోందన్న అంశం కూడా ఈ సారి సమావేశాల్లో హాట్ టాపిక్ కానుంది. మార్చి 13న మొదలు కానున్న పార్లమెంటు సమావేశాలు ఏప్రిల్ 6 వరకు కొనసాగుతాయి.

సహకరించండి: ఉపరాష్ట్రపతి

సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని వివిధ పార్టీల నేతలకు ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన తన నివాసంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సభ నిర్వహణపై విపక్ష నేతల నుంచి సూచనలు, సలహాలను కోరారు. సమావేశానికి డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, విజయ సాయిరెడ్డి (వైఎస్సార్‌సీపీ), జైరాం రమేశ్ (కాంగ్రెస్) రాంగోపాల్ యాదవ్ (ఎస్పీ), కె.రవీంద్రకుమార్ (టీడీపీ), కేశవరావు (బీఆర్ఎస్)లతో పాటు పలు పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు తమ తమ డిమాండ్లను ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ధన్‌ఖడ్ ప్యానెల్ వైస్ ఛైర్మన్లతో భేటీ అయ్యారు. ప్యానెల్ వైస్ ఛైర్మన్లు విజయసాయిరెడ్డి, భువనేశ్వర్ కలితా, సరోజ్ పాండే, సుసరేంద్ర సింగ్ నగార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే రాజ్యసభ ఛైర్మన్‌ను ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ముఖ్యమైన ప్రతి అంశంపైనా చర్చకు ప్రతిపక్ష పార్టీలు కోరుతున్నాయని చెప్పారు. ప్రభుత్వాన్ని బాధ్యునిగా చేసేందుకు నిర్మాణాత్మకపాత్ర పోషిస్తాయని అన్నారు.

మహిళను చంపి, ముక్కలుగా నరికి..

జమ్మూకశ్మీర్‌లో దారుణం

శ్రీనగర్: ఢిల్లీలో అఫ్తాబ్ పూనావాలా అనే యువకుడు సహజీవనం చేస్తున్న శ్రద్ధా వాకర్ అనే యువతిని చంపి, 35 ముక్కలుగా నరికి వేర్వేరు ప్రాంతాల్లో పడేసిన దారుణాన్ని గుర్తుకు తెచ్చే ఘటన ఇది. జమ్మూకశ్మీర్‌లోని బుద్గా జిల్లాలో చోటుచేసుకుంది. పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించిందనే కోపంతో షబీర్ అహ్మద్ వనీ(45) అనే వ్యక్తి కార్పెంటర్ ఓ మహిళ(30)ను చంపేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా నరికి వేర్వేరు చోట్ల పాతిపెట్టాడు. మార్చి 7వ తేదీన కోచింగ్ క్లాస్‌కని వెళ్లిన తన సోదరి కనిపించకుండా పోయిందంటూ షోయిబుగ్‌కు చెందిన తన్వీర్ అహ్మద్ ఖాన్ అనే వ్యక్తి 8న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సదరు మహిళ సెల్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు మొహన్‌పురా ఒంపొరాకు చెందిన వనీని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించాడు. అతడిచ్చిన సమాచారంతో పాతిపెట్టిన మహిళ శరీర భాగాలను శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం పెళ్లి చేసుకుంటానంటూ వనీ చేసిన ప్రతిపాదనను తిరస్కరించడంతో ఆమెపై పగబట్టినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల పట్ల సున్నితత్వంతో మెలగాలి: రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ: మహిళల పట్ల సున్నితత్వాన్ని అలవర్చుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మీడియాను కోరారు. వార్తలు, కార్యక్రమాలు, వాణిజ్య ప్రకటనలు ప్రసారం చేసేటప్పుడు మహిళల గౌరవాన్ని, భద్రతను దృష్టిలో పెట్టుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రతి భారతీయ పౌరుడు మహిళ గౌరవానికి భంగం కలిగించే చర్యలను విడనాడాలని మన రాజ్యాంగం చెబుతోందని గుర్తు చేశారు. నవభారత్ టైమ్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆల్ వుమెన్ బైక్ ర్యాలీను జెండా ఊపి ప్రారంభించిన సందర్భంగా ఆమె ఈ మేరకు ఒక వీడియో సందేశం పంపారు. 'మహిళలను గురించి ప్రతి పౌరుడు గౌరవప్రదంగా ఆలోచించాలి. మహిళల పట్ల మర్యాదపూర్వకమైన ప్రవర్తనకు పునాది కుటుంబమే. తల్లులు, సోదరీమణులు తమ కొడుకులు, సోదరుల్లో మహిళలకు గౌరవం ఇచ్చే విలువలను పెంపొందించాలి. విద్యార్థుల్లో మహిళల పట్ల గౌరవాన్ని, సున్నితత్వంగా మెలిగే సంస్కృతిని ఉపాధ్యాయులు పెంపొందించాలి'అని ద్రౌపదీ ముర్ము కోరారు. 'మహిళల్లో మాతృత్వ సామర్థ్యం, నాయకత్వ సామర్థ్యం సహజంగానే ఉంటాయి. అనేక పరిమితులు, సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ మహిళలు తమ అసమానమైన ధైర్యం, నైపుణ్యాలతో కొత్త విజయ రికార్డులను నెలకొల్పారు'అని ఆమె పేర్కొన్నారని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది.

నాకు సమాధి తవ్వే పనిలో...

విపక్షాలపై ప్రధాని మోదీ మండిపాటు

- పేదల సంక్షేమం, దేశ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నా
- ప్రజలే నాకు రక్షణ కవచం
- కర్ణాటకలో రహదారులు, పలు అభివృద్ధి పనులు ప్రారంభం
- మండ్యలో భారీ రోడ్డు షో



మండ్య జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ సుమలత, సీఎం బొమ్మైతో మోదీ

మండ్య/ధార్వాడ/హుబ్లీ: పేదల సంక్షేమం, దేశ అభివృద్ధి కోసం తాను అవిశ్రాంతంగా శ్రమిస్తుండగా, మరోవైపు కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తనకు సమాధి తవ్వే పనిలో తీరిక లేకుండా ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. కర్ణాటకలో మండ్య వద్ద 118 కిలోమీటర్ల పొడవైన బెంగళూరు–మైసూరు 10 లేన్ల ఎక్స్‌ప్రెస్ రహదారిని ఆయన ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. మైసూరు–కుశాలనగర 4 లేన్ల రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడారు. తనను సమాధి చేయాలని కాంగ్రెస్ కలలు కంటోందని ఆక్షేపించారు. తనకు ఈ దేశ మాతృమూర్తులు, ఆడపిల్లలు, ప్రజలు రక్షణ కవచంగా ఉన్నారనే సంగతిని విపక్షాలు మరచిపోయినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అభివృద్ధి పథంలో సాగుతోందన్నారు.

పేదల బతుకుల్లో మార్పు

దేశంలో గడిచిన 9 ఏళ్లలో వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా కోట్లాది మంది పేదల బతుకుల్లో మార్పు వచ్చిందని మోదీ అన్నారు. పేదల కనీస అవసరాలైన సొంత ఇల్లు, తాగునీరు, విద్యుత్, గ్యాస్ సరఫరా, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, ఆస్పత్రుల నిర్మాణం వంటి పనులను బీజేపీ ప్రభుత్వం చేపడుతోందన్నారు. 9 కోట్ల మంది పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చినట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ కింద 40 లక్షల ఇళ్లకు తాగునీటి సదుపాయం కల్పించినట్లు చెప్పారు.

140 కోట్ల మందిని అవమానించారు

విద్యార్థులు తమ చదువులు దేశాభివృద్ధికి ఉపయోగపడేలా కృషి చేయాలని మోదీ పిలుపునిచ్చారు. ధార్వాడలో ఐఐటీ విద్యాసంస్థ నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. లండన్‌లో బసవేశ్వరుడి విగ్రహాన్ని జాతికి అంకితం చేసే భాగ్యం తనకు కలిగిందన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా లండన్‌లో మాట్లాడారంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై మండిపడ్డారు. 140 కోట్ల మంది భారతీయులను అవమానించారని దుయ్యబట్టారు. ఇలాంటి వ్యక్తులను రాజకీయాలకు దూరంగా ఉంచాలన్నారు.

ప్రపంచ దేశాలకు ఆశాకిరణం

ప్రపంచ దేశాలకు ప్రస్తుతం భారత్ ఆశాకిరణంలా కనిపిస్తోందని ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. భారత్‌లో అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అవి ఆరాటపడుతున్నాయని తెలిపారు. దేశంలో విదేశీ పెట్టుబడులు పెరుగుతున్నట్లు చెప్పారు. కరోనా మహమ్మారి వ్యాప్తి సమయంలోనూ కర్ణాటకలో రూ.4 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వల్లే ఇది సాధ్యమైందని వివరించారు.

పొడవైన రైల్వే ప్లాట్‌ఫామ్ జాతికి అంకితం

ప్రపంచంలోనే అత్యంత పొడవైనదిగా గిన్నిస్ రికార్డుకెక్కిన కర్ణాటకలో శ్రీ సిద్ధారూఢ స్వామీజీ హుబ్బళ్లి రైల్వే స్టేషన్‌లోని 1,507 మీటర్ల పొడవైన ప్లాట్‌ఫామ్‌ను ప్రధాని ఆదివారం జాతికి అంకితం ఇచ్చారు. పలు రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించారు. విద్యుదీకరించిన హొస్పేట–హుబ్బళ్లి–తినాయ్‌ఘాట్ రైల్వే సెక్షన్‌ను జాతికి అంకితమిచ్చారు. హుబ్బళ్లి–ధార్వాడ స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా పలు పనులకు శంకుస్థాపన చేశారు. జయదేవ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ నిర్మాణానికి, ధార్వాడ మల్టీ విలేజ్ వాటర్ సప్లై స్కీమ్ పనులకు పునాదిరాయి వేశారు. తుప్పరిహళ్లి ఫ్లడ్ డ్యామేజ్ కంట్రోల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. మండ్య జిల్లాకేంద్రంలో ప్రధాని రోడ్డు షోలో పాల్గొన్నారు.

అన్యాయంపై ప్రజాగ్రహమే దండి యాత్ర

న్యూఢిల్లీ: చరిత్రాత్మక దండి యాత్ర వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ ఆదివారం మహాత్మా గాంధీకి, యాత్రలో పాల్గొన్న నేతలకు నివాళులర్పించారు. బ్రిటిష్ వారిపై ప్రజల పోరాటంగా దండి యాత్ర గుర్తుండిపోతుందన్నారు. అన్యాయంపై ప్రజాగ్రహమే దండి యాత్ర అని ట్విట్టర్‌లో తెలిపారు. మన దేశ చరిత్రలో దండి యాత్ర కీలకమైన ఘట్టమని ఉద్ఘాటించారు. దండి యాత్రగా పేరుగాంచిన ఉప్పు సత్యాగ్రహం 1930 మార్చి 12న ప్రారంభమై ఏప్రిల్ 5న ముగిసింది.

సొంత పట్టణం నిర్మించనున్న ఎలాన్ మస్క్



టెక్సాస్: ప్రపంచ కుబేరుడు, అమెరికాకు చెందిన ఎలాన్ మస్క్ సొంతంగా ఒక పట్టణాన్నే నిర్మించబోతున్నారు. ఇందుకోసం ఆయన కంపెనీలు, అనుబంధ సంస్థలు టెక్సాస్‌లో వేలాది ఎకరాల భూమిని కొనుగోలు చేస్తున్నాయని వాల్ స్ట్రీట్ జర్నల్ తెలిపింది. ఆస్టిన్‌కు సమీపంలోని బస్ట్రోప్ కౌంటీలోసుమారు 3,500 ఎకరాల భూమిని కొనుగోలు చేశాయి. స్నెయిల్ బ్రూక్ అనే పేరుతో సొంత పట్టణాన్ని నిర్మించే పనుల్లో ఎలాన్ మస్క్ నిమగ్నమై ఉన్నారు. ప్రధానంగా మస్క్‌కు చెందిన బోరింగ్ కంపెనీ, టెస్లా, స్పేస్ ఎక్స్ తదితర సంస్థలకు ఆస్టిన్ సమీపంలో ఉత్పత్తి కేంద్రాలున్నాయి. కొత్త పట్టణంలో మార్కెట్ ధర కంటే చౌకగానే ఆఫీసులను ఏర్పాటు చేయనున్నాయి. ఉద్యోగుల నివాసాలు కూడా ఇందులోనే ఉంటాయి. నూతనంగా రూపుదాల్చే స్నెయిల్ బ్రూక్‌లో 100కు పైగా భవనాలను నిర్మిస్తారు. ఇందులో స్విమ్మింగ్ పూల్, క్రీడా మైదానాల వంటి ఏర్పాట్లూ ఉంటాయి. టెస్లా ప్రధాన కార్యాలయంతోపాటు తన వ్యక్తిగత నివాసాన్ని కాలిఫోర్నియా నుంచి టెక్సాస్‌కు మారుస్తానని గతంలోనే మస్క్ ప్రకటించారని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం గుర్తు చేసింది.

టైర్ పేలడం యాక్ట్ ఆఫ్ గాడ్ కాదు.. ఇన్సూరెన్స్ చెల్లించాల్సిందే: బాంబే హైకోర్టు

ముంబై: కారు టైర్ పేలిపోయి ఒక వ్యక్తి మరణానికి దారితీసిన ఘటనలో ఇన్సూరెన్స్ కంపెనీ నష్టపరిహారం ఎగ్గొట్టడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. టైర్ పేలిపోవడం యాక్ట్ ఆఫ్ గాడ్ తప్ప, డ్రైవర్ నిర్లక్ష్యం కాదంటూ చేసిన వాదనని బాంబే హైకోర్టు తోసిపుచ్చింది. కారు ప్రమాదంలో మరణించిన మకరంద్ పట్వర్థన్ కుటుంబానికి రూ.1.25 కోట్ల నష్టపరిహారం చెల్లించాల్సిందేనని తీర్పు చెప్పింది. 2010 అక్టోబర్ 25న పట్వర్థన్ (38) తన ఇద్దరు సహోద్యోగులతో కలిసి కారులో పుణె నుంచి ముంబై వెళుతున్నారు. వారిలో కారుని తెచ్చిన ఒక కొలీగ్ చాలా ర్యాష్‌గా డ్రైవ్ చేయడంతో కారు ముందు టైర్ పేలిపోయి పక్కనే ఉన్న మురుగు కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో పట్వర్థన్ అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబంలో ఆయన ఒక్కరే సంపాదనపరుడు కావడంతో ట్రిబ్యునల్ అతని కుటుంబానికి న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీ 1.25 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. అయితే కారు పేలిపోవడం యాక్ట్ ఆఫ్ గాడ్ అంటూ ఇన్సూరెన్స్ కంపెనీ డబ్బులు ఎగ్గొట్టడానికి ప్రయత్నించింది. బాంబే హైకోర్టులో పిటిషన్ వేసింది. దానిని విచారించిన కోర్టు టైర్ పేలిపోవడం యాక్ట్ ఆఫ్ గాడ్ కాదని, ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాల్సిందేనని తీర్పు చెప్పింది.

కరోనా మూలాల్ని తేల్చాలి: డబ్ల్యూహెచ్‌ఓ

జెనీవా: కరోనా మూలాలను కనుగొనడం నైతికావసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) అభిప్రాయపడింది. అప్పుడు ముమ్ముందు ఇతర వైరస్‌లు వ్యాప్తి చెందకుండా అడ్డుకట్ట వేయగలమని తెలిపింది. కోవిడ్–19ని మహమ్మారిగా ప్రకటించి మూడేళ్లు అవుతున్న సందర్భంగా డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ టెడ్రోస్ అధ్నామ్ ఘెబ్రెయాసెస్ మాట్లాడారు. కరోనాతో లక్షలాది మంది మరణించారని, కొన్ని కోట్ల మంది లాంగ్ కోవిడ్‌తో ఇబ్బందులు పడుతున్నారని అందుకే ఈ వైరస్ పుట్టుపూర్వోత్తరాలను కనుగొనాల్సిన నైతిక బాధ్యత ఉందని అన్నారు. కరోనా తొలి కేసు వెలుగులోకి వచ్చిన చైనాలోని వూహాన్‌లో డబ్ల్యూహెచ్‌ఓ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం 2021లోనే కొన్ని వారాలు గడిపి గబ్బిలాల నుంచి మనుషులకి ఈ వైరస్ సోకిందని నివేదిక సమర్పించింది. మరోవైపు అమెరికా అధ్యయనంలో ఈ వైరస్ వూహాన్ ల్యాబ్ నుంచి లీక్ అయిందని తేలింది. ఇలా రెండు పరస్పర విరుద్ధమైన వాదనలు ప్రచారంలో ఉండడం వల్ల ప్రజల్లో గందరగోళం నెలకొంది. అందుకే అసలు వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని టెడ్రోస్ చెప్పారు. అత్యంత ప్రమాదకర వైరస్‌లపై అధ్యయనానికి డబ్ల్యూహెచ్‌ఓ ఏర్పాటు చేసిన సైంటిఫిక్ అడ్వైజరీ గ్రూప్ కూడా ఇప్పటివరకు కరోనా వైరస్ పుట్టుకపై ఎలాంటి నిర్ధారణకు రాలేకపోయింది. కీలకమైన డేటా కనిపించడం లేదని కమిటీ అంటోంది.

భారత్‌లో పెరుగుతున్న కరోనా కేసులు

దేశంలో కరోనా కేసులు పెరుగుతున్నాయి. 113 రోజుల తర్వాత ఒకే రోజు 524 కేసులు నమోదైనట్టుగా కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 3,618కి చేరుకుంది.

థాయ్‌లాండ్‌లో వాయు కాలుష్యం.. 2 లక్షల మంది ఆస్పత్రి పాలు

బ్యాంకాక్: థాయ్‌లాండ్‌లో వాయు కాలుష్యం మితిమీరిపోయింది. కలుషిత గాలిని పీల్చి సుమారు 13 లక్షల మంది అస్వస్థతకు గురయ్యారు. బాధితుల్లో సుమారు 2 లక్షల మంది గతవారం ఆస్పత్రుల్లో చేరారు. వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడుతున్న పొగ, వ్యవసాయ వ్యర్థాల దహనం వంటి కారణాలతో దేశంలో గాలి నాణ్యత స్థాయిలు గణనీయంగా పడిపోయాయి. బ్యాంకాక్‌లోని 50 వరకు జిల్లాల్లో గాలి నాణ్యత సురక్షితం కాని 2.5 పీఎం స్థాయికి పడిపోయింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తున్న గాలి కాలుష్య స్థాయిని మించిపోయింది. ఈ స్థాయిలో గాలి కణాలు రక్తంలో కలిసిపోయి అవయవాలను దెబ్బతీస్తాయి.

స్వలింగ వివాహాలు చట్ట విరుద్ధమే!

అలాంటి వివాహాలకు చట్టబద్ధత కల్పించలేం

- అది ప్రాథమిక హక్కుగా పిటిషనర్లు కోరలేరు
- సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్
- నేడు విచారణ చేపట్టనున్న ధర్మాసనం



న్యూఢిల్లీ: స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీం కోర్టులో కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇలాంటి వివాహాలను చట్టబద్ధంగా గుర్తించడం అనేది వ్యక్తిగత చట్టాలు, ఆమోదయోగ్యమైన సామాజిక విలువల మధ్య సమతూకాన్ని దెబ్బతీస్తుందని వెల్లడించింది. అందుకే చట్టబద్ధత కల్పించలేమని వివరించింది. స్వలింగ వివాహాలు ముమ్మాటికీ చట్టవిరుద్ధమేనని పరోక్షంగా తేల్చిచెప్పింది. ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టనుంది. ఐపీసీ సెక్షన్ 377 కింద స్వలింగ సంపర్కం నేరం కాదని తేల్చినప్పటికీ.. స్వలింగ వివాహాన్ని చట్టబద్ధంగా గుర్తించడాన్ని ప్రాథమిక హక్కుగా పిటిషనర్లు కోరలేరని స్పష్టం చేసింది. స్త్రీ–పురుషుడి సంబంధాలు, వేర్వేరు వ్యక్తుల నడుమ వ్యక్తిగత అవగాహనతో ఏర్పడే సంబంధాలు చట్టవ్యతిరేకం కాదని అఫిడవిట్‌లో కేంద్రం వెల్లడించింది.

స్వలింగ సంపర్కుల సహజీవనం నేరం కాదు

ఇద్దరు స్త్రీలు లేదా ఇద్దరు పురుషుల నడుమ జరిగిన పెళ్లికి వ్యక్తిగత చట్టాలు లేదా రాజ్యాంగబద్ధమైన చట్టాల కింద చట్టబద్ధత కల్పించడం, గుర్తించడం సాధ్యం కాదని కేంద్రం పేర్కొంది. స్వలింగ సంపర్కులు కలిసి జీవించడం నేరం కాదని వెల్లడించింది. కానీ, దీన్ని భార్య, భర్త, పిల్లలతో కూడిన భారతీయ కుటుంబ యూనిట్‌తో పోల్చలేమని కేంద్రం అభిప్రాయపడింది. ఒకవేళ స్వలింగ వివాహాన్ని రిజిస్ట్రేషన్ చేస్తే అది ప్రస్తుతం ఉన్న వ్యక్తిగత చట్టాలను, నోటిఫైడ్ చట్టాలను ఉల్లంఘించినట్లు అవుతుందని వివరించింది.



అమెరికాలో కాలిఫోర్నియా రాష్ట్రంలోని మామూత్ లేక్స్‌లో ఇంటిపై మంచును తొలగిస్తున్న స్థానికులు

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం । 13 । మార్చి । 2023

ఉన్నత విద్యలో ఉచిత సేవలు



అగ్ని సిరగుగల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నేతృత్వంలో తమిళనాడు వ్యాప్తంగా విద్యార్థులకు ఉన్నత విద్యను ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఆదివారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి ఈ సంస్థ సేవలను ప్రారంభించారు. అలాగే ఉత్తమ సేవకులందించిన వారిని సత్కరించారు. - సాక్షి,చెన్నై

న్యూస్‌రీల్

రాష్ట్రంలో నిరుద్యోగులు 67.50 లక్షల మంది



తిరువొత్తియూరు: రాష్ట్రంలో 10వ తరగతి, ప్లస్- 2 కళాశాల కోర్సులు పూర్తయిన వారు ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకుంటారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు పేర్లు చేసుకున్న వారి సంఖ్య వివరాలు ఇలా ఉన్నాయి. 18 ఏళ్లకు లోబడిన వారు 18,74,522 మంది. 19 నుంచి 30 ఏళ్ల మధ్య ఉన్నవారు 28,09,940 మంది, 31 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు నిరుద్యోగుల సంఖ్య 18,34,217 మంది. 46 నుంచి 60 ఏళ్ల వయసున్న వారు 2,30,976 మంది ఉన్నారు. అలాగే 60 ఏళ్లు పైబడిన వారు 5,811 మంది ఉపాధి కార్యాలయంలో ఉద్యోగార్థులుగా వివరాలు సమర్పించి ఉన్నట్లు అధికారులు ఆదివారం ప్రకటించారు. వీరిలో గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు 3,35,996 మంది, పీజీ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు 2,49,396 మంది, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు 2,92,396 మంది, అలాగే ఇంజినీరింగ్‌లో పీజీ చేసినవారు 2,58,662మంది ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో మొత్తం 67,55,466 మంది ఎంప్లాయిమెంట్ కార్యాలయాలలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకొని ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూస్తూ ఉన్నట్లు తెలిపారు. వీరిలో 31,47, 605 మంది పురుషులు, 36,07,589 మంది మహిళలు, 272 మంది మూడో వర్గానికి (హిజ్రాలు) చెందిన వారు ఉన్నట్లు వెల్లడించారు. వీరంతా ప్రస్తుతం పేర్లను రెన్యువల్ చేసుకుంటున్నారు.

పని చేసే సంస్థకు రూ.3 కోట్లు టోకరా

- దంపతుల అరెస్టు



నిందితులు సునీత దేవి, రామ్ లాల్ చౌదరి

తిరువొత్తియూరు: రూ.3 కోట్లు చేతివాటం ప్రదర్శించిన ట్రాన్స్‌పోర్టు సంస్థ మేనేజర్‌ను, అతని భార్యను సెంట్రల్ క్రైమ్ విభాగం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివరాలు.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన శుక్లాల్ చౌదరి రాజస్థాన్, చెన్నై మాధవరంలో ట్రైలర్ ట్రాన్స్‌పోర్టు సంస్థను నిర్వహిస్తున్నాడు. మాధవరం కార్యాలయంలో మేనేజర్‌గా అతని బంధువు రామలాల్ గత పదేళ్లుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్లాల్ చౌదరి కుమారుడు గత 2018లో ఓ ప్రమాదంలో చిక్కుకున్నాడు. దీంతో అతను 2021 నుంచి మాధవరం కార్యాలయంలో లెక్కలను పర్యవేక్షించ లేదు. ఈ క్రమంలో అతను ఇటీవల లెక్కలు సరిచూశాడు. ఆ సమయంలో రూ.3 కోట్లు నగదు లాల్‌చౌదరి, అతడి భార్య సునీత దేవి కొట్టేసినట్లు తేలింది. దీంతో శుక్లాల్ చౌదరి చెన్నై సెంట్రల్ క్రైమ్ విభాగం పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సెంట్రల్ క్రైమ్ విభాగం పోలీస్ ఇన్‌స్పెక్టర్ రేవతి కేసు దర్యాప్తు చేస్తున్నారు. శుక్లాల్ చౌదరి ఫిర్యాదు చేసినట్లు తెలుసుకున్న నిందితులు అదృశ్యమయ్యారు. ఎట్టకేలకూ వారిని ఆదివారం అరెస్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.





ఆల్ ది బెస్ట్



వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ సమాయత్తమైంది. హాల్ టికెట్ల జారీ.. పరీక్ష కేంద్రాల కేటాయింపు, ఇన్విజిలేటర్ల నియామకం వంటివి సకాలంలో పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 11, 12 తరగతులకు చెందిన దాదాపు 15 లక్షల పైచిలుకు విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు సిద్ధమయ్యారు. కరోనా ముప్పు పూర్తిస్థాయిలో తొలగిపోవడంతో ఈ ఏడాది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావివ్వకూడదని అధికారులకు ప్రభుత్వం స్పష్టం చేసింది.

- పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం
- నేటి నుంచి ప్లస్–2, రేపటి నుంచి ప్లస్–1 విద్యార్థులకు..
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్

సాక్షి, చెన్నై: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి ప్లస్–2, మంగళవారం నుంచి ప్లస్–1 విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి విద్యార్థులకే కాదు, ఇన్విజిలేటర్ల కూడా కఠిన నిబంధనలు విధించారు. ఫిర్యాదులు, అనుమానాల నివృతి కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కరోనా పరిస్థితుల నేపథ్యంలో 2021లో ఆల్ పాస్ ప్రకటన చేశారు. 2022లో నామమాత్రంగా పరీక్షలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఏడాది పకడ్బందీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ప్లస్–2 పరీక్షలను 8, 81,303 మంది రాయనున్నారు. తొలి రోజు ల్యాంగ్వేజ్ సబ్జెక్టుతో మొదలయ్యే పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీన జరిగే కెమిస్ట్రీ, అకౌంటెన్సీ, జాగ్రఫీతో ముగియనున్నాయి. ఈ పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా 3,225 సెంటర్లలో జరగనుంది. అలాగే ఈనెల 14వ తేదీ నుంచి ప్లస్–1 పరీక్ష ప్రారంభం కానుంది. 7,88,064 మంది ఈ పరీక్ష రాయనున్నారు. 3,224 సెంటర్లను ఇందుకోసం సిద్ధం చేశారు. ఉదయం 9.30 గంటలలోపు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్ష 10 గంటలకు మొదలు అవుతుంది. తొలి 15 నిమిషాలు ప్రశ్నపత్రం పరిశీలనకు కేటాయిస్తారు. 10.15 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు.

నిఘా నీడలో..

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి విద్యార్థులు పాటించాల్సిన నిబంధనల గురించి హాల్ టికెట్‌లోనే వివరించారు. పరీక్షకు బ్లూ, బ్లాక్ పెన్‌లను మాత్రమే ఉపయోగించాలి. కలర్ పెన్సిళ్లు, పెన్నులను ఉపయోగించినా, ఏదేని గుర్తులను ప్రత్యేకంగా జవాబు పత్రంలో సూచించినా విద్యార్థులకు ఇబ్బందులు తప్పవనే హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇక పరీక్షలకు 90,070 మంది ఇన్విజిలేటర్లను ఎంపిక చేశారు. 3,100 మందితో ఫ్లయింగ్ స్క్వాడ్, 2,269 మందితో సిట్టింగ్‌స్క్వాడ్‌లను నియమించారు. విద్యార్థులే కాదు, ఇన్విజిలేటర్లు సైతం సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష హాల్‌లోకి తీసుకెళ్లేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. ఈ సారి విద్యార్థులకు వారికి సంబంధించిన అన్ని వివరాలనూ ముద్రించిన జవాబు పత్రం ముందు భాగంలోని ప్రత్యేక పేజీని అందజేయనున్నారు. ఇందులో వారు సంతకం పెట్టినానంతరం, ప్రశ్న పత్రంలోని ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా 281 ప్రాంతాల్లో ప్రశ్న పత్రాలను భద్రపరిచారు. పరీక్షకు గంటన్నర ముందుగా ఆయా ప్రాంతాలలోని సెంటర్లకు ప్రశ్న పత్రాలను నిఘా నీడలో చేర్చేందుకు సర్వం సిద్ధం చేశారు. పరీక్ష కేంద్రాలకు విద్యుత్ సరఫరా నింతరంగా ఉండే విధంగా ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. ఇక విద్యార్థులు ఏదేని అనుమానాలు ఉన్నా, ఫిర్యాదులు చేయదలచినా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంట నుంచి రాత్రి 8 గంటల వరకు 94983 83081, 94983 83075 నంబర్లను విద్యార్థులు సంప్రదించ వచ్చునని విద్యా శాఖ ప్రకటించింది. పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు సీఎం స్టాలిన్‌తో పాటు పలు పార్టీల నాయకులు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు.

1.5 కిలోల బంగారం, రూ.2.5 కోట్ల అపహరణ

తిరువొత్తియూరు: కారైకుడిలో ఓ నగల దుకాణం యజమానిని తుపాకీతో బెదిరించి.. కారులో కిడ్నాప్ చేసి 1.5 కిలోల బంగారు నగలు, రూ.2.5 కోట్లు నగదు చోరీ చేసిన ముఠా కోసం ప్రత్యేక బృందం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. శివగంగై జిల్లా కారైకుడిలో ఉన్న ముత్తు పట్టణం ప్రాంతానికి చెందిన రవిచంద్రన్ (50) నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతను కారైకుడిలోని పలు నగల దుకాణాలకు నగలను సప్లయ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి చెన్నై నుంచి కారైకుడికి ప్రైవేటు బస్సులో బయలుదేరాడు. కారైకుడిలో ఉన్న నగల దుకాణానికి నగలను సప్లయ్ చేయడానికి 1.5 కిలోల బంగారం నగలు రూ.2.5 కోట్ల నగదును తీసుకెళ్లాడు. ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో కారేపూడి కలనీవాసల్ స్టేషన్‌లో బస్సు దిగాడు. ఆ సమయంలో మాస్కు ధరించి వచ్చి నలుగురు ముఠా తుపాకీని చూపెట్టి కారులో రవిచంద్రన్‌ను ఎక్కించుకొని కొద్దిదూరం వెళ్లి తర్వాత అతని వద్ద ఉన్న బంగారం నగలు, రూ. నగదును అపహరించుకుని చేతులు కాలు కట్టి కారు వెనుక సీటు పడవేశారు. పుదుకోట్టై జిల్లా లేనావిలక్కు ప్రాంతంలో రవిచంద్రన్ కారు నుంచి కిందికి దించి ఆ తర్వాత తప్పించుకుని పారిపోయారు. వారిపై కాయకుడి నార్త్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు రవిచంద్రన్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కారైకుడి డీఎస్పీ స్టాలిన్ నేతృత్వంలో ప్రత్యేక బృందం పోలీసులు దుండగుల కోసం వేట ముమ్మరం చేశారు.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం

పళ్లిపట్టు: పొదటూరుపేటలో ద్రౌపదిదేవి ఆలయ అగ్నిగుండ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అలాగే ఉదయం దుర్యోధన వధ ఘట్టం ఆసక్తికరంగా సాగింది. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం సందర్భంగా భక్తులు కంకణాలు ధరించారు. దాదాపు 3 వేల మంది పసుపు దుస్తులతో ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పళ్లిపట్టు పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి పోటెత్తారు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం 7గంటల సమయంలో గోవింద నామస్మరణతో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి తమ మొక్కులు చెల్లించారు. డీఎస్పీ విఘ్నేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ఘనంగా ఉగాది పురస్కారాల ప్రదానం



అవార్డు గ్రహీతలతో అల్లింగం రాజశేఖర్, పసుమర్తి బద్రినాథ్

కొరుక్కుపేట: తెలుగు వెలుగు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. చెన్నై పెరంబూరులోని డీఆర్ బీసీసీ మహోన్నత పాఠశాల ఆడిటోరియంలో ఏర్పాటయిన ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా వాసవి బిల్డర్స్ అధినేత, పసుమర్తి బద్రీనాథ్, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, పారిశ్రామికవేత్త ఉమా మహేశ్వర రెడ్డి, రచయిత బొందల నాగేశ్వర రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ప్రఖ్యాత బాల సాహితీ వేత్తలు ఉమ్మడి విజయ శేఖర్ రెడ్డి , చెన్నూరి సుదర్శన్, సంగనభట్ల చిన్న రామకృష్ణయ్య, బెహరా ఉమామహేశ్వర రావు, కృష్ణస్వామి రాజు తెలుగు వెలుగు ఉగాది పురస్కారాలను అందజేశారు. బాల సాహిత్య రత్న అవార్డులను డాక్టర్ దార్ల బుజ్జిబాబు (చిలకలూరిపేట), డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ (నెల్లూరు)కు అందించారు. ఈ కార్యక్రమం బాల సాహితీవేత్త బెల్లంకొండ నాగేశ్వర రావు సారథ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు పుస్తక పఠనాశక్తిని బాలలకు కలుగజేయాలని సూచించారు. తెలుగు వెలుగు సంక్షేమ సంఘం అధ్యక్షులు అల్లింగం రాజశేఖర్ మాట్లాడుతూ తెలుగు భాషకు తెలుగు సాహిత్యానికి తమ సంస్థ హితోధికంగా కృషి చేస్తోందన్నారు. శోభకృత్ నామ సంవత్సరం సర్వ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. పలు తెలుగు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సత్కరించారు. వేడుకలు సందర్భంగా కళాకారులు తిరుపతి ఆధ్వర్యంలో బ్రహ్మరుషి విశ్వామిత్ర నాటిక, విద్యార్థుల ఆటపాటలు అలరించాయి.

భూగర్భజలాల పెంపునకు స్పాంజ్ పార్క్‌లు

- చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో మరో కొత్త పథకం
- 57 చోట్ల నిర్మాణాలకు ఏర్పాట్లు



సాక్షి, చెన్నై: రాజధాని నగరం చెన్నైలో భూగర్భ జలమట్టం పెంచేందుకు మరో కొత్త ప్రయత్నానికి కార్పొరేషన్ సిద్ధమైంది. స్పాంజ్ పార్క్‌ల పేరిట నీటిని భూగర్భంలోకి ఇంకే విధంగా ప్రత్యేక నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. తొలి విడతగా 57 వీటిని ప్రారంభించనున్నారు. వివరాలు.. చెన్నైలో రోజుకు సగటున 1000 మిలియన్ లీటర్ల నీరు అవసరం. చెంబరంబాక్కం, పూండి, చోళవరం, తేర్వాయి కండ్రిగా, పుళల్ వంటి రిజర్వాయర్లలో నీటిని వర్షాకాలంలో నిల్వ ఉంచి ఆ తర్వాత శుద్ధీకరించి సరఫరా చేస్తున్నారు. అలాగే నిర్లవణీకరణ పథకం ద్వారా సముద్రపు నీటిని శుద్ధి చేసి అందిస్తున్నారు. కడలూరు జిల్లా వీరానం రిజర్వాయర్ నుంచి కూడా నీటిని సరఫరా చేస్తున్నారు. ఏటా ఈశాన్య రుతు పవనాల సీజన్‌లో చెన్నై, శివారు జిల్లాలలో ఆశాజనకంగానే వర్షాలు పడుతున్నాయి. అయితే ఈ నీరంతా వృథాగా సముద్రంలో కలవడంతో వేసవిలో నీటి కష్టాలు తప్పడం లేదు. గత ఏడాది వర్షాల సీజన్‌లో చెన్నై నీట మునగ కుండా ముందు జాగ్రత్తగా రూ. 4 వేల కోట్లతో వర్షపు నీటి కాలువల నిర్మాణాలపై దృష్టి పెట్టి గండం నుంచి బయట పడ్డారు. ఈ పనులు నేటికీ కొనసాగుతున్నాయి. అయితే, వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి. వర్షా కాలంలో భూగర్భ జలాలల నీటి మట్టం పెరగడం, వేసవి నాటికి అడుగంటడం పరిపాటిగా మారింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న చెన్నై కార్పొరేషన్ వర్గాలు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు కొత్త పథకంపై దృష్టి పెట్టారు.

కొలను తరహాలో..

వర్షాల సీజన్‌లో సముద్రంలో కలిసే నీటిని కొంత మేరకు సద్వినియోగం చేసుకుని, వాటి ద్వారా భూగర్భ నీటిమట్టాన్ని పెంచేందుకు సిద్ధమయ్యారు. ఇందు కోసం 126 ప్రాంతాలను ఎంపిక చేశారు. వీటిలో తొలి విడతగా 57 చోట్ల స్పాంజ్ పార్క్‌లను ఏర్పాటు చేయనున్నారు. కార్పొరేషన్‌కు సంబంధించిన ఆలందూరు మండలంలో 10 చోట్ల, మనలిలో 8 చోట్ల, తండయార్ పేట, రాయపురంలలో తలా ఆరు చోట్ల, తిరువీకానగర్‌లో ఐదు చోట్ల, అన్నానగర్‌ల నాలుగు చోట్ల, కోడంబాక్కం,అంబత్తూరు మండలాలలో తలా మూడు చోట్ల, వలసరవాక్కంలో, అడయార్, పెరుంగుడిలో తలా రెండు చోట్ల, షోలింగనల్లూరులో ఓ చోట ఈ స్పాంజ్ పార్క్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ స్పాంజ్ పార్కులు ప్రహరీతో కూడిన నిర్మాణాలతో ఉంటాయి. చుట్టూ వివిధ రకాల మొక్కలను పెంచుతారు. మధ్యభాగంలో ఆరు రకాలుగా స్టెప్స్‌తో భూమిలోకి నీరు ఇంకే విధంగా అతి పెద్ద కొలను తరహాలో ఏర్పాటు చేయబోతున్నారు. ఇందులోకి వచ్చే నీరు భూమిలోకి ఇంకి పోయే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. తద్వారా ఆయా మండలాలలోని బోరు బావులు, బావులలో నీటి మట్టం పెరడమే కాకుండా భూగర్భ జలాల శాతాన్ని పెంచే విధంగా కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ విషయంపై కార్పొరేషన్ ప్రధాన ఇంజినీరింగ్ అధికారి రాజేంద్రన్ పేర్కొంటూ నగరంలోని నీటి ఎద్దడి ఎదురు కాని రీతిలో, వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునే విధంగా స్పాంజ్ పార్క్‌లను విస్తృతం చేయనున్నామన్నారు. ఈ పార్క్‌లకు వర్షపు నీటి కాలువలను అనుసంధానిస్తామని వివరించారు. ఈ కాలువల ద్వారానే సముద్రంలోకి నీరు వృథాగా చేరుతోందని, ఈ నీటిని మళ్లించి స్పాంజ్ తరహా నిర్మాణంతో కూడిన కొలనులోకి పంపిస్తామన్నారు. సిమెంట్ తరహా నిర్మాణాలు ఏవీ ఈ పార్క్‌లో ఉండదని, నీరు భూమిలోకి త్వరగా ఇంకి పోయే విధంగా నిర్మాణాలు, ఏర్పాట్లు ఉంటాయని వివరించారు. ఈ ప్రయత్నం ద్వారా పనులను రానున్న వర్షాల సీజన్‌లోపు ముగించేందుకు నిర్ణయించామని, విజయవంతమైన పక్షంలో చెన్నైను స్పాంజ్ నగరంగా మార్చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఇంతింతై..

అకుంఠిత దీక్ష.. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో తమిళనాడు మహిళా పోలీసు విభాగం.. దిన దిన ప్రవర్థమానం చెందుతోంది. అన్నింటా ఆమె.. అన్న చందంగా ప్రతి అంశంలోనూ సత్తా చాటుతోంది. తాజాగా 50 వసంతంలోకి అడుగుపెట్టిన రాష్ట్ర మహిళా పోలీసు ఫోర్స్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

- రాష్ట్ర మహిళా పోలీసు విభాగం ఏర్పాటై 50 ఏళ్లు
- 16న గోల్డెన్ జుబ్లీ వేడుకలు
- మహిళా పోలీసు అధికారులకు ఘన సత్కారం
- ఆదేశాలు జారీ చేసిన సీఎం స్టాలిన్



సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని మహిళా పోలీసు భద్రత విధుల్లో అడుగు పెట్టి 50 వసంతాలు పూర్తి కావొస్తోంది. ఈ నేపథ్యంలో గోల్డెన్ జుబ్లీ వేడుకగా నిర్వహించాలని సీఎం స్టాలిన్ నిర్ణయించారు. ఇందులో పోలీసు అధికారిణిలకు సత్కారం, అవార్డులను ప్రదానం చేయనున్నారు. వివరాలు.. తమిళనాడు పోలీసు విభాగానికి దేశస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉన్న విషయం తెలిసిందే. ఇందులో మహిళా సిబ్బంది పాత్ర ప్రత్యేకం. 1973లో అప్పటి సీఎం కరుణానిధి హయాంలో మహిళా పోలీసులకు తొలిసారి అవకాశం కల్పించారు.

22 మందితో మొదలై..

ప్రారంభంలో ఓ సబ్ ఇన్‌స్పెక్టర్, ఓ హెడ్ కానిస్టేబుల్, 20 పోలీసులతో తొలి మహిళా విభాగం విధులను ప్రారంభించింది. తొలి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉషా రాణి బాధ్యతలు చేపట్టారు. మహిళ పాత్రను మరింత ప్రోత్సహించే విధంగా 1976లో తమిళనాడు పోలీసు శాఖలో ఇద్దరు ఐపీఎస్ అధికారులు రంగంలోకి దిగారు. ఇందులో ఒకరు తమిళనాడుకు చెందిన తిలకతి, మరొకరు కేరళకు చెందిన లతికా చరణ్. ఈ ఇద్దరు వివిధ హోదాల్లో డీజీపీ స్థాయి వరకు పనిచేసి పదవీ విరమణ పొందారు. లతికా చరణ్ రాష్ట్ర శాంతి భద్రతల విభాగానికి తొలి మహిళా డీజీపీగా పనిచేశారు. ప్రస్తుతం పోలీసు శాఖలో ఓ డీజీపీ, ఇద్దరు అదనపు డీజీపీ, 14 మంది ఐజీ స్థాయి అధికారిణిలతో పాటు 23,542 మహిళలు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. 1992లో అప్పటి సీఎం జయలలిత ప్రత్యేకంగా మహిళా పోలీసు స్టేషన్లకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో ఈ పోలీసు స్టేషన్లు 202 ఉన్నాయి.

ప్రత్యేక బలగాలలోనూ..

మహిళలు అన్నింటా రాణించాలనే కాంక్షతో 2004లో అప్పటి సీఎం జయలలిత మహిళలతో ప్రత్యేక టాస్క్ ఫోర్సు, కమాండో బలగాన్ని సైతం ఏర్పాటు చేశారు. తన భద్రతా టీంలోనూ మహిళలకు ప్రాధాన్యతను కల్పించారు. ఒక్క శాంతి భద్రతల విభాగంలోనే కాదు, సీబీసీఐడీ, సైబర్ క్రైం , ఏసీబీ అంటూ ప్రతి విభాగంలోనూ మహిళల పాత్ర ప్రస్తుతం పెరిగింది. ఉత్తమ సేవలు అందిస్తూ, జాతీయ స్థాయిలో పతకాలను దక్కించుకున్న మహిళా అధికారులు ఎందరో ఉన్నారు. ఈ పరిస్థితులో పోలీసు శాఖలో మహిళ పోలీసుల ప్రవేశించి 50 వసంతాలు కావడాన్ని గోల్డెన్ జుబ్లీగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈనెల 16వ తేదీన నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికగా భారీ వేడుకకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో ఉత్తమ సేవలను అందించిన వారికి, మాజీ అధికారులకు సత్కారాలు, అవార్డులను ప్రదానం చేసే విధంగా కార్యాచరణకు సీఎం స్టాలిన్ ఆదేశాలు ఇవ్వడం విశేషం. ఈ గోల్డెన్ జుబ్లీ గురించి మాజీ ఐపీఎస్ అధికారి లతికా చరణ్ స్పందిస్తూ, గోల్డెన్ జుబ్లీలోకి అడుగు పెడుతుండడం ఆనందంగా ఉందన్నారు. మహిళ పోలీసులను యూనిఫాంలో చూసినప్పుడల్లా ఒక గాంభీర్యం కనిపిస్తుందన్నారు. ప్రస్తుతం గస్తీలోనూ దూసుకెళ్తున్నారని, రౌడీల వేటలో సాహసాలను ప్రదర్శిస్తున్నారని, మహిళలకు న్యాయం చేకూర్చే విధంగా ఎందరో అధికారిణిలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, చెన్నై పోలీసు విభాగంలో సుకన్య, జయ సుధా, సుభాషిణి అనే ముగ్గురు సోదరీమణులు వివిధ హోదాలలో సేవలు అందిస్తుండటం విశేషం.

17న మహాకుంభాభిషేకం

– ఏర్పాట్లు పూర్తి చేసిన టీటీడీ అధికారులు

కొరుక్కుపేట: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలో చెన్నై టి.నగర్ జీఎన్ శెట్టి రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ పద్మావతి అమ్మవారి దేవస్థానం మహా కుంభాభిషేక మహోత్సవం ఈనెల 17న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం ఉదయం జరిగిన విలేకర్ల సమావేశంలో టీటీడీ స్థానిక సలహా మండలి –చెన్నై చైర్మన్ ఏజే శేఖర్ కుంభాభిషేక విశేషాలను వివరించారు. టీటీడీ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నూతన శ్రీ పద్మావతి అమ్మవారి దేవస్థానం మహాకుంభాషేక మహోత్సవం ఈనెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి 7.44 గంటలకు ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ శ్రీ శారద పీఠం శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, శ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి అధ్యక్షతన జరగునున్న ఈ వేడుకలకు శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి విచ్చేసి మంగళాశాసనాలతో కుంభాభిషకం చేయనున్నారు. అలాగే టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి పాల్గొంటారని తెలిపారు. మహా కుంభాభిషేకానికి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చి శ్రీ పద్మా వతి అమ్మవారి కృపకుపాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం –చెన్నై డీఈఓ విజయకుమార్, టీటీడీ –చెన్నై స్థానిక సలహామండలి సభ్యులు మోహనరావు, కె. అనిల్ కుమార్‌రెడ్డి, ఊరా ఆంజనేయులు, గాయత్రి దేవి, కార్తికేయన్, రాధాకృష్ణ మూర్తి, యువరాజ్, ఇతర సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అంకురార్పణతో..

శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం కుంభాభిషేకాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం టీటీడీ ఆలయ వేదపండితులు నేతృత్వంలో అంకురార్పణ చేశారు. ఆలయ ప్రదక్షిణ, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈనెల 17వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టనున్నట్లు ఏజే శేఖర్ వెల్లడించారు. అనంతరం కుంభాభిషేక మహోత్సవం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.



కుంభాభిషేక మహోత్సవం ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఏజే శేఖర్ తదితరులు

క్లుప్తంగా

భగవద్గీతను చిన్నారులకు తప్పక నేర్పించాలి



గీతా మృతం ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హండే

కొరుక్కుపేట: పిల్లలకు భగవద్గీతనును తప్పని సరిగా నేర్పించాలని రాష్ట్ర మాజీ మంత్రి హండే అన్నారు. ఈ మేరకు సంస్కృతభారతి–తమిళనాడు ఆధ్వర్యంలో గీతామృతం– 2022 పేరిట గత ఏడాది డిసెంబర్‌లో మెగా గీత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈమేరకు సంస్థ ప్రత్యేక సమావేశాన్ని ఆదివారం చెన్నైలోని అన్నానగర్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గీతామృతం సంచికను ఆయన విడుదల చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ సంస్కృత భారతి తరపున బేసిక్స్ నుంచి సంస్కృతం నేర్చుకోవడానికి ప్రత్యేక కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు.

నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు



దుకాణంలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ భాస్కర పాండియన్

వేలూరు: తిరుపత్తూరులో నిషేధించిన ప్లాస్టిక్ వస్తువులు, బ్యాగులు విక్రయం చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ భాస్కర పాండియన్ స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం తిరుపత్తూరులోని బజారు వీధుల్లోని దుకాణాల్లో కలెక్టర్ తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో గోడౌన్‌తో పాటు దుకాణాల్లో నిషేధింన ప్లాస్టిక్ వస్తువులు ఉండడంతో గోడౌన్లు, దుకాణాలకు సీల్ వేశారు. కాగా మొత్తం ఏడు టన్నుల ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ జయరామరాజ, తహసీల్దార్ శివప్రకాశం, మున్సిపల్ అధికారులున్నారు.

ఆత్మ విశ్వాసమే చేతులుగా!





రెండు చేతులు లేకున్నా చిరు వ్యాపారం చేస్తున్న పరమేశ్వరి , రూ. 50 వేలు ఆర్థిక సాయం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్ (ఫైల్)

- స్వయం కృషితో జీవిస్తున్న దివ్యాంగురాలు

తిరుత్తణి: రెండు చేతులు లేకున్నా ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ఇతరులపై ఆధారపడకుండా జీవిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది పరమేశ్వరి. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా జీసీఎస్.కండ్రిగ పంచాయతీ సీజీఎస్ కండ్రిగ గ్రామానికి చెందిన పరమేశ్వరికి పుట్టుకతోనే రెండు చేతులు లేవు. నలుగురు పిల్లల్లో పెద్ద బిడ్డగా జన్మించిన పరమేశ్వరిని ఇతర పిల్లలు లాగానే తల్లిదండ్రులు బడికి పంపారు. అయితే చేతులు లేకపోవడంతో చదువు ప్రాథమిక దశలోనే దూరమైంది. దీంతో ఇంటికే పరిమితం కావడంతో ఇతరుల సాయం లేకుండా తన పనులు తానే చేసుకునే విధంగా ప్రయత్నాలు మొదలుపెట్టి క్రమంగా బట్టలు ఉతకడం, ఇళ్లు శుభ్రం చేసుకోవడం, వంట పనులను కాళ్ల సాయంతోనే నేర్చుకుంది. ఇప్పుడామెకు ఈ పనులన్నీ సాధారణ మనుషుల్లాగే అలవాటయ్యాయి. అయితే కొంత వయస్సు వచ్చేసరికి ఇతరుల కష్టం మీద బతకకూడదనే నిర్ణయానికి వచ్చింది. కొన్నేళ్ల కిందట కేజీ కండ్రిగలో బ్యాంకు నుంచి రూ.1.50 లక్షలు రుణం పొంది చిన్న అంగడి పెట్టుకుంది. అయితే కరోనాతో పరిస్థితి తారుమారైంది. వ్యాపారం లేక బ్యాంకు రుణం కట్టుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంది. ఆ సమయంలో తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ రూ. 50 వేలు అందించి పరమేశ్వరి మళ్లీ సాధారణ జీవితం గడిపేందుకు సాయపడ్డారు. అలాగే ప్రభుత్వం ద్వారా ఉచిత ఇంటి పట్టా అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మళ్లీ వ్యాపారం ప్రారంభించి ఆత్మ విశ్వాసంతో పరమేశ్వరి జీవనం సాగిస్తోంది.

సంపూర్ణ ఆరోగ్యానికి ఆయుర్వేదం



వేడుకల్లో మాట్లాడుతున్న వైద్యురాలు

కొరుక్కుపేట: ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని చెన్నై ఆవడిలోని ఈ ఎస్ఐ డిస్పెన్సరీ చీఫ్ డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆవడి ఈఎస్ఐ డిస్పెన్సరీని స్థాపించి 22 సంవత్సరాలు అయిన సందర్భంగా వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో చీఫ్ డాక్టర్ ప్రభాకర్ సారథ్యం వహించారు. సిద్ధ వైద్యురాలు డాక్టర్ అరుణ్ ప్రియదర్శిని, హోమియోపతి వైద్యురాలు డాక్టర్ దేవికారాణి, ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ నళిని పాల్గొని ఆయా చికిత్సలకు సంబంధించిన మందులను ప్రదర్శించి అవగాహన పెంచారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ ఆయుష్ మంత్రిత్వశాఖ ఆయుర్వేద, సిద్ధ హోమియోపతి వైద్యాన్ని ఎంతో ప్రోత్సహిస్తుందని ముందుగా ఆ శాఖ కు కతజ్ఞతలు తెలిపారు. ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన ఆయుర్వేద వైద్యానికి మళ్లీ అలవాటు పడాలని, దీనిద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు.



ఆయుర్వేద మందులు, ఆహార వస్తువుల ప్రదర్శన

బ్రెయిన్‌డెడ్ అయిన మహిళ అవయవాలు దానం



సత్య(ఫైల్)

వేలూరు: తిరువణ్ణామలై జిల్లా కన్నమంగళం సమీపంలోని పుదుపేట గ్రామానికి చెందిన సెంథిల్‌కుమార్ ఆర్మీలో జవానుగా పనిచేస్తున్నారు. ఇతనికి భార్య సత్య(38), కుమార్తెలు లతిక, గోపిక ఉన్నారు. వీరిద్దరూ తిరువణ్ణామలైలో చదువుతుండడంతో అక్కడే అద్దె ఇంటిలో సత్య నివసిస్తోంది. కొద్ది రోజులుగా అనారోగ్యంగా బాధపడుతున్న సత్యను చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ నేపథ్యంలో సత్యకు శుక్రవారం సాయంత్రం బ్రెయిన్‌డెడ్ అయినట్లు ఆసుపత్రిలోని డాక్టర్‌లు నిర్ధారించారు. తర్వాత వైద్యుల సలహాల మేరకు ఆమె అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. దీంతో వెంటనే వైద్యులు ఆమె అవయవాలను చెన్నై, వేలూరు సీఎంసీ ఆసుపత్రికి అందజేశారు. కాగా శనివారం రాత్రి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

కాట్పాడిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..



రేషన్ దుకాణం ప్రారంభించి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న మంత్రి దురై మురుగన్

వేలూరు: రాష్ట్రంలోనే కాట్పాడిని ఆదర్శ నియోజక వర్గంగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నానని మంత్రి దురై మురుగన్ అన్నారు. వేలూరు జిల్లా కాట్పాడి నియోజక వర్గంలోని బ్రహ్మపురం, కార్నంబట్టు పంచాయతీల్లో అంగన్‌వాడీ కేంద్రం, సేవూరులో రేషన్ దుకాణాలను వేర్వేరుగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాట్పాడి ప్రజలు తనను 13 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని వారికి అవసరమైన అన్ని సంక్షేమ పథకాలు నేటికీ అందజేస్తున్నానని తెలిపారు.

కాట్పాడిలో కోర్టు, అగ్నిమాపక కేంద్రం, పోలీస్ స్టేషన్, కావేరి తాగునీటి పథకం తదితర వాటిని తీసుకొచ్చానన్నారు. అదే విధంగా ప్రస్తుతం సేర్‌కాడు క్రాస్ రోడ్డులో 100 పడకలతో కూడిన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయని అదే విధంగా షిప్‌కాడును ప్రారంభించి నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వంలో ప్రవేశ పెడుతున్న ప్రతి పథకాన్ని కాట్పాడికి తీసుకు రావడంతో పాటు ప్రత్యేక నిధులను తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నానన్నారు. తమ ప్రభుత్వం ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకొని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పటికే నెరవేర్చడం జరిగిందన్నారు. ప్రజలకు అవసరమైన మరన్నీ పథకాలను ప్రవేశ పెట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులకు పలు సంక్షేమ పథకాలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామమూర్తి, యూనియన్ చైర్మన్ వేల్ మురుగన్, యూనియన్ కార్యదర్శి శరవణన్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు కేంద్రం ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న బాలమురుగన్

వేలూరు: దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి వారి అభివృద్ధికి చర్యలు చేపడుతోందని భారతీయ జనతా పార్టీ చేనేత కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బాల మురుగన్ అన్నారు. వేలూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆ పార్టీ చేనేత కార్మిక విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరుతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని చేనేత కార్మికులకు ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తూ చేనేత కార్మికులు మృతి చెందితే బాధిత కుటుంబానికి, అలాగే గాయపడిన కార్మికులకు రూ. లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేలూరులో పుట్టి పెరిగిన కిరుబానంద వారియార్‌కు భారత రత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. కోవై, తిరునెల్వేలి, పుదుచ్చేరి వంటి ప్రాంతాల్లో అధికంగా చేనేత కార్మికులు ఉంటున్నారని ప్రస్తుతం వారంతా ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వారిని గుర్తించి ఇంటి పట్టాలు అందజేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ముద్ర పథకం ద్వారా నేత కార్మికుల కుటుంబాల్లోని మహిళలకు రూ.508 కోట్ల రుణాలను కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్తియాయిని, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమాపతి, వీపీ దురైస్వామి, పన్నీర్‌సెల్వం, జిల్లా అధ్యక్షులు మనోహరన్, డివిజన్ జిల్లా అధ్యక్యురాలు సుకన్య, ఎస్ఎల్ బాబు, జగన్నాథన్ కార్మికులు పాల్గొన్నారు.

కోలీవుడ్ టాక్స్

రెహమాన్ @28



భార్య సైరా భానుతో ఏఆర్ రెహమాన్

తమిళ సినిమా: ఏఆర్ రెహమాన్. ఈ పేరే ఒక బ్రాండ్. సుమారు 30 ఏళ్ల క్రితం సంగీత దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. దేశంలోనే అగ్ర సంగీత దర్శకుడిగా ఎదిగారు. తమిళం, తెలుగు, హిందీ, ఆంగ్లం సహా అనేక భాషల్లో ఆయన బాణీలు అందించారు. ఒకేసారి రెండు ఆస్కార్ అవార్డులను సాధించి న ఘనత ఈయనది. ఇప్పటికీ ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారంటే ఆ చిత్రం కచ్చితంగా మ్యూజికల్ హిట్ అనే నమ్మకం ప్రేక్షకుల్లో ఉంటుంది. ఇటీవల ఈయన సంగీతాన్ని అందించిన పొన్నియిన్ సెల్వన్, వెందు తనిందది కా డు చిత్రాలు సంచలన విజయాన్ని అందుకున్నాయి. ప్రస్తుతం పత్తుతల, పొన్నియిన్ సెల్వన్ 2, మామన్నన్, లాల్ సలాం, ఆడుజీవితం వంటి పలు చిత్రాలు ఈయన చేతిలో ఉన్నాయి. వీటిలో శింబు కథానాయకుడిగా నటించిన పత్తుతల చిత్రం ఈ నెల 30వ తేదీ తెరపైకి రానుంది. అదే విధంగా ఏప్రిల్ 28వ తేదీ పొన్నియిన్ సెల్వన్ విడుదలకు సిద్ధమవుతోంది. ఆ తరువాత మామన్నన్ చిత్రం రెడీ అవుతోంది. ఇలా ఈ ఏడాది నెలకో చిత్రంతో ఏఆర్ రెహమాన్ తన అభిమానులను అలరించనున్నారు. కాకపోతే ఏఆర్ రెహమాన్ సతీమణి గురించి చాలా తక్కువ మందికి తెలిసుంటుంది. ఈయన 1995 మార్చి 12వ తేదీ సైరా భానును వివాహం చేసుకున్నారు. వీరి దాంపత్య జీవితం 28 వసంతాలను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఏఆర్ రెహమాన్ తన సతీమణితో కలిసి ఉన్న ఫొటోను ఇన్‌స్టాగామ్ పోస్ట్ చేశారు. దీంతో పలువురు వీరికి పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఈ దంపతులకు ఖతీజా రెహమాన్, రహీమ రెహమాన్ అనే ఇద్దరు కుమార్తెలు, ఒమీన్ అనే కొడుకు ఉన్నారు.

అవార్డుల ప్రదానం



అతిథితులు, నిర్వాహకులతో అవార్డు గ్రహీతలు

తమిళ సినిమా: మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు సినీనటులకు అవార్డులను శనివారం సాయంత్రం చెన్నైలో ప్రదానం చేశారు. మహా ఫైన్ ఆర్ట్స్ అధినేత అనురాధ జయరామన్, యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా అధినేత కలైమామణి నెల్‌లై సుందర్ రాజన్ సంయుక్తంగా నిర్మించిన ఈ కార్యక్రమానికి స్థానిక వడపళని, కుమరన్ కాలనీలోని శిఖరం ప్రాంగణం వేదికగా మారింది. ఈ వేడుకకు చెన్నై హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్.కె కృష్ణన్ అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నటి శ్రావ్య రెడ్డి, వీణా వెంకటేష్, రేఖ సురేష్, ప్రేమీ వెంకట్ తదితర వెండి తెర, బుల్లితెర నటీనటులను ఘనంగా సత్కరించి అవార్డులను అందజేశారు. వారికి అవార్డులను ప్రదానం చేసిన మాజీ న్యాయమూర్తి ఎస్.కె కృష్ణన్ మాట్లాడుతూ మహిళా సాధికారకత నానాటికీ పెరుగుతోందన్నారు. సినీ నటీమణులు తమ తమ శాఖల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకుంటూ ఈ వేదికపై అవార్డులను అందుకున్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఈ కార్యక్రమం ఆటపాటలతో ఆహుతులను అలరించింది. ఈ వేడుకలో గ్లోబల్ యూనివర్సిటీ చాన్స్‌లర్ మధు కృష్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

జీవీ ప్రకాష్ సంగీత విభావరి



టీజర్ ఆవిష్కరిస్తున్న జీవీ ప్రకాష్

తమిళ సినిమా: యువ సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాష్ కుమార్ మే 27వ తేదీ కోయంబత్తూర్‌లో భారీ సంగీత విభావరి నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈయన నిర్వహిస్తున్న తొలి సంగీత విభావరి ఇదే కావడం గమనార్హం. జీవీ ప్రకాష్ కుమార్ 2006లో వెయిల్ చిత్రం ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయం అయ్యారు. ఈయన 15 ఏళ్ల సంగీత ప్రయాణంలో ఎన్నో సూపర్‌హిట్ చిత్రాలకు సంగీతాన్ని అందించారు. అదే విధంగా నటుడిగా పరిచయమై పలు విజయవంమైన చిత్రాలు చేశారు. దైవ తిరుమగళ్, మద్రాసు పట్టణం, రాజారాణి వంటి చిత్రాల నుంచి తెరి, సూరరై పోట్రు, సర్దార్, ఇటీవల విడుదల అయిన వాత్తీ వరకు పలు సక్సెస్‌ఫుల్ చిత్రాలకు సంగీత దర్శకుడిగా పని చేశారు. ఈయన సంగీతానికి ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. కాగా ప్రస్తుతం సంగీత దర్శకుడిగా, నటుడిగా పలు చిత్రాలతో బిజీగా ఉన్నారు. అలాంటిది తొలిసారిగా సంగీత విభావరిని నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు. కోయంబత్తూర్ శ్రీకృష్ణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఎం.కె ఎంటర్‌టైన్మెంట్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్వహిస్తున్న ఈ సంగీత విభావరిని కోయంబత్తూర్‌లోని కొడిసియా మైదానంలో భారీ ఎత్తున జరగనుంది. ఈ సంగీత విభావరికి సంబంధించిన టీజర్, వాల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు.



అదే ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది

తమిళ సినిమా: సమస్యలకు భయపడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే అనుకున్నది సాధించవచ్చు. నటి సమంత ఇప్పుడు ఇదే చేస్తున్నారు. నటిగా జాతీయ స్థాయిలో ప్రేక్షకులను అలరిస్తున్నారు. సుమారు 13 ఏళ్ల క్రితం కోలీవుడ్‌లో తెరంగేట్రం చేసి ఆ తర్వాత టాలీవుడ్, బాలీవుడ్‌లో రాణిస్తున్నారు. సినిమాలతోనే కాకుండా సామాజిక మాధ్యమాల్లోనూ తనకు సంబంధించిన విషయాలను, ఫొటోలను పోస్ట్ చేస్తూ అభిమానులను అలరిస్తున్నారు. ఇటీవల అనుహ్యంగా మయోసైటిస్ అనే అరుదైన వ్యాధికి గురై అందర్నీ షాక్‌కు గురిచేశారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తనే చెప్పి కంటతడి పెట్టారు. దీంతో సమంత త్వరగా కోలుకోవాలని చాలామంది కోరుకున్నారు. ఇక ఆమె అభిమానులైతే పూజలు చేశారు. అలాంటి వాటి మహిమో, వైద్య ఫలమో, ఆమె మనోధైర్యమో ఇప్పుడు ఆ వ్యాధిని జయించి మళ్లీ యథావిధిగా తన నట పయనాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం తన కారణంగా ఆగిపోయిన ఖుషి చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ కథానాయకుడు. అంతేకాకుండా మరో నాలుగు హిందీ చిత్రాలను కొత్తగా కమిట్ అయినట్లు సమాచారం. వాటితోపాటు ఒక హిందీ వెబ్ సిరీస్‌లోనూ నటిస్తూ బిజీ అయ్యారు. ఇక సోషల్ మీడియాలోనూ యాక్టివ్ అయ్యారు. తన ఫిట్‌నెస్ కసరత్తుల దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో తరచూ పోస్ట్ చేస్తున్నారు. తాజాగా ఆమె భగవంతుని ముందు కూర్చుని ధ్యానం చేస్తున్న ఫొటోలు తన ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశారు. అందులో ×నమ్మకం మనల్ని ఎంతటి ఉన్నత శిఖరాలకైనా తీసుకెళ్లి కూర్చోబెడుతుంది÷ అని పేర్కొన్నారు. కాగా ఇటీవల ఈమె నటించిన లేడీ కథా చిత్రం యశోద మంచి విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. కాగా తాజాగా పురాణ ఇతిహాసం నేపథ్యంలో రూపొందిన శాకుంతల చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది.



సమంత ధ్యానం

ఏకైక సూపర్‌స్టార్ రజినీకాంతే

తమిళ సినిమా: ఏకైక సూపర్ స్టార్ రజినీకాంతే అని కన్నడ హీరో ఉపేంద్ర పేర్కొన్నారు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న నటుడు ఉపేంద్ర. స్వతహాగా కన్నడిగుడు అయిన ఈయన అక్కడ రియల్ సూపర్ స్టార్‌గా వెలుగొందుతున్నారు. తాజాగా ఈయన కథానాయకుడిగా నటించిన కన్నడ చిత్రం కబ్జా. శ్రీ సిద్ధేశ్వర ఎంటర్‌ప్రైజస్, ఇన్వేనియో ఒరిజిన్ సంస్థల సమర్పణలో ఆర్ చంద్రు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన భారీ చిత్రం ఇది. నటి శ్రీయ కథానాయికగా నటించిన ఇందులో నటి సుధ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. నటుడు కిచ్చా సుదీప్, శివరాజ్ కుమార్ అతిథి పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి అలంకార్ పాండియన్ సహ నిర్మాతగా వ్యవహరించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న చిత్రం ఈ నెల 17వ తేదీ కన్నడ, తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్రయూనిట్ శనివారం సాయంత్రం చెన్నైలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. నటి శ్రీయ మాట్లాడుతూ.. తనకు చెన్నై ఎప్పుడూ స్పెషలేనన్నారు. ఈ చిత్రానికి తనను ఎంపిక చేసిన దర్శకుడు చంద్రుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపేంద్ర వంటి అద్భుతమైన నటుడితో కలిసి తెరపై భాగం పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. చిత్ర దర్శక నిర్మాత చంద్రు మాట్లాడుతూ.. ఈ చిత్రాన్ని తమిళనాడులో విడుదల చేస్తున్న లైకా ప్రొడక్షన్స్, తమిళ్ కుమరన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చిత్ర కథానాయకుడు ఉపేంద్ర మాట్లాడుతూ.. చిత్ర ట్రైలర్ చూడగానే ఇది సాంకేతిక నిపుణుల చిత్రమని మీకు తెలుస్తుందన్నారు. దర్శకుడు చంద్రు నాలుగేళ్ల కల అని పేర్కొన్నారు. ఇందులో నటుడు కిచ్చా సుదీప్, శివరాజ్ కుమార్ అతిథి పాత్రల్లో నటించారని తెలిపారు. కాగా నటి శ్రీయ మాట్లాడినప్పుడు ఉపేంద్రను ఇండియన్ రియల్ సూపర్ స్టార్ అని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఉపేంద్ర తాను కన్నడలో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించానని.. అదేవిధంగా రియల్ రౌడీలతో చిత్రం చేయడంతో అందరూ ఇండియన్ రియల్ సూపర్‌స్టార్ అంటుంటారని, నిజానికి రజినీకాంత్ ఒక్కరే సూపర్‌స్టార్ అని పేర్కొన్నారు. కాగా తనకు తమిళంలో చిత్రం చేయాలనే కోరిక ఉందని.. త్వరలోనే అది నెరవేరుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



కబ్జా చిత్ర యూనిట్

క్లుప్తంగా

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

తిరువొత్తియూరు: నీటి తొట్టెలో మునిగి నాలుగేళ్ల చిన్నారి మృతిచెందింది. వివరాలు.. కృష్ణగిరి జిల్లా రాయకోట వేలంగాడు ప్రాంతానికి చెందిన గోవిందరాజు కూలి. భార్య కోకిల, వీరికి కుమార్తె మధుమిత (4) ఉంది. కోకిలకు మూడు నెలల క్రితం మగ బిడ్డ పుట్టింది. ఈ క్రమంలో కోకిల తన కుమార్తె మధుమితతో కలిసి సేలం ఉమ్మిలికా పట్టిలోని పుట్టింట్లో ఉంటోంది. శనివారం ఉదయం మధుమితను స్నానం చేయడానికి అవ్వ అంబికా పిలిచి, చిన్నారి దుస్తులు తీసుకురావడానికి లోపలికి వెళ్లింది. వచ్చి చూడగా చిన్నారి కనిపించలేదు. చిన్నారి కోసం గాలించగా సమీపంలోని నీటి తొట్టిలో చిన్నారి పడి ఉంది. హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఏనుగు దాడిలో రైతు..

తిరువొత్తియూరు: ఏనుగు దాడిలో రైతు మృతి చెందిన ఘటన దిండుక్కల్ జిల్లాలో చోటుచేసుకుంది. వట్టాన్ సత్రం పరిధిలోని పశ్చిమ కనుమల్లోని సరిహద్దు గ్రామాల్లో తరచూ ఏనుగులు పంటపొలాలను ధ్వంసం చేస్తున్నాయి. శనివారం రాత్రి సత్తిరపట్టికి చెందిన సౌందర్యరాజన్ (50) తోటలోని ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఈ క్రమంలో పొలంలోకి ఏనుగు చొరబడి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఏనుగును కొట్టి తరిమేందుకు సౌందర్యరాజన్ యత్నించాడు. ఆగ్రహించిన ఏనుగు తొండంతో కిందపడేసి కాలితో తొక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవం

తిరువొత్తియూరు: హత్య కేసులో ముగ్గురు యువకులకు కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. వివరాలు.. చెన్నై కొత్త చాకలిపేటకు చెందిన దీప కుమారుడు అప్పు అలియాస్ ఆకాష్ (24) 2014లో మద్యం తాగి బాటిల్‌ను గోడకు కొట్టాడు. గాజు ముక్కలు అక్కడ నిలబడి ఉన్న సుకుమార్ (24)పై పడింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అదే రోజు రాత్రి సుకుమార్ తన స్నేహితులు కుప్పన్, పళనివేలు, రాజాతో కలిసి అప్పు ఇంటికి వెళ్లాడు. అతని తల్లి కళ్ల ముందే అప్పుపై కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడినఅప్పు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి సుకుమార్, కుప్పన్, పళనివేల్, రాజాలను అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ చెన్నై 4వ అదనపు సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. కేసు విచారణ జరుగుతున్న సమయంలోనే సుకుమార్ మృతి చెందాడు. ఈ క్రమంలో నిందితులు ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్ష, చెరో రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి డీవీ ఆనంద్ తీర్పునిచ్చారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. దంపతులు దుర్మరణం

కొరుక్కుపేట: లారీ ఢీకొనడంతో దంపతులు మృతి చెందారు. వివరాలు.. తిరుచ్చి జిల్లా, లాల్గుడి సమీపంలోని సాత్తమంగళం గ్రామానికి చెందిన జగన్నాథన్ కుమార్తె రాగిణి (32). పెరంబలూరు జిల్లా, సిరువాయలూరు గ్రామానికి చెందిన సెంథిల్‌కుమార్ (33)తో గత ఏడాది ఆగస్టులో వివాహం జరిగింది. శనివారం ద్విచక్ర వాహనంలో రాగిణి పుట్టింటికి వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలోని అంగరై వద్ద అరియలూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. కోయంబత్తూరులోని బీలమేడుకు చెందిన లారీ డ్రైవర్ ప్రభాకరన్‌ను లాల్గుడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు విచారణ చేస్తున్నారు. కాగా పెళ్లయిన ఏడాదిలోనే ఇద్దరూ మృతిచెందడం ఇరు కుటుంబాల్లో తీవ్ర శోకాన్ని నింపింది.

మాదకద్రవ్యాల విక్రయం.. ఇద్దరి అరెస్టు

కొరుక్కుపేట: తాండయార్‌పేట వీరగుత్తి వీధిలో నిషేధిత మాదక ద్రవ్యాల విక్రయాలపై పోలీసులకు సమాచారం అందింది. దీంతో తాండయార్‌పేట ఇన్‌స్పెక్టర్ వడివేలు నకిలీ ఔషధాలు, మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న ఇంట్లో సోదాలు చేశారు. ఓ ఇంట్లో మావా లాంటి మత్తుపదార్థాలు తయారు చేసి విక్రయిస్తున్నట్లు తేలింది. ఆదికేశవన్ (34), రాజా అలియాస్ కుళ్ల రాజా (38)లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 38 కిలోల మావా, 8 కిలోల జర్దా, 2 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ ప్యాకెట్లను ఇంట్లోనే తయారు చేసి సెల్‌ఫోన్ల ద్వారా ఆర్డర్లు తీసుకుని వినియోగదారుల ఇళ్లకు చేరవేస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితులను కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి

తిరువొత్తియూరు: చెన్నై మధుర వాయిల్ సమీపంలోని అనకాపుత్తూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. తిరువణ్ణామలై జిల్లాకు చెందిన రాజేష్ చెన్నై మధుర వాయిల్‌లో ఉన్న తన సోదరి ఇంట్లో ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి పెరుంగలత్తూరులో పని ముగించుకుని ఇంటికి మోటార్ సైకిల్‌పై మధురవాయిల్ బైపాస్ రోడ్డులో వెళుతున్నాడు. అనకాపుత్తూరు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొంది. తీవ్ర గాయాలతో రాజేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు.

ఎన్‌కౌంటర్ హెచ్చరిక

- రౌడీలను హడలెత్తిస్తున్న పోలీసులు
- ఒకే నెలలో ఏడుగురిపై కాల్పులు
- తాజాగా న్యాయవాది హత్య కేసులో రౌడీపై కాల్పులు
- నిందితుడిని పట్టుకునే క్రమంలో ఇద్దరు పోలీసులకు కత్తిపోట్లు



గాయపడిన పోలీసులను పరామర్శిస్తున్న ఉన్నతాధికారులు

సాక్షి, చెన్నై: తూత్తుకుడి న్యాయవాది హత్య కేసులో అజ్ఞాతంలో ఉన్న నేరస్తుడు జయప్రకాశ్‌ను ఆదివారం ఉదయం ప్రత్యేక బృందం పోలీసులు తుపాకీతో కాల్చి పట్టుకున్నారు. ఎస్‌ఐకి, కానిస్టేబుల్ కత్తిపోట్లకు గురయ్యారు. తూత్తుకుడి బోరిస్‌పురానికి చెందిన న్యాయవాది ముత్తుకుమార్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో నగల రుణం ఆఫీస్ నడుపుతున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీ అక్కడికి వచ్చిన ముత్తుకుమార్‌ను రెండు బైక్‌లలో వచ్చిన ముఠా హత్య చేసి పరారైంది. ఈ హత్య ఘటనపై తూత్తుకుడి సిప్కాట్ పోలీసులు 10 మందిపై కేసు నమోదు చేశారు. ఫిబ్రవరి 23వ తేదీ తూత్తుకుడి వేల్మురుగన్ (25), తెన్‌కాశి రాజరత్నం (26), తిరువళ్లూర్ లంకేశ్వరన్ (28) మదురై జుడిషియల్ మాజిస్ట్రేట్ కోర్టులో లొంగిపోయారు. అదే విధంగా ఆర్మునేరికి చెందిన ముత్తురాజ్ (23) చెన్నై ఎగ్మూర్ కోర్టులో, కళ్లకురిచ్చి జిల్లా ఉలుందూర్‌పేటలో జయప్రకాశ్ తమ్ముడు రమేష్ ఫిబ్రవరి 26వ తేదీ లొంగిపోయారు. అనంతరం కరిణా ముఠాకు ఆశ్రయం ఇచ్చిన తూత్తుకుడి గోరంపల్లంకు చెందిన మేయ అయ్యడైప్పు లక్ష్మణ పెరుమాల్ (25), కూట్టంపులికి చెందిన నమో నారాయణన్ (33)లను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కిరాయి ముఠా నేత అర్మునేరికి చెందిన బాస్కర్‌ను ముంబైలో ప్రత్యేక బృందం పోలీసులు అరెస్టు చేశారు. తర్వాత శ్రీవైకుంఠం వద్ద పేట్టదురై సామిపురంకు చెందిన దినేష్ (29)ని, కిరాయి ముఠాగా వచ్చిన సాత్తాన్‌కుళంకు చెందిన 17 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు 5 మంది కోర్టులో లొంగిపోగా, 5 గురు అరెస్టయ్యారు. ముఖ్య నేరస్తుడైన పెరుమోసిన రౌడీ జయప్రకాశ్ కోసం ప్రత్యేక బృందం పోలీసులు మహారాష్ట్రలో గాలించారు.

ఇలా పట్టుకున్నారు..

తూత్తుకుడి సమీపంలోని తట్టపార్రై అటవీ ప్రాంతంలో జయప్రకాశ్ దాగి ఉన్నట్లు ఎస్‌ఐ రాజప్రభుకు ఆదివారం వేకువజామున రహస్య సమాచారం అందింది. దీంతో హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్న ప్రత్యేక బృందం పోలీసులు జయప్రకాశ్‌ను తుపాకీతో చుట్టుముట్టారు. అప్పుడు జయప్రకాశ్ తన చేతిలో ఉన్న వేట కత్తితో పోలీసు సుడలైమణిని నరికాడు. దీంతో అతడి ఎడమ చెయ్యి అరిచేతికి గాటు ఏర్పడింది. వెంటనే ఎస్‌ఐ రాజప్రభు జయప్రకాశ్‌ను పట్టుకోవడానికి ప్రయత్నించగా ఆయనకు ఎడమ భుజంపై కత్తిపోటు పడింది. దీంతో జయప్రకాశ్ మోకాళ్లపై రాజప్రభు తుపాకీతో కాల్చాడు. వెంటనే అక్కడ ఉన్న పోలీసులు జయప్రకాశ్‌ను చుట్టుముట్టి పట్టుకున్నారు. తూత్తుకుడి ప్రభుత్వ ఆస్పత్రి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్పీ బాలాజీ శరవణన్, ఏటీఎస్పీ కార్తికేయన్, రూరల్ డీఎస్పీ సురేష్ గాయపడిన పోలీసులను పరామర్శించి, అభినందించారు.

నెలలో ఏడుగురిపై కాల్పులు

నెల వ్యవధిలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తూపాకీ కాల్పులు శబ్దాలు వినిపిస్తూనే ఉన్నాయి. కోవైలో గత నెల కోగుల్ అనే రౌడీ హత్య కేసులో సంబంధం ఉన్న గౌతమ్, జోస్వా అనే ఇద్దురు రౌడీలను పోలీసులు కాల్చి పట్టుకున్నారు. తర్వాత వారం రోజుల్లోనే తిరుచ్చిలో పలు కేసుల్లో సంబంధం ఉన్న దురైసామి, సోమసుందరం అనే సోదరులను పోలీసులు కాల్చి అరెస్టు చేశారు. మరో రెండు రోజుల తర్వాత చెన్నై అయనావరం పోలీసు మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్ గీతా రౌడీ సూర్యాను తుపాకీతో కాల్చి పట్టుకున్నారు. తర్వాత వారం రోజుల్లో ఫిబ్రవరి 28వ తేదీ మదురైలో వినోద్ అనే రౌడీపై పోలీసులు కాల్పులు జరిపారు. ఇలా గత నెలలో 16 రోజుల్లో నలుగురు రౌడీలపై తుపాకీ కాల్పులు జరిపారు. అదేవిధంగా పోలీసుల తుపాకీ కాల్పుల వేట మార్చి నెలలోనూ కొనసాగింది. గత ఏడో తేదీ కోవైలో సంజయ్ రాజా అనే రౌడీని పోలీసులు కాల్చి పట్టుకున్నారు. ఈ స్థితిలో శనివారం ఒకే రోజు ఇద్దరు రౌడీలను పోలీసులు కాల్చి అరెస్టు చేశారు. సాధారణంగా పోలీసులు రౌడీని ఎన్‌కౌంటర్ చేసి హతమార్చడం తెలిసిందే. అయితే, ఇటీవల పోలీసులు నేరగాళ్లను కాల్చి పట్టుకుంటున్నారు. ఇది కూడా ఒక రకంగా నేరగాళ్లకు ఎన్‌కౌంటర్ హెచ్చరిక. పోలీసులు ఈ చర్యలతో అజ్ఞాతంలో ఉన్న రౌడీలు, నేరగాళ్లు హడలిపోతున్నారు.

డీఎంకే శిలాఫలకం ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

పళ్లిపట్టు: సీఎం స్టాలిన్ జన్మదిన వేడుకల్లో భాగంగా పళ్లిపట్టు మండలంలోని పలు గ్రామాల్లో డీఎంకే శ్రేణులు అన్నదానం చేశారు. తిరువళ్లూరు వెస్ట్ జిల్లా డీఎంకే ఆధ్వర్యంలో పళ్లిపట్టు నార్త్ మండల డీఎంకే కార్యదర్శి సీజే శ్రీనివాసన్ చిన్నముడిపల్లె, సామంతవాడ గ్రామాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించి స్వీట్లు పంచిపెట్టారు. సామంతవాడలో నూతన శిలాఫలకంతో పాటు పార్టీ జెండా ఏర్పాటు చేశారు. జిల్లా కార్య దర్శి, తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ శిలాఫలకం ఆవిష్కరించారు. పళ్లిపట్టు టౌన్‌లో పట్టణ కార్యదర్శి జ్యోతికుమార్ ఆధ్వర్యంలో స్టాలిన్ పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. నాయకులుపి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్త హత్య

అన్నానగర్: పుదుచ్చేరి మూలకులం జె.జె. నగరానికి చెందిన ఫ్రాన్సిస్ (28) లోడు మ్యాన్. ఇతనికి భార్య జానోవా మేరీ (26), ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు కాటేజ్ హౌస్‌లో నివసిస్తున్నారు. ఈ నెల 5వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు ఫ్రాన్సిస్ నిద్రపోతున్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు హఠాత్తుగా ఇంట్లోకి ప్రవేశించారు. గాఢ నిద్రలో ఉన్న ఫ్రాన్సిస్‌పై పెట్రోల్ బాటిల్ విసిరి నిప్పంటించి పరారయ్యారు. ఫ్రాన్సిస్ నొప్పిని భరించలేక కేకలు వేశాడు. అరుపులు విన్న అతని భార్య, స్థానికులు మంటలను ఆర్పి గాయపడిన అతన్ని పుదుచ్చేరిలోని జిప్మర్ ఆసుపత్రిలో చేర్చారు. సమాచారం తెలుసుకున్న రెడ్డియార్ పాళయం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతూ ఫ్రాన్సిస్ ఆదివారం మృతి చెందాడు. భార్యపై పోలీసులకు అనుమానం వచ్చింది. విచారణలో దిగ్భ్రాంతికరమైన సమాచారం వెల్లడైంది. దీని గురించి పోలీసులు మాట్లాడుతూ.. ఫ్రాన్సిస్ భార్య జానోవా మేరీకి, అదే ప్రాంతానికి చెందిన ప్లంబర్ గణేశన్ (26)కి పరిచయం ఏర్పడి అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం ఫ్రాన్సిస్‌కు తెలియడంతో భార్యని మందలించాడు. అయినా వారు సంబంధాన్ని కొనసాగించారు. ప్రేమకు అడ్డుగా వస్తున్న ఫ్రాన్సిస్‌ని చంపాలని ఇద్దరూ ప్లాన్ చేశారు. నిద్రిస్తున్న ఫ్రాన్సిస్‌పై జానోవా మేరీ, గణేశన్ పెట్రోల్ పోసి నిప్పంటించారు. అనంతరం ఇద్దరు వ్యక్తులు ఫ్రాన్సిస్‌పై పెట్రోలు బాంబు విసిరి వెళ్లిపోయారని ఇరుగుపొరుగు ఉన్న వారితో చెప్పిందని పోలీసులు తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి సెంట్రల్ జైలులో ఉంచారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్



ముఠాను అరెస్ట్ చూపిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

సూళ్లూరుపేట : తమిళనాడుకు గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లింగ్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కొంతమంది బెడ్‌షీట్లు అమ్ముకునే వారిలాగా రైళ్లలో గంజాయిని తీసుకొచ్చి సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు చేర్చగా.. తమిళనాడుకు చెందిన మరికొంతమంది బెడ్‌షీట్లు కొనుగోలు చేసినట్టుగా నటించి ఆ గంజాయిని తీసుకుని వెళుతున్నారని తెలిపారు. ఈ తరహాలో పట్టణాన్ని కేంద్రంగా చేసుకుని గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను రైల్వేస్టేషన్ రోడ్డులో అరెస్టు చేసినట్లు వివరించారు. వారి నుంచి రూ.3.84 లక్షలు విలువ చేసే 12 కిలోల గంజాయి, 8 మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ ముఠాలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఐదుగురు, తమిళనాడుకు చెందిన ఇద్దరు ఉన్నట్లు తెలిపారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నట్లు వివరించారు. ఆదివారం పట్టుబడిన ముఠాలో అల్లూరుసీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం, లోతుగడ్డ ప్రాంతానికి చెందిన చెందిన మొహమ్మద్ బరీద్ (42), గూడెం కొత్తపల్లి మండలం, దేవరపల్లెకు చెందిన సహాబార్ సాదిక్ (40) 12కిలోల గంజాయిని తీసుకొచ్చి రైల్వేస్టేషన్‌లో రోడ్డులోని పోస్టాఫీస్ వద్ద ఎదురు చూస్తుండగా, తమిళనాడులోని చెంగల్పట్‌కు చెందిన మారియప్పన్ (42), చెన్నైకు చెందిన కన్మణి (28), ఏ రమణి (26), మణిమేఘలై (32), శివకుమార్(24) వచ్చి వారితో బేరం కుదుర్చుకునే సమయంలో పోలీసులు దాడులు చేసి, అందరినీ అక్కడికక్కడే అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు. సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్‌ఐలు రవిబాబు, జేసీ శ్రీనివాసులురెడ్డి, ఎం జ్ఞానశేఖర్, మనోజ్‌కుమార్, వారి సిబ్బంది శీనయ్య, ఎస్ కిషన్, ఎన్ గిరిబాబు, జే రజని, అంకమ్మ వారం రోజుల్లో 24 కిలోల గంజాయిని పట్టుకున్నారని తెలిపారు.

సెంట్రల్ జైలులో ఇద్దరు ఖైదీల మృతి

తిరువొత్తియూరు: తిరుచ్చి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఇద్దరు ఖైదీలు మృతి చెందారు. తిరుచ్చి కొట్టా పట్టుకు చెందిన సుబ్రహ్మణ్యం (75) ఓ కేసుకు సంబంధించి 15 రోజుల జైలు శిక్ష పడింది. దీంతో తిరుచ్చి సెంట్రల్ జైలులో ఉంచారు. ఈ నెల 9వ తేదీ హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. అతన్ని తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. అలాగే శివగంగై జిల్లాకు చెందిన సతీష్ అలియాస్ స్టీఫెన్ ఒక కేసులో ఆరేళ్లుగా తిరుచ్చి సెంట్రల్ జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ నెల 6వ తేదీ జైలులో స్నానం చేస్తున్న సమయంలో హఠాత్తుగా ఫిట్స్ వచ్చి స్పృహ కోల్పోయాడు. జైలు అధికారులు అతన్ని తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సతీష్ శనివారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామివారి కల్యాణోత్సవాన్ని అర్చకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సుగంధ భరిత ద్రవ్యాలతో అభిషేకించి పరిమళ పుష్పాలు, ఆభరణాలతో స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీవారి ఉత్సవ మూర్తులను స్వామివారి కల్యాణ మండపానికి ఊరేగింపుగా వేంచేపు చేశారు. ఉభయదారులను కల్యాణోత్సవానికి కంకణధారులను చేశారు. శ్రీవారికి ఎదురుగా శ్రీదేవి, భూదేవి విగ్రహాలను ఉంచి పూజలు చేపట్టారు. అర్చకులు హోమం నిర్వహించారు. మంత్రోచ్ఛరణలతో శ్రీదేవి, భూదేవి మెడలో అర్చకులు మాంగళ్యధారణ క్రతువును పూర్తి చేశారు. భక్తులు కానుకలు సమర్పించారు. భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు.

మహిళపై లైంగిక దాడి.. హత్య

తిరువొత్తియూరు: నామక్కల్ జిల్లాలో మహిళపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేశారు. వివరాలు.. నామకల్ జిల్లా పరమ త్తివేలూరు సమీపంలోని జడేర్పాలయం కర్పాలయానికి చెందిన రైతు వివేకానందన్ .ఇతని భార్య నిత్య (27). ఈమె మేకలు, ఆవులను మేపుతుండేది. శనివారం సాయంత్రం ఎప్పటిలాగే మేకలను మేపేందుకు సమీపంలోని రేవు ప్రాంతానికి వెళ్లింది. చాలా సమయం అయినా నిత్య ఇంటికి తిరిగి రాలేదు. మేకలు మాత్రం ఇంటికి చేరుకున్నాయి. దీంతో ఆందోళన చెందిన వివేకానందన్ నిత్యాను వెతుక్కుంటూ మేకలు తోలుకెళ్లిన రేవు వద్దకు వెళ్లాడు. ముళ్లపొదలో నిత్య దుస్తులు చిరిగిన స్థితిలో నగ్నంగా రక్తపు గాయాలతో మృతిచెందింది. సమాచారం అందుకున్న జడేర్పాలయం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవ పరీక్ష కోసం నామక్కల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిత్య ధరించిన చైను, బంగారు కమ్మలు అదృశ్యమయ్యాయి. ఆమె శరీరంపై గాయాలున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు బలాత్కారం చేసి నగలను దోచుకెళ్లినట్లు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఘనంగా కుంభాభిషేకం



కుంభాభిషేకం చేస్తున్న పీఠాధిపతులు



పాల్గొన్న భక్తులు

వేలూరు: వేలూరు పట్టణంలోని విరుపాక్షిపురంలోని వలంపురి వినాయకుడి ఆలయంతో పాటు వళ్లి దైవాన సమేత మురుగర్, దక్షిణామూర్తి ఆలయ మహా కుంభాభిషేక సోమవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ఈ సందరఅభంగా ఆలయ ప్రాంగణంలో యాగశాల ఏర్పాటు చేసి కలశాలను ఏర్పాటు చేశారు. ఉదయం గణపతి, గోపూజ, గజ పూజ, మహా పూర్ణాహుతి జరిగింది. అనంతరం యాగశాలలో ఉంచిన కలశ నీటిని మేల తాళాల నడుమ శివాచార్యుల ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ రాజ గోపురానికి అభిషేకం చేశారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

పళ్లిపట్టు: పళ్లిపట్టులో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. మొత్తం 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. తిరువళ్లూరు తెలుగు భాష పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాల ఆవరణలో శిబిరం జరిగింది. తెలుగు భాష పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాజేంద్రనాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. చెన్నై అరవింద ఐకేర్ హాస్పిటల్ వైద్యులు కంటి పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్సకు ఎంపికైన వారిని చెన్నైకు తీసుకెళ్లి ఆపరేషన్లు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సంఘం కార్యదర్శి కుమారస్వామి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పేరుతో టోకరా

- 20 మంది నుంచి రూ.1.73 కోట్లు వసూలు

కొరుక్కుపేట: విల్లుపురం జిల్లాలో ఇళ్లు ఇప్పిస్తానని చెప్పి 20 మంది నుంచి రూ.1.73 కోట్లు వసూలు చేసిన ఇద్దరు అన్నదమ్ములను పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరు జిల్లా పెరియగటుపాళయానికి చెందిన మణిమగన్ కె వెంకటేశన్ (48), రాజ్ కుమార్ (45). వీరిద్దరూ కొన్నేళ్ల క్రితం విల్లుపురం జిల్లా కాంచీపురానికి చెందిన పంచారం అనే రైతు వద్ద ఇంటి నిర్మాణం కోసం భూమిని కొనుగోలు చేశారు. అందుకు తగ్గట్టుగానే శ్రీనివాస నగర్ ఎక్స్‌టెన్షన్ పేరుతో హౌసింగ్ ప్రాపర్టీ పెట్టారు. కందదీపు తదితర గ్రామాలకు చెందిన 20 మందికి పైగా ఇళ్ల స్థలాల కోసం డబ్బులు వసూలు చేశారు. అలాగే మురుగన్ అనే వ్యక్తికి మొత్తం రూ.27.50 లక్షలతో రెండు ప్లాట్‌లను నమోదు చేశారు. అడ్వాన్స్‌గా రూ.10 లక్షలు చెల్లించాడు. కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన రూ.17.50 లక్షలు చెల్లిస్తానని చెప్పారు. ఈ క్రమంలో మురుగన్ సంబంధిత రియల్ ఎస్టేట్ యజమానుల వద్దకు వెళ్లి మిగిలిన డబ్బులు వెంటనే చెల్లించి రెండు ఇళ్లు ఇవ్వాలని కోరారు. అయితే రెండేళ్లుగా ప్లాట్ ఇవ్వకుండా వెంకటేశన్, రాజ్‌కుమార్‌లు మోసం చేశారు. మురుగన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విల్లుపురం జిల్లా క్రైం బ్రాంచ్ పోలీసులు వెంకటేశన్, అతని సోదరుడు రాజ్‌కుమార్‌లను శనివారం అరెస్టు చేసి తిరుకోవిలూర్ కోర్టులో హాజరుపరిచి విల్లుపురం బ్రాంచ్ జైలులో ఉంచారు.

వివాహం పేరుతో విదేశీ మహిళ నుంచి

రూ.45 లక్షలు కొట్టేశాడు

- పుదువై యువకుడిపై కేసు నమోదు

తిరువొత్తియూరు: మలేషియా యువతి వద్ద రూ.40 లక్షలు మోసం చేసిన పుదుకోటకు చెందిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. పుదుకోట జిల్లా పరంబూరుకు చెందిన వాసు కుమారుడు మణికంఠన్. ఇతను మలేషియాలో ఉన్న ఓ సంస్థలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న సమయంలోజోర్‌పరువాకు చెందిన మహేశ్వరితో పరిచయమైంది. దీంతో వివాహం చేసుకుంటానని ఆమె వద్ద రూ. 40 లక్షలు నగదు తీసుకున్నాడు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం కరోనా కారణంగా భారతదేశానికి వచ్చిన మనికంఠన్ తిరిగి మలేషియాకు వెళ్లలేదు. రోజూ సెల్‌ఫోన్ ద్వారా మలేషియాలోఉన్న మహేశ్వరితో మాట్లాడుతూ వచ్చిన మణికంఠన్ గత కొన్ని రోజులుగా పట్టించుకోవడం మానేశాడు. వివాహానికి కూడా తిరస్కరించాడు. దీంతో మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్నావాసల్ పోలీసులు మణికంఠన్, అతని కుటుంబ సభ్యులు తండ్రి వాసు, తల్లి రజిని, అన్న రంజిత్ కుమార్పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న కారు.. నలుగురికి గాయాలు



ట్యాంకర్‌ను ఢీకొన్న కారు



క్షతగాత్రులను 108లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

చంద్రగిరి: వాటర్ ట్యాంకర్‌ను కారు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయాలపాలైన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ముంగళిపట్టు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, గుంటూరుకు చెందిన కృష్ణ చైతన్య తన కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి కారులో ఆదివారం తెల్లవారుజామున తిరుపతికి పయనమయ్యారు. ముందుగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకుని తిరుపతికి బయల్దేరారు. ముంగళిపట్టు వద్ద వస్తున్న క్రమంలో జాతీయ రహదారి డివైడర్‌పై వాటర్ ట్యాంకు ద్వారా నీళ్ల పడుతున్న సిబ్బంది ఎటువంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో వెనుక నుంచి కారు ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణ చైతన్యతోపాటు ఆయన భార్య సంధ్య, పిల్లలు శ్రీనిధి, ప్రణవి గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పకారుడు మంచాల సనత్‌కుమార్ 'ధూమ పానంతో ఆరోగ్యం క్షీణిస్తుంది' అనే అంశంపై సముద్ర తీరంలో ఆదివారం సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ శిల్పానికి 'స్మోకింగ్ కిల్స్' అనే ట్యాగ్ లైన్ ఏర్పాటు చేశారు. 'ప్రపంచ నో స్మోకింగ్ డే' సందర్భంగా రూపొందించిన ఈ సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. – చిల్లకూరు

క్లుప్తంగా...

ఆ లేఖ బయటకు వస్తేనే కేసు తేలుతుంది


- అరెస్టు చేస్తే చేయనివ్వండి.. నేను అన్నిటికీ సిద్ధమయ్యే ఉన్నా
- కడపలో మీడియాతో వైఎస్ భాస్కర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- వైఎస్ వివేకా హత్యకేసులో సీబీఐ విచారణ కోసం వెళ్లిన భాస్కర్‌రెడ్డి



కడప అర్బన్: మాజీ మంత్రి వైఎస్ వివేకా నందరెడ్డి హత్య కేసులో కీలకమైన ఆ లేఖ బయటకు వస్తేనే కేసు తేలుతుందని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నెల 12న తమ ముందు విచారణకు హాజరుకావాలని సీబీఐ అధికారులు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆయన కడప కేంద్ర కారాగారంలోని గెస్ట్‌హౌస్‌లో ఉన్న సీబీఐ అధికారుల ముందు హాజరయ్యేందుకు వెళ్లారు. అక్కడ సీబీఐ అధికారులెవరూ అందుబాటులో లేరు. మళ్లీ నోటీసులు ఇస్తామని, అప్పుడు విచారణకు హాజరుకావాలని అక్కడి సిబ్బంది సూచించడంతో ఆయన వెనుదిరిగారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసును పక్కదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని అనుమానం వ్యక్తంచేశారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే అవినాశ్‌రెడ్డి అన్ని విషయాలు చెప్పారని, తాను చెప్పేదేమీ లేదని పేర్కొన్నారు. తనకు ఆరోగ్యం సహకరించకపోయినా విచారణకు సహకరించాలనే ఉద్దేశంతో వచ్చానన్నారు. విచారణ అధికారులు అందుబాటులో లేరని, మరోసారి నోటీసులు ఇస్తామని చెప్పారని తెలిపారు. తిరిగి తనకు నోటీసులు ఇస్తే విచారణకు వస్తానని స్పష్టం చేశారు. ఈ కేసు పరిష్కారం కావాలంటే వివేకానందరెడ్డి హత్య జరిగిన సమయంలో వెలుగుచూసిన లేఖ బయటకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆ లేఖ బయటకు వస్తేనే అన్ని విషయాలు బయటకొస్తాయని చెప్పారు. ఈ కేసు హైకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో ఇంతకంటే ఏమీ చెప్పలేనన్నారు. అరెస్టుపై జరుగుతున్న ప్రచారంపై కూడా ఆయన స్పందించారు. 'అరెస్టు చేసుకుంటే చేసుకోండి, అన్నిటికీ సిద్ధమయ్యే ఉన్నా..' అని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ యువనేత 'కళ్లం'పై హత్యాయత్నం

తాడికొండ: వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కళ్లం హరికృష్ణారెడ్డిపై టీడీపీకి చెందిన ఇద్దరు యువకులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆదివారం మద్యం తాగిన ఇద్దరు యువకులు తాడికొండ మండలం కంతేరు గ్రామంలోని హరికృష్ణారెడ్డి ఇంటిపై దాడికి వెళ్లారు. వారిలో తాడికొండ గ్రామానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు షేక్ జఫ్రుద్దీన్ కుమారుడు జాకీర్ హుస్సేన్‌ను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మరొక యువకుడు పారిపోయాడు.



'సెంట్రల్' ఏసీలే!

ఎయిర్ కండీషనర్ల వినియోగం కేంద్ర పాలిత ప్రాంతాల్లోనే అధికం

- దేశవ్యాప్తంగా ఏటా 75 లక్షల ఏసీల విక్రయాలు
- శ్రీసిటీలో 60 లక్షలకు పైగా ఏసీల తయారీ సామర్థ్యంతో యూనిట్లు

దేశవ్యాప్తంగా కేంద్ర పాలిత ప్రాంతాల్లోనే ఎయిర్ కండీషనర్ల వినియోగం అధికంగా ఉంది. అత్యధికంగా చండీఘడ్‌లో 54.1 శాతం కుటుంబాలు ఏసీ నీడన సేదతీరుతున్నాయి. దేశంలో 4.9 శాతం కుటుంబాలకు ఏసీ సదుపాయం ఉన్నట్లు నేషనల్ శాంపిల్ సర్వే నివేదిక వెల్లడించింది. దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రస్థానంలో ఉన్న కేరళలో 10.4 శాతం, ఏపీలో 8.1 శాతం కుటుంబాలు ఏసీలను వాడుతున్నాయి. తెలంగాణలో 6.6 శాతం, తమిళనాడులో 6.1 శాతం కుటుంబాలకు ఏసీలున్నాయి. అత్యల్పంగా బిహార్‌లో 0.4 శాతం, ఒడిశాలో 1.5 శాతం, కర్ణాటకలో 1.8 శాతం కుటుంబాలు ఏసీలను వినియోగిస్తున్నాయి.

– సాక్షి, అమరావతి

శ్రీసిటీలో పలు యూనిట్లు


దేశవ్యాప్తంగా ఏటా సగటున 75 లక్షల ఏసీల విక్రయాలు జరుగుతున్నట్లు అంచనా. ఎండలు చుర్రుమనే దక్షిణాదిలో ఏసీల వినియోగం పెంచడంపై తయారీ సంస్థలు దృష్టి సారించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో పలు ఏసీల తయారీ యూనిట్లు ఏర్పాటు కావడంతోపాటు ఉత్పత్తి కూడా ప్రారంభించాయి. డైకిన్, బ్లూస్టార్, హావెల్స్, పానాసోనిక్, యాంబర్, ఈపాక్ లాంటి సంస్థలు తమ యూనిట్లను ఏపీలో నెలకొల్పుతున్నాయి. బ్లూస్టార్ విస్తరణ కార్యక్రమాలను సైతం చేపట్టింది. ఏటా వీటి మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 60 లక్షలకు పైగా ఉంది.

వ్యత్యాసం ఎందుకంటే..?

కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనాభా తక్కువగా ఉండటం, అత్యధికంగా ఉపాధి అవకాశాలు, పన్నులు తక్కువ ఉండటం లాంటి కారణాలు కొనుగోలు శక్తిని పెంచుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో అత్యధికంగా వ్యవసాయం, కూలీలు ఎక్కువగా ఉండటం ఏసీ వినియోగం తక్కువగా ఉండటానికి కారణం. పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు, కొనుగోలు శక్తి తక్కువగా ఉంటాయి.

– ఎం.ప్రసాదరావు, ఏయూ ఎకనామిక్స్ విభాగం విశ్రాంత అధిపతి

సగటు ఏసీ నియోగం భారత్ 4.9% పట్టణాల్లో 12.6% గ్రామాల్లో 1.2%



యూటీ / రాష్ట్రాల వారీగా సగటున ఏసీ వాడే కుటుంబాల శాతం

స్కాములన్నీ బాబు హయాంలోనే

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రజిని



చిలకలూరిపేట: చంద్రబాబు పరిపాలన కాలంలోనే ఎన్నో కుంభకోణాలు జరిగాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని విమర్శించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. బాబు హయాంలో రాజధాని పేరుతో రియల్ కుంభకోణానికి పాల్పడిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో కూడా చేసిన అవినీతి కుంభకోణం బయట పడిన విషయం ప్రజలు చూస్తున్నారని చెప్పారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని మంత్రి విమర్శించారు. వైద్య రంగం గురించి అసలు పట్టించుకోని ముఖ్యమంత్రిగా చరిత్రలో చంద్రబాబు మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. నేడు పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందుతుంటే ఓర్వలేని చంద్రబాబు.. అర్థంలేని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రాష్ట్రంలో బీసీల గురించి మాట్లాడే అర్హత పవన్‌కళ్యాణ్‌కు గానీ, చంద్రబాబుకు గానీ లేదని మంత్రి విడదల రజిని స్పష్టం చేశారు. బీసీలకు ఎవరైనా మేలు చేశారంటే అది జగనన్న మాత్రమేనని స్పష్టం చేశారు.

ఓటమికి బాబు సాకులు

- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఘోర పరాజయం ఖాయం
- దొంగ ఓట్లను చేర్పించడం.. అర్హుల ఓట్లను తొలగించడం బాబు చరిత్ర
- ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే
- అన్ని వర్గాల ప్రజల జేజేలతో ప్రతి ఎన్నికలోనూ వైఎస్సార్‌సీపీదే విజయం
- పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ విజయం ఖాయం
- ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తున్నాం
- పక్క రాష్ట్రంతో పోలిస్తే మన రాష్ట్రంలోనే సక్రమంగా జీతాలు



సాక్షి, అమరావతి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఓడిపోవడం ఖాయమనే నిర్ణయానికి వచ్చిన ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుతో పాటు ఆయన కరపత్రాలు.. ఆ ఓటమికి సాకులు సిద్ధం చేసుకుంటున్నాయని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. ఓటమికి సాకులు వెతుక్కోవడం ఆయనకు పరిపాటేనని దెప్పిపొడిచారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించడం, దొంగ ఓట్లను చేర్పించడం ఆయనకే చెల్లిందన్నారు. 2014–2019 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఓటర్లను తొలగించారని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌పై ప్రజలకు నమ్మకం కలిగింది కాబట్టే 2019 ఎన్నికల్లో 151 స్థానాల్లో గెలిపించి అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. ప్రజలు ఆశించిన దానికంటే మిన్నగా సీఎం పారదర్శకంగా పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం ఇప్పటికే అమలు చేశారని, ఇవ్వని హామీలను కూడా అమలు చేశారని.. విద్యా, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో సజ్జల ఇంకా ఏమన్నారంటే...

జనరంజక పాలన.. ప్రజల జేజేలు

- మంత్రివర్గంలో 70 శాతం పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చి సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించారు. రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవుల్లోనూ ఆ వర్గాలకే పెద్దపీట వేశారు. దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడమనేది నినాదంగానే మిగిలింది. రాష్ట్రంలో మాత్రం నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు.. మహిళలకు రిజర్వేషన్ చేసేలా చట్టం తెచ్చి మరీ సీఎం వైఎస్ జగన్ పదవులు ఇచ్చారు.
- అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే 1.30 లక్షల ఉద్యోగాలు కల్పించి.. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకెళ్లారు.
- సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో పారదర్శకంగా రూ.2 లక్షల కోట్లను ప్రజల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. కేంద్రం సహా బయటి దేశాల వారు వచ్చి ఇవన్నీ అధ్యయనం చేస్తున్నారు. మేం సగర్వంగా చెప్పుకునేందుకు ఇంతకంటే సర్టిఫికెట్లు అవసరం లేదు.
- సీఎం వైఎస్ జగన్ సుపరిపాలనకు జనం జేజేలు పలుకుతున్నారు కాబట్టే.. 2019 నుంచి జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ రికార్డు విజయాలు సాధిస్తోంది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ విజయం సాధించడం ఖాయం. 2024 ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీదే విజయం.

ఉద్యోగుల వల్లే కార్యక్రమాలు విజయవంతం

- ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని సీఎం వైఎస్ జగన్ భావిస్తున్నారు. ఉద్యోగుల కారణంగానే సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు సక్రమంగా చేరుతున్నాయి.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఉద్యోగుల వేతనాలు నెల బడ్జెట్ రూ.1,100 కోట్లు ఉండేది. వేతనాలు పెంచాక నెల బడ్జెట్ రూ.3,300 కోట్లకు పెరిగింది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాం.
- నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసి.. పని చేయడానికి అవసరమైన వాతావరణం కల్పించి ఉపాధ్యాయులకు పునర్వైభవం తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే.
- పక్క రాష్ట్రాలతో పోల్చితే ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్రంలోనే జీతాలు సక్రమంగా ఇస్తున్నాం. వారి సమస్యలపై చర్చిస్తూ పరిష్కరిస్తున్నాం. ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లిస్తాం.
- ఉద్యోగ సంఘాలను రాజకీయాలకు వాడుకున్నది చంద్రబాబే. ఆయన అధికారం నుంచి వెళ్లే ముందు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే.. రెండు డీఏలే ఇచ్చారు.
- ఉన్న పరిస్థితులను ఉద్యోగులకు వివరిస్తున్నాం. వారు అర్థం చేసుకుంటున్నారు. ఉండే ప్రభుత్వం..ఉండబోయే ప్రభుత్వం ఇదే. ఆ నమ్మకం ఉద్యోగులకు ఉంది.

మళ్లీ చదువుల ఒడికి..

▶ మొదటి పేజీ తరువాయి

సత్ఫలితాలిస్తున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 1,47,687 మంది విద్యార్థులను తిరిగి బడిలో చేర్చడం ఇందుకు నిదర్శనం. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, విద్యాకానుక తదితర పథకాలతోపాటు ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ విధానం, ఫౌండేషన్ స్కూళ్ల ద్వారా చదువులను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే.

హాజరు పర్యవేక్షణకు ప్రత్యేక యాప్

పాఠశాల వయసు పిల్లలంతా బడిలోనే ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. సచివాలయాలు కేంద్రంగా ఆయా పరిధిలోని స్కూళ్లలో చదివే పిల్లల హాజరును నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా 'కన్సిస్టెంట్ రిథమ్స్' యాప్‌ను తీసుకొచ్చింది. వరుసగా మూడు రోజుల పాటు పిల్లలు బడికి గైర్హాజరైతే వలంటీర్‌తో పాటు సంక్షేమ, విద్యా అసిస్టెంట్ సంబంధిత విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను కలుసుకుంటున్నారు. బడికి రాకపోవడానికి కారణాలను వాకబు చేస్తున్నారు. ఏదైనా సమస్య కారణంగా బడి మానేసినట్లు గుర్తిస్తే తగిన పరిష్కార మార్గాలను చూపేలా కృషి చేస్తున్నారు. వారిని తిరిగి పాఠశాలలకు రప్పించేలా చర్యలు చేపడుతున్నారు.

క్రమం తప్పకుండా సమీక్ష

రాష్ట్రంలో ప్రతి విద్యార్థికీ విద్యారంగ సంస్కరణల ఫలాలు అందేలా సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్న నేపథ్యంలో కొద్దిమంది పిల్లలు మధ్యలో బడి మానేయడానికి కారణాలను సచివాలయాల వారీగా నమోదు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికార యంత్రాంగానికి సూచించారు. సీఎం ఆదేశాల మేరకు ప్రతి గురువారం కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ డ్రాపౌట్లు, పాఠశాలల్లో చేరికలపై సమీక్ష చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో స్కూళ్లవారీగా కమిటీలు కూడా ఏర్పాటయ్యాయి. హెచ్‌ఎం, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు, సంక్షేమ, విద్యా అసిస్టెంట్, గ్రామ ముఖ్యులతో కమిటీలను నియమించారు. ఈ కమిటీ నెలకు ఒకసారి సమావేశమై పాఠశాలల్లో విద్యార్థుల హాజరుతో పాటు వివిధ వసతులపై సమీక్షిస్తుంది. పిల్లలు మధ్యలో బడి మానేయకుండా తగిన చర్యలు చేపడుతుంది. ప్రతి నెలా కమిటీ సమావేశమై తీసుకున్న చర్యలపై పాఠశాల విద్యాశాఖకు నివేదిక అందచేస్తుంది.

వారంలో ఒక రోజు బడి బాట

ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించిన వివరాలను కన్సిస్టెంట్ రిథమ్స్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. సంక్షేమ విద్యా అసిస్టెంట్ వారంలో ఒక రోజు తన పరిధిలోని స్కూళ్లను సందర్శించి విద్యార్థుల హాజరుతో పాటు ఎన్‌రోల్‌మెంట్, మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాలలో సౌకర్యాలను పర్యవేక్షించి వివరాలను యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఏఎన్‌ఎంలు నెలలో ఒక రోజు స్కూళ్ల వద్దకు వెళ్లి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వ్యాక్సినేషన్ వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. మహిళా పోలీసులు వారంలో ఒక రోజు స్కూళ్లను సందర్శించి పిల్లల హక్కులు, బాలికల భద్రత తదితర అంశాలను పర్యవేక్షించి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. వీటిని పరిశీలించి ఎక్కడైనా సమస్యలు, లోపాలుంటే వెంటనే పరిష్కరిస్తున్నారు. సందర్శన ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పాఠశాలలను ఇలా సూక్ష్మస్థాయిలో నిరంతరం పర్యవేక్షించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభుత్వం వినియోగిస్తోంది.

ఈ విద్యా సంవత్సరంలో బడి మానేసి తిరిగి స్కూళ్లలో చేరిన విద్యార్థులు ఇలా

జిల్లా	మళ్లీ స్కూళ్లో చేరిన పిల్లల సంఖ్య
ఎన్టీఆర్	8,832
ప్రకాశం	9,256
నెల్లూరు	7,470
పల్నాడు	8,296
కృష్ణా	3,240
గుంటూరు	4,364
విశాఖపట్నం	7,273
పశ్చిమగోదావరి	3,399
డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ	3,100
తూర్పు గోదావరి	4,755
కర్నూలు	12,777
నంద్యాల	7,035
పార్వతీపురం మన్యం	1,864
ఏలూరు	5,295
విజయనగరం	2,595
అనంతపురం	8,514
బాపట్ల	5,364
తిరుపతి	8,355
అల్లూరి సీతారామరాజు	2,865
చిత్తూరు	2,039
అనకాపల్లి	2,300
శ్రీకాకుళం	4,142
అన్నమయ్య	4,517
శ్రీ సత్యసాయి	5,545
కాకినాడ	6,268
వైఎస్సార్	8,227

'హనీట్రాప్'తో పేపర్ లీక్!

- టీఎస్‌పీఎస్సీకి చెందిన ఇద్దరు ఉద్యోగులే సూత్రధారులు
- 12 మందిని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించాల్సిన 'టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్' పరీక్ష పేపర్ లీకేజీ వెనుక హనీట్రాప్ ఉన్నట్టు బయటపడింది. హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రేణుకకు కొన్నాళ్లుగా టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనిత రామచంద్రన్ వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్‌తో పరిచయం ఉంది. ప్రస్తుతం జరుగుతున్న టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు రేణుక సోదరుడు కూడా దరఖాస్తు చేసుకున్నాడు. ఆదివారం టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష రాయాల్సి ఉంది. పోటీ ఎక్కువగా ఉండటంతో రేణుక తన తమ్ముడి కోసం ప్రవీణ్‌ను ప్రశ్నపత్రం కావాలని కోరింది. దీంతో ప్రవీణ్ టీఎస్‌పీఎస్సీలో నెట్‌వర్క్ అడ్మిన్‌గా పనిచేస్తున్న రాజశేఖర్‌తో కలిసి పేపర్‌ను పెన్ డ్రైవ్‌లోకి కాపీ చేసుకున్నాడు. ప్రవీణ్ ఈ ప్రశ్నపత్రాన్ని తీసుకువెళ్లి రేణుక, ఆమె భర్తకు అప్పగించాడు. రేణుక పేపర్‌ను సోదరుడికి ఇవ్వడం తోపాటు తమ స్వగ్రామం సర్పంచ్ కుమారుడితో తన వద్ద టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష పేపర్ ఉందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉంటే విక్రయిస్తానని చెప్పింది. సర్పంచ్ కుమారుడు తనకు తెలిసిన ముగ్గురు అభ్యర్థులను ఏర్పాటు చేశాడు. వారికి రూ.14 లక్షలకు పేపర్‌ను విక్రయించిన రేణుక రూ.4 లక్షలు తాను తీసుకుని, రూ.10 లక్షలను ప్రవీణ్‌కు ఇచ్చింది. అతడు ఇచ్చిన పేపర్‌ను ఈ నెల 2న తిరిగి ఇచ్చేసింది. దాన్ని సైదాబాద్‌లోని తన ఇంటికి తీసుకువెళ్లి కాల్చేశాడు. అయితే ప్రశ్నపత్రం కొన్న అభ్యర్థుల్లో ఒకరు హైదరాబాద్‌లోని ఓ ప్రాంతంలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి మాటల సందర్భంలో సదరు అభ్యర్థి పేపర్ లీకేజీని రూమ్మేట్‌కు చెప్పాడు. కంగుతిన్న రూమ్మేట్ ఇతర స్నేహితులతో కలిసి శనివారం డయల్-100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ దృష్టికి విషయం తీసుకువెళ్లడంతో పేపర్ లీకేజీపై ప్రాథమిక ఆధారాలు లభించాయి. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి.. ప్రవీణ్, రాజశేఖర్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసులు మొత్తం 12 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

తెలంగాణ

సీఎం కేసీఆర్‌కు స్వల్ప అస్వస్థత

గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు

- సీటీ, ఎండోస్కోపీ పరీక్షలు..
- కడుపులో చిన్న అల్సర్ గుర్తింపు
- మందులతో నయం అవుతుందని ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్/గచ్చిబౌలి: తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు ఉదయం హుటాహుటిన గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. ఏఐజీ వైద్యులు ఆయనకు పలు రకాల పరీక్షలు నిర్వహించారు. కడుపు నొప్పితోపాటు ఇతర అనారోగ్య సమస్యలతో ఆయన బాధపడుతున్నట్లు సమాచారం. సాధారణ పరీక్షల్లో భాగంగానే ముఖ్యమంత్రి వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చినట్లు బీఆర్‌ఎస్ వర్గాలు చెబుతున్నా.. గ్యాస్ట్రిక్ సమస్యతోనే ఆస్పత్రికి వచ్చినట్లు తెలుస్తోంది. కేసీఆర్ వెంట ఆయన సతీమణి శోభ, కూతురు కవిత, కుమారుడు కేటీఆర్, అల్లుడు హరీశ్‌రావు, ఎంపీ సంతోష్‌కుమార్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్, మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి మరికొందరు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. ముఖ్యమంత్రిని పరీక్షించిన తర్వాత ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం కేసీఆర్ ఉదయం పొత్తికడుపులో అసౌకర్యంగా ఉందని చెప్పారని, దీంతో ఆయనను ఆస్పత్రికి తీసుకొచ్చి సీటీ, ఎండోస్కోపీ పరీక్షలు చేశామని వెల్లడించారు. కడుపులో చిన్న అల్సర్ ఉన్నట్లు నిర్ధారించామన్నారు. అయితే దీనిని మందుల ద్వారా నయం చేయవచ్చని వివరించారు. ఇతర అన్ని రకాల పరీక్షలు సాధారణంగానే ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రికి అవసరమైన మందులు ఇచ్చామని చెప్పారు. కాగా, రాత్రి 7.15 గంటల సమయంలో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన కేసీఆర్ ప్రగతి భవన్‌కు వెళ్లిపోయారు.

ఏం జరిగింది.. ఏం చేద్దాం?

సీఎం కేసీఆర్‌తో భేటీ అయిన ఎమ్మెల్సీ కవిత

ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించి ఈడీ అధికారులు ఏం ప్రశ్నలు అడిగారు... ఏం సమాధానాలు చెప్పావని అడిగి తెలుసుకున్న కేసీఆర్!

16న మళ్లీ రావాలని ఈడీ నోటీసులిచ్చిన నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత

సాక్షి, హైదరాబాద్: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణ నేపథ్యంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో ఎమ్మెల్సీ కవిత ఆదివారం మధ్యాహ్నం భేటీ అయ్యారు. శనివారం ఢిల్లీలో ఈడీ సుదీర్ఘ విచారణను ఎదుర్కొని అర్ధరాత్రి హైదరాబాద్ వచ్చిన కవిత నేరుగా ప్రగతిభవన్‌కు వెళ్లి కేసీఆర్‌ను, ఇతర కుటుంబసభ్యులను కలిశారు. అనంతరం బంజారాహిల్స్‌లోని తన నివాసానికి వెళ్లిపోయారు. కాగా, ఆదివారం సీఎం కేసీఆర్‌ని కలవాలని భావించారు. ఈ మేరకు హరీశ్‌రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ ఉదయమే ప్రగతిభవన్‌కు వెళ్లగా, కవిత కొంత ఆలస్యంగా వచ్చారు. కవితతోపాటు హరీశ్‌రావు, కేటీఆర్, సీఎం కేసీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఈడీ జరిపిన 9 గంటల సుదీర్ఘ విచారణలో ఏం జరిగిందనే అంశాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఢిల్లీ లిక్కర్ స్కాంకు సంబంధించి ఈడీ అధికారులు ఏం ప్రశ్నలు అడిగారు... ఏం సమాధానాలు చెప్పారనే విషయంపై సీఎం అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఈ అంశంపై న్యాయనిపుణులతో చర్చించినట్లు తెలిసింది. అనంతరం ఈ నెల 16న మరోసారి విచారణకు హాజరయ్యే అంశంపై కూడా కేసీఆర్‌తో చర్చించినట్లు తెలుస్తోంది. దీనిపై న్యాయనిపుణులతో మాట్లాడాలని నిర్ణయించుకున్నారు. ఈడీ విచారణలో ఎలా వ్యవహరించాలనే దానిపై కవితకు కేసీఆర్ కొన్ని కీలక సలహాలు, సూచనలు చేసినట్లుగా సమాచారం.

కేంద్ర సాహిత్యఅకాడమీ తెలుగు విభాగం కన్వీనర్‌గా మృణాళిని

సాక్షి, హైదరాబాద్: కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్‌గా ప్రొఫెసర్ మృణాళిని ఎన్నికయ్యారు. ఢిల్లీలో ఆదివారం నిర్వహించిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఎన్నిక ప్రక్రియ జరిగింది. మృణాళినితోపాటు రచయిత మందలపర్తి కిషోర్ ఆంధ్రప్రదేశ్ పక్షాన, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఎస్వీ సత్యనారాయణ, కవి, పాత్రికేయుడు ప్రసేన్ తెలంగాణ పక్షాన తెలుగు విభాగం కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

నేడే 'ఎమ్మెల్సీ' పోలింగ్

▶ మొదటి పేజీ తరువాయి

రెండు టీచర్లు, నాలుగు స్థానిక సంస్థల నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 9 ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించిన అభ్యర్థుల భవిష్యత్తును 10,59,420 మంది ఓటర్లు నిర్ణయించనున్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లోను వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుచేశామని, పోలింగ్ హాల్‌లోకి పోలీసులు, జర్నలిస్టులతో పాటు ఎవ్వరూ లోపలికి వెళ్లడానికి అనుమతిలేదని మీనా స్పష్టంచేశారు. 584 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, ఇక్కడ మైక్రో అబ్జర్వర్లతోపాటు బయట వీడియోగ్రాఫర్‌ను కూడా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కడప-అనంతపురం-కర్నూలు పట్టభద్రుల నియోజకవర్గంలో అత్యధికంగా 49 మంది పోటీపడుతుండటంతో ఇక్కడ జంబో బ్యాలెట్ బాక్సులను తెలంగాణ నుంచి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఉ.7.30కు ఏజెంట్లు సమక్షంలో బ్యాలెట్ బాక్సుల సీలింగ్ జరుగుతుందని, 8 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమై సా.4 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

ఐదు స్థానాల్లో ఏకగ్రీవం..

మొత్తం 9 స్థానిక సంస్థల అభ్యర్థులకు ఎన్నికల నోటిఫికేషన్ జారీకాగా.. అందులో ఐదుచోట్ల కేవలం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు వేశారు. దీంతో అనంతపురం లోకల్ అథారిటీ నుంచి ఎస్.మంగమ్మ, కడప పి. రామసుబ్బారెడ్డి, నెల్లూరు మేరిగ మురళీధర్, తూర్పుగోదావరి కుడుపూడి సూర్యనారాయణరావు, చిత్తూరు నుంచి సుబ్రమణ్యం సిపాయిల ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ప్రకటించామన్నారు. శ్రీకాకుళం లోకల్ అథారిటీ నుంచి ఇద్దరు, పశ్చిమ గోదావరిలో రెండు స్థానాలకు ఆరుగురు, కర్నూలులో ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇక పట్టభద్రుల నియోజకవర్గాల్లో శ్రీకాకుళం-విజయనగరం-విశాఖ నుంచి 37 మంది, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు నుంచి 22, కడప-అనంతపురం-కర్నూలు నుంచి 49 మంది పోటీపడుతున్నారు. ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు టీచర్ల నియోజకవర్గంలో 8మంది, కడప-అనంతపురం-కర్నూలు టీచర్ల నియోజకవర్గం నుంచి 12 మంది పోటీలో ఉన్నారు.

వయొలెట్ పెన్ను మాత్రమే ఉపయోగించాలి

మరోవైపు.. ఓటర్లకు స్లిప్పుల పంపిణీ ఇప్పటికే పూర్తయిందని, వీటితోపాటు ఎన్నికల సంఘం గుర్తింపు కార్డు లేదా, ఆధార్, పాన్, ప్రభుత్వ ఐడీ కార్డు, పాస్‌పోర్టు వంటి పది గుర్తింపు కార్డులు ఉంటేనే ఓటింగ్‌కు అనుమతించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా స్పష్టం చేశారు. బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు జరుగుతాయని.. పోటీలోని అభ్యర్థులకు ఎదురుగా వారి ప్రాధాన్యతా క్రమంలో నెంబర్లు మాత్రమే నమోదు చేయాల్సి ఉంటుందని, టిక్ లేదా ఇంటూ మార్కులు, సంఖ్యను పదాల్లో రాసినా, సంతకాలు చేసినా వాటిని చెల్లని ఓట్లుగా పరగణిస్తారని స్పష్టం చేశారు. పంపిణీ చేసిన ఓటరు స్లిప్పుల వెనుక ఓటు ఏ విధంగా వేయాలో వివరంగా పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా.. బ్యాలెట్ పేపర్‌తోపాటు ఇచ్చే వయొలెట్ కలర్ పెన్నుతో మాత్రమే అంకెలు వేయాలని, ఇతర రంగులు, సొంత పెన్నులు వినియోగిస్తే ఆ ఓట్లను చెల్లని వాటిగా పరిగణిస్తామని మీనా స్పష్టంచేశారు.

బోగస్ ఓట్ల ఆరోపణలపై చర్యలు

ఇక ఎన్నికల ప్రచార సమయంలో ఇప్పటివరకు రూ.77.48 లక్షల నగదు, 1,02,819.05 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు మీనా తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన కేసుల్లో 75 మందిని అరెస్టుచేశామన్నారు. మొత్తం 663 ఓట్లకు సంబంధించి మాత్రమే టీడీపీ అధినేత చంద్రబాబు సహా ఇతర పార్టీల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, అత్యధికంగా తిరుపతి పట్టణ ప్రాంతం నుంచే ఉన్నట్లు తెలిపారు. ఇక్కడ మొత్తం ఓటర్లు 87వేలకు పైగా ఉంటే 663 ఓట్లపై అభ్యంతరాలు వచ్చాయని, ఇప్పటికే వాటిలో 500కు పైగా ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇక ఒకే ఇంటి చిరునామాతో చాలామందిని ఓటర్లు నమోదు చేశారన్న ఆరోపణలను పరిశీలించగా.. ఓటర్లు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోనే ఉన్నారని, నమోదు సమయంలో అధికారులు చిరునామా ఒకటే పేర్కొనడంతో ఈ గందరగోళం తలెత్తిందని.. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

8 చోట్ల స్ట్రాంగ్ రూమ్‌లు

పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను భద్రపర్చడానికి 8 చోట్ల స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటుచేసినట్లు మీనా తెలిపారు. ఈనెల 16వ తేదీ ఉ.8 గంటలకు ఓట్ల లెక్కింపు జరుగుతుందని, సాధారణ ఎన్నికలతో పోలిస్తే ఈ ఓట్ల లెక్కింపు భిన్నమైనది కావడంతో దానికి తగ్గట్లుగా అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇది సుదీర్ఘ ప్రక్రియని.. ఫలితాల ప్రకటనకు రెండు మూడు రోజులు సమయం కూడా పట్టే అవకాశం ఉందన్నారు. ఫలితాలను సాధ్యమైనంత త్వరగా ప్రకటించడానికి వీలుగా 40 వరకు టేబుల్స్ ఏర్పాటుచేశామన్నారు.

సన్నిధి

బౌద్ధవాణి

ఆకాశంలో...

పొగిడితే పొంగిపోవడం, తెగిడితే కుంగిపోవడం స్థిరచిత్తం లేని వారు చేసేపని. సత్యదర్శనం చేసినవారు, మనో రుగ్మతలు పోగొట్టుకున్న ప్రాజ్ఞులు పొగడ్తలకు పొంగిపోరు. నిందలకు కుంగిపోరు. అలాంటివారి మనస్సు స్థిరంగా, దృఢంగా ఉంటుంది. ఎందుకంటే... ఏది సత్యమో ఏది అసత్యమో వారికి తెలుసు. వారు ఎప్పుడూ ఆదమరపుగా లేకుండా ఎరుకతోనే ఉంటారు.

తాము విన్న మాటల్ని గుడ్డిగా నమ్మరు. కాబట్టి చెప్పుడు మాటలు వారి చెవులనే తాకవు. వారు ఏది విన్నా, దేన్ని చదివినా, దేన్ని చూసినా వెంటనే ప్రతిస్పందించరు. ఎరుకతో ఆలోచిస్తారు. ఎరుకతో గ్రహిస్తారు. ఎరుకతో స్పందిస్తారు. తొందరపాటుకీ, తొట్రుపాటుకీ ఆమడ దూరంలో ఉంటారు.

కొందరు భిక్షువులకి ఈ తొందరపాటు ఉండేది. అలాంటి భిక్షువులు కొందర్ని ఒకసారి బుద్ధుని దగ్గరకు తీసుకువచ్చారు. అప్పుడు బుద్ధుడు వారితో

"భిక్షువులారా! ఒక గొప్ప చిత్రకారుడు ఉన్నాడు. అతను ఎరుపు, నీలం, పసుపు, ఆకుపచ్చ, తెలుపు, నలుపు రంగుల్ని తీసుకు వచ్చాడు. ఆ చిత్రకారుడు ఆ కుంచెల్ని రంగుల్లో ముంచి ఇదిగో చూడండి. ఇక్కడ ఈ ఆకాశంలో అందమైన చిత్రాలు గీస్తాను. వనాల్నీ, భవనాల్నీ, పర్వతాల్నీ, ప్రకృతి సోయగాల్నీ చిత్రీకరిస్తాను. చూడండి" అంటూ కుంచెలు తీసుకున్నాడు. ఆకాశంలో ఏవేవో చిత్రించాడు. "ఓ భిక్షువులారా! ఆ చిత్రాలు కనిపిస్తాయా?"

"లేదు భగవాన్"

"ఎందుకని?"

"ఆకాశం తెల్లని వస్త్రం కాదు, గోడ కాదు"

"అంటే... ఆకాశానికి రూపం లేదు. కాబట్టి రూపం లేని దాని మీద రూపాలను చిత్రించడం జరగదు. ఆ చిత్రాల్ని కనిపించేట్టు చేయడం కుదరదు. అసంభవం!



పైగా ఆకాశంపై చిత్రాలు గీయడానికి పూనుకున్న వ్యక్తికి అలసట, ఆయాసం మాత్రమే మిగులుతాయి. అది వృథాప్రయాస. మీ మనస్సు కూడా అలా ఆకాశంలా ఉండాలి. పొగడ్తలూ, తెగడ్తలూ ఆకాశం మీద చిత్రించే చిత్రాల్లా మీ మనస్సు మీద కనిపించకూడదు. అప్పుడే మీ హృదయం నిర్మలమవుతుంది.

అలా కాకుండా.. మీరు ప్రతిదానికీ ప్రతిస్పందిస్తే మీరు స్థిరచిత్తాన్ని కోల్పోతారు. మాటకు మాట అంటారు. చేతకు చేత చూపుతారు. మీ జీవితాల్ని జగడాలతో గడిపేస్తారు.

ఒక గట్టి గుండ్రని చట్రంపై ఒక తోలును గట్టిగా బిగించితే... ఏమవుతుంది? తాకితేనే ధ్వని పుడుతుంది. కొట్టితే గట్టి శబ్దం చేస్తుంది. మీటిన దాన్ని బట్టి మోత పుట్టిస్తుంది. కానీ, అదే చర్మాన్ని బిగుతుగా కట్టకపోతే... ఎలాంటి శబ్దాన్ని చేయదు. గరగరలు చేయదు. అలాంటి తోలు మీద ఎంతగా కొట్టినా అది వృథా ప్రయాస మాత్రమే అవుతుంది. మన మనస్సు కూడా బిర్రుగా బిగదీసుకుని ఉండకూడదు. ఎల్లప్పుడూ సమతా స్థితిలోనే ఉండాలి. అప్పుడే అది అందరికీ ఉపయోగపడేది అవుతుంది. అందర్నీ సమభావంతో చూస్తుంది. ద్వేషించే వారిని కూడా ప్రేమిస్తుంది. పొగడ్తలకు పొంగదు. తెగడ్తలకు కుంగదు" అని చెప్పాడు.

ఆ భిక్షువులు శ్రద్ధగా విన్నారు. తమ ప్రవర్తన మార్చుకున్నారు. సమతా స్థితి అలవరచుకున్నారు.

–డా. బొర్రా గోవర్ధన్

మంచి మాట

ప్రతికూలమూ అనుకూలమే!

> ఎదురుదెబ్బలు తగిలితే మనం బెదిరిపోకూడదు ; పరిస్థితులు ప్రతికూలంగా ఉంటే మనం చెదిరిపోకూడదు. ఏ పరిణామానికీ మనం బెదిరిపోకూడదు ; ఏ పర్యవసానానికీ మనం చెదిరిపోకూడదు. బెదిరిపోయి భయపడుతూ ఉండడం జీవనం కాకూడదు ; చెదిరిపోయి చతికిలపడిపోవడం జీవితం కాకూడదు. జీవన గతి ప్రగతిని, జీవితస్థితి అభ్యున్నతిని పొందాలి.



'ఇప్పుడు ఇది అంతం కాదు; ఇది అంతానికి ఆరంభం కూడా కాదు; కానీ ఇది ఆరంభానికి అంతం కావచ్చు' అని విన్స్‌టన్ చర్చిల్ చెప్పిన మాటల్ని ఆలోచనలోకి తీసుకుని ఎదురుదెబ్బలు తగిలినప్పుడూ, పరిస్థితులు ప్రతికూలించినప్పుడూ మనం ప్రతిస్పందించాలి. ఎదురుదెబ్బలు తగిలినప్పుడూ, ప్రతికూలమైన పరిస్థితులప్పుడూ మన గతి అంతమైపోయిందనో, మనం ఇక ఇంతే అనో కాకుండా కొత్త ఆరంభానికి ఇది అంతం అయి ఉండచ్చు అన్న ఆశాభరితమైన ఆలోచనతో మనం భవిష్యత్తును చేపట్టేందుకు ఉద్యుక్తులం అవ్వాలి. ఎదిగినవాళ్లందరూ ఎదురుదెబ్బలు తిన్నవాళ్లే. ప్రయోజకులు అయిన వాళ్లందరూ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నవాళ్లే. ఏ తరుణంలో అయినా మన తీరే మనకు మేలు చేస్తుంది, మనల్ని మేలైన వాళ్లను చేస్తుంది.

'వర్తమాన క్షణాలలో ఉన్న దాన్ని అంగీకరించు నువ్వే దాన్ని ఎంపిక చేసుకున్నట్టుగా' అని జర్మన్ తాత్త్వికుడు ఎక్‌హార్ట్ టోల్ సరైన సూచన చేశారు. తగిలిన ఎదురుదెబ్బల్ని , ప్రతికూల పరిస్థితుల్ని మనం అంగీకరించాలి. నిజానికి అవి మనం ఎంపిక చేసుకున్నవి కాకపోయినా జరిగాయి కాబట్టి వాటిని మనం అంగీకరించాలి. అంగీకరించకుండా మనల్ని మనం మభ్యపెట్టుకోవడంవల్ల, వాటి దెబ్బకు కుంగిపోవడం వల్ల మనం వాటిని అధిగమించలేం. వాటిని మనం అధిగమించి తీరాలి.

ఎదురుదెబ్బల్ని, ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించిన జీవితమే విజయవంతమైన జీవితం అవుతుంది. జీవితం అంటూ ఉన్నాక అది విజయవంతం అవ్వాలి.

అబ్రహం లింకన్ 1831లో వ్యాపారంలో విఫలం అయ్యాడు. 1832లో ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాడు. 1833లో వ్యాపారంలో మరోసారి విఫలమయ్యాడు. 1835 లో తీవ్రమైన నరాల జబ్బుతో బాధపడ్డాడు. 1838 లో స్పీకర్ పదవికి పోటీ చేసి ఓడిపోయాడు. 1840లో ఎలక్టర్ పదవికి పోటీ చేసి ఓడిపోయాడు. 1843, 48లలో కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి పోటీ చేసి ఓడిపోయాడు. 1855 లో సెనెట్‌కు పోటీ చేసి ఓడిపోయాడు. 1856లో ఉపాధ్యక్షుడి పదవికి పోటీ చేసి ఓడిపోయాడు. 1858 లో సెనెట్‌కు పోటీ చేసి ఓడిపోయాడు. 1860లో అమెరికా అధ్యక్షుడయ్యాడు. అబ్రహం లింకన్ ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నాడు; ఎన్నో ప్రతికూల పరిస్థితుల్ని ఎదుర్కొన్నాడు. వాటిని అధిగమించినందుకు పొందిన విజయంగా ఆయన అమెరికా అధ్యక్షుడయ్యాడు. ఎదురుదెబ్బల్ని, ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించగలిగితే ఏం సాధించవచ్చో అబ్రహం లింకన్ జీవితం తెలియజేస్తోంది. ప్రపంచచరిత్రలో ఇటువంటి ఉదంతాలు చాల ఉన్నాయి. ఎదురుదెబ్బలు, ప్రతికూల పరిస్థితులు ఎవరికైనా తప్పవు. అవి ఉంటూనే ఉంటాయి. మనకు ఎదురు దెబ్బల్ని, ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించాలన్న సంకల్పం, ప్రయత్నం బలంగా ఉండాలి. ఆశ, ఆకాంక్ష, ఆసక్తి ఈ మూడూ మనిషి ప్రగతికి, అభ్యున్నతికి ఎంతో ముఖ్యం. వీటికి తోడుగా లేదా ఊతంగా నమ్మకం అనేది ఉండాలి. 'ఓ నమ్మకమా! మాకు నమ్మకాన్నివ్వు, భయం నుంచి విముక్తి నివ్వు, అంతులేని సంపదలకు మమల్ని అధిపతుల్ని చెయ్యి...' అంటూ సాగుతూ వేదంలో ఒక ప్రార్థన ఉంది. మనకు నమ్మకం కావాలి; మనం నమ్మకాన్ని నమ్ముకోవాలి. మన సంకల్పాన్ని, ప్రయత్నాన్ని నమ్ముకుని ఎదురుదెబ్బల్ని, ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించి మనం రాణించాలి, రాజిల్లాలి.

– రోచిష్మాన్

అమృత బిందువులు

- మేడిపండు పైకి అందంగా కనిపిస్తుంది. కానీ, లోపల అన్నీ పురుగులే ఉంటాయి. మనిషి జీవితం కూడా అంతే. ఒకరి జీవితం మరొకరికి అందంగానే కనబడుతుంది. కానీ, ఆ జీవితంలో దాగి ఉన్న కష్టాలు, కన్నీళ్ళు ఎవరికీ కనిపించవు.

***

- మనం మనిషిగా పుట్టడమే ఒక అద్భుతం. బతికి ఉండటం ఒక అదృష్టం. ముడిపడుతున్న బంధాలన్నీ వరాలు. ఎదురు పడుతున్న అడ్డంకులన్నీ మనకు విలువైన పాఠాలు. కష్టం గురించి చింతించకు. ఉన్నన్నాళ్లు ఆనందంగా గడిపేసేయి.

***

- జీవితంలో అన్నీ కోల్పోయినా ఒకటి మాత్రం మనకోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. దాని పేరే భవిష్యత్తు.

***

- గొప్పగా బతకక పోయినా తృప్తిగా బతకాలి. డబ్బుంటే అన్నీ వస్తాయి కానీ, డబ్బే ప్రధానం కాదు. మనకంటూ నలుగురు ఉన్నారు అంటే, అది చాలు ఈ జీవితానికి.



మాటే మంత్రమా..!



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తేనెటీగ అన్ని పువ్వులలోని మకరందాన్ని చుక్క చుక్క సేకరించి తీసుకొచ్చి తేనెపట్టు పెట్టి అందులో గదులు కట్టి ఎంతో జాగ్రత్తగా దాస్తుంది. చుట్టుపక్కల ఏమాత్రం అలికిడి అయినా దాడిచేసి దరిదాపులలోకి రాకుండా కుట్టి తరిమేస్తుంది. ఇంత కష్టపడి దాచినదీ అదేమయినా అనుభవిస్తుందా ...అనుభవించదు. మరిదేనికయినా వదిలిపెడుతుందా, వదిలిపెట్టదు. చివరకు ఏమవుతుంది. ఎవడో చూస్తాడు. ఆ చెట్టు కింద మంటపెడతాడు, పొగపెడతాడు. ఆ పొగ తాకిడికి, ఆ వేడికి తట్టుకోలేక గూడు వదిలి తేనెటీగలు అన్నీ పారిపోగానే చెట్టెక్కి తేనెపట్టు పీకేసి తెచ్చుకుంటాడు. దానిలోని తేనెనంతా సంగ్రహిస్తాడు. పిండగా మిగిలిన పిప్పిని ముక్కలు ముక్కలు చేసి పారేసిపోతాడు. తరువాత తేనెటీగలు వచ్చి చూసుకుంటే ఏముంటుందక్కడ? మరో చెట్టు వెతుక్కుని మళ్ళీ తేనెపట్టు పేర్చడం మొదలుపెడుతుంది. అంతే తప్ప అంతకుమించి దానిలో మార్పురాదు. మరి మనిషి బుద్ధి జీవిఅయి ఉండీ ఇలానే ప్రవర్తిస్తే ఎలా!!! ఇటువంటివారికి బుద్ధి చెప్పడానికి వేమన ఒక మంచి నీతి సూత్రాన్ని మనకందించాడు. ధనము కూడబెట్టి దానంబు చేయక/తాను దినక లెస్స దాచుకొనగ/ తేనెటీగ గూర్చి తెరువరికియ్యదా/విశ్వదాభిరామ వినుర వేమ....కొందరు ధనార్జనే ధ్యేయంగా ఒళ్ళు హూనం చేసుకుని, చివరకు కుటుంబంతో కూడా సంతోషంగా గడపనంత తీరికలేకుండా సంపాదిస్తూనే ఉంటారు. దాన్ని వాళ్ళు అనుభవించరు సరికదా, చూస్తూ చూస్తూ అవతలివారు ఎంతటి బాధలో ఉన్నా తాము సహాయం చేయగల స్థితిలో ఉన్నా ఒక్క పైసా విదిల్చరు. తేనెటీగ దాచినట్లు దాచిపెడుతుంటారు. మనిషి జీవితంలో ధనం అనేది అత్యంత ప్రధానమైనది. ఎంత సంపాదించాడో అంతా దానం చేసేయమని ఎవ్వరూ చెప్పరు. తన కష్టార్జితం తాను అనుభవించాల్సిందే. అలాగే కొంత భవిష్యత్ అవసరాలకోసం దాచుకోవాల్సిందే. అది శాస్త్ర సమ్మతమే. దాచుకొమ్మనే చెప్పాయి. అయితే సమతౌల్యం పాటించాలి. తాను అనుభవించాల్సిన దానికన్నా ఎక్కువ అనుభవించిన వాడు తనకు తాను ద్రోహం చేసుకొన్నవాడవుతాడు. తాను అనుభవించాల్సినదానికన్నా ఎక్కువ ఖర్చుపెట్టేసిన వాడు భవిష్యత్ తరాలకు ద్రోహం చేసినవాడు. శంకర భగవత్పాదులు మోహముద్గరంలో ఇలా అంటారు..."మా కురు ధన జన యవ్వన గర్వం/ హరతి నిమేషాత్కాలః సర్వం/ మాయామయమిదమఖిలం హిత్వా/బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా." ... అంటే ధనం కానీ, నీ యవ్వనం కానీ, వీటిని గమనించి నీ పక్కన చేరిన జనం కానీ ..వీటిని చూసి మిడిసి పడవద్దు. కాల ప్రవాహంలో ఇవేవీ మిగలవు, నీ వెంటరావు. చెరువులో నీరింకిపోతే చేపలు కూడా అదృశ్యమయినట్లు నీ దగ్గర ధనం, యవ్వనం లేని నాడు నీ వెంట ఎవ్వరూ ఉండరు. కాలం అన్నింటినీ లాక్కుపోతుంది. అలా తీసేయకముందే శరీరంలో ఉన్న యవ్వన బలాన్ని పదిమందికి పనికి వచ్చేట్టు చేసినవాడు ధన్యుడు. నీ అవసరాలకు పోను మిగిలిన ధనాన్ని ఆపదలో ఉన్న వారిని ఉద్ధరించడానికి ఖర్చుపెట్టు. నీకున్న విద్యను పదుగురి అభ్యున్నతి కోసం పంచిపెట్టు. అని చెబుతున్నారు శంకరులు. వేమన చెప్పిందీ అదే.... ఇవి మన జీవితాలను ప్రయోజనకరంగా తీర్చిదిద్దుకోవడానికి ఉపయోగపడే మంత్రాలు. వీటిని ఎప్పుడూ మననం చేసుకుంటూ ఉంటే మనం బాగుపడడమే కాదు, నలుగురికీ ఆదర్శమవుతాం.

సినిమా



చిరంజీవి

కథ విన్నారా ?

హీరో చిరంజీవి, దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. ప్రస్తుతం మెహర్ రమేశ్ దర్శకత్వంలో 'భోళాశంకర్' సినిమా చేస్తున్నారు చిరంజీవి. ఈ మూవీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. దీంతో తన తర్వాతి సినిమాపై ఫోకస్ పెట్టారు మెగాస్టార్. ఈ క్రమంలోనే ఆయన కొత్త కథలు వింటున్నారు. దర్శకులు పూరి జగన్నాథ్, ప్రభుదేవా వంటి వారు చిరంజీవికి కథలు చెప్పారని టాక్. తాజాగా రచయిత, దర్శకుడు బీవీఎస్ రవి పేరు తెరపైకి వచ్చింది. బీవీఎస్ రవి కథకు తమిళ దర్శకుడు పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తారట. ఈ సినిమాకు చిరంజీవి కుమార్తె సుష్మిత కొణిదెల ఓ నిర్మాతగా వ్యవహరించనుండటం విశేషం. అయితే ఈ విషయాలపై పూర్తి అధికారిక సమాచారం అందాల్సి ఉంది. కాగా చిరంజీవి హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్నట్లు గతంలో ఓ ప్రకటన వచ్చింది. అయితే ఈ సినిమా గురించి మరో అధికారిక అప్‌డేట్ రావాల్సి ఉంది.



తమన్నా

ప్రేక్షకుల మనసుల్లో కూర్చుంటాం - నాగశౌర్య

"'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' సినిమా రికార్డులు బద్దలు కొట్టేస్తుందని చెప్పను.. కానీ, ఈ సినిమాతో ప్రేక్షకుల మనస్సులో మేము కుర్చీలు వేసుకొని కూర్చుంటాం. ఈ మూవీ తర్వాత 10, 15 ఫ్లాప్‌లు తీసినా ప్రేక్షకులు మమ్మల్ని క్షమిస్తారు.. అంత మంచి సినిమా ఇది" అని హీరో నాగశౌర్య అన్నారు. శ్రీనివాస్ అవసరాల దర్శకత్వంలో నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా నటించిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి హీరో అడివి శేష్, నిర్మాతలు అశ్వినీదత్, సునీల్ నారంగ్, రవిశంకర్, దామోదర ప్రసాద్, కోన వెంకట్, ప్రసన్న కుమార్, దర్శకులు బాబీ కొల్లి, మారుతి, నందినీ రెడ్డి అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. శ్రీనివాస్ అవసరాల మాట్లాడుతూ–"రచయితగా, దర్శకుడిగా నాకు మంచి పేరు వచ్చిందంటే దానికి ప్రధాన కారణం నాగశౌర్య. తను అద్భుతమైన నటుడు. ఈ మూవీలో నాకు ఇష్టమైన 1960లోని ఓ పాటను రీమిక్స్ చేశాను.. ఆ పాట పాడిన మోహనకృష్ణ ఇంద్రగంటిగారికి థ్యాంక్స్" అన్నారు. "ఇంతమంచి సినిమాలో భాగమయ్యే చాన్స్ ఇచ్చిన విశ్వ ప్రసాద్, వివేక్ కూచిబొట్లగార్లకు థ్యాంక్స్" అన్నారు దాసరి పద్మ.



అవసరాల, నాగశౌర్య, మాళవిక, పద్మజ, కృతీప్రసాద్, వివేక్



సంజయ్ దత్

పవర్‌ఫుల్ గెస్ట్

'జవాన్'కు గెస్ట్ కానున్నారట సంజయ్ దత్. షారుక్ ఖాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'జవాన్'. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. విజయ్ సేతుపతి, ప్రియమణి కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ దీపికా పదుకొనె ఓ కీలకమైన అతిథి పాత్రలో కనిపించనున్నట్లుగా వార్తలు వచ్చాయి. తాజాగా మరో పవర్‌ఫుల్ గెస్ట్ పాత్రలో నటుడు సంజయ్ దత్ నటించనున్నారనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. కథ పరంగా ఈ క్యారెక్టర్‌కి మంచి ప్రాధాన్యత ఉండటంతో సంజయ్ దత్ ఓకే చెప్పారట. ఏప్రిల్‌లో ముంబైలో జరిగే షెడ్యూల్‌లో షారుక్, సంజయ్ కాంబినేషన్ సీన్స్‌ను చిత్రీకరిస్తారట మేకర్స్. 'జవాన్' ని జూన్ 2న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించింది చిత్రయూనిట్. కానీ, ఈ విడుదల తేదీలో మార్పు ఉంటుందని బీటౌన్ టాక్. కాగా ప్రస్తుతం కశ్మీర్‌లో జరుగుతున్న విజయ్ 'లియో' సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు సంజయ్ దత్.

భారీ తారాగణం హిట్ అవ్వాలి - ఎస్వీ కృష్ణారెడ్డి



అలీ, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, సదన్, బీవీ రెడ్డి


"'భారీ తారాగణం' మూవీ ట్రైలర్ బాగుంది. దర్శకుడు శేఖర్, నిర్మాత బీవీ రెడ్డి మంచి కంటెంట్ ఉన్న కథని ఎంచుకున్నారు. సదన్ స్క్రీన్‌పై హీరో ధనుష్‌లాగా కనిపిస్తున్నాడు. ఈ సినిమా హిట్ అవ్వాలి" అని డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. సదన్ హీరోగా, దీపికా రెడ్డి, రేఖ నిరోష హీరోయిన్లుగా శేఖర్ ముత్యాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భారీ తారాగణం'. బీవీ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ని ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి, నటుడు అలీ విడుదల చేశారు. బీవీ రెడ్డి మాట్లాడుతూ– "నటీనటులు, సాంకేతిక నిపుణుల సపోర్ట్ వల్లే సినిమా బాగా వచ్చింది. త్వరలో విడుదల చేస్తాం" అన్నారు. "ప్రేమ, వినోదం, థ్రిల్లింగ్ అంశాలతో మా సినిమా రూపొందింది" అన్నారు శేఖర్ ముత్యాల. "ఇలాంటి మంచి చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్" అన్నారు సదన్, దీపికా రెడ్డి, రేఖ నిరోష. ఈ చిత్రానికి కెమెరా: ఎమ్‌వీ. గోపి, సంగీతం: సుక్కు.

ఆ అవసరం లేదు - తమన్నా

బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ, హీరోయిన్ తమన్నా రిలేషన్‌షిప్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారనే వార్తలు కొన్నాళ్లుగా వస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పందించారు తమన్నా. "మేమిద్దరం(విజయ్‌ను ఉద్దేశిస్తూ..) కలిసి ఓ సినిమా చేశాం. అప్పట్నుంచి మా రిలేషన్‌షిప్ గురించి వార్తలు వస్తూనే ఉన్నాయి. వీటన్నింటిపై స్పందించాల్సిన అవసరం నాకు లేదు. ఈ అంశంపై నేను ఇంతకుమించి చెప్పాల్సిన విషయాలు కూడా ఏమీ లేవు. అయినా హీరోయిన్స్ గురించి ఇలాంటి అవాస్తవాలు ఎలా తెరపైకి వస్తున్నాయో నాకు అర్థం కావడం లేదు. డాక్టర్ నుంచి బిజినెస్ మేన్ వరకు నాకు తెలియకుండానే కొందరు ఇప్పటికే నా పెళ్లి చాలాసార్లు చేశారు (వ్యంగ్యంగా..)" అని చెప్పుకొచ్చారు తమన్నా. ఇక రజనీకాంత్ 'జైలర్', చిరంజీవి 'భోళాశంకర్' చిత్రాల్లో తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే.

వైవిధ్యమైన అరి

అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్, 'శుభలేఖ' సుధాకర్, 'చమ్మక్' చంద్ర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. 'పేపర్ బాయ్' ఫేమ్ జయశంకర్ దర్శకత్వం వహించారు. ఆర్వీ రెడ్డి సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, శేషు మారంరెడ్డి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను నిర్మాత అభిషేక్ అగర్వాల్ విడుదల చేసి, మాట్లాడుతూ–"ఇలాంటి కథలు చేయాలంటే ధైర్యం కావాలి. నిర్మాతలకు ఇది తొలి మూవీ అయినా బాగా తీశారు. ఈ మూవీ హిట్ కావాలి" అన్నారు. "వైవిధ్యమైన కథతో వస్తున్న చిత్రం'అరి'. కథతో పాటు కథనం, సంగీతం హైలెట్ అవుతాయి" అన్నారు శేషు మారంరెడ్డి. "మా నిర్మాతలు శేషు, ఆర్వీ రెడ్డిగార్ల సపోర్ట్ మర్చిపోలేనిది. 'అరి' సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది" అన్నారు జయ శంకర్. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: శివశంకర వరప్రసాద్.



జయశంకర్, అభిషేక్ అగర్వాల్, శేషు మారంరెడ్డి



రోషన్

కొత్త కబురు

'నిర్మలా కాన్వెంట్' (2016), 'పెళ్లిసందడి' (2021) చిత్రాలతో ప్రేక్షకుల్లో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు హీరో రోషన్. ప్రస్తుతం తన తర్వాతి ప్రాజెక్ట్ కోసం కథలు వింటున్నారు. అయితే రోషన్ నెక్ట్స్ మూవీ వైజయంతీ మూవీస్, వేదాన్ష్ పిక్చర్స్ పతాకాలపై రూపొందనుంది. త్వరలోనే ఈ మూవీ ప్రారంభం కానుంది. కాగా ఈ సినిమా దర్శకుడు, నటీనటులు, సాంకేతిక నిపుణుల పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.

రిచో రిచ్!

గీత్ ఆనంద్, నేహా సోలంకి జంటగా దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించిన చిత్రం 'గేమ్ ఆన్'. నవాబ్ గ్యాంగ్, అశ్విన్–అరుణ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'రిచో రిచ్..' అనే పాటని విడుదల చేశారు. అసుర సాహిత్యం అందించిన ఈ పాటను రిక్కీ, అసుర పాడారు. రవి కస్తూరి మాట్లాడుతూ– "ఇంటెన్స్ క్యారెక్టర్స్ మధ్య జరిగే ఎమోషనల్ జర్నీ ఇది. హీరో ఒక లూజర్‌గా మిగిలిపోతున్న టైమ్‌లో తన లైఫ్‌లో ఒక గేమ్ స్టార్ట్ అవుతుంది. ఆ గేమ్ తనని ఏ స్థాయికి తీసుకెళుతుంది? అనేదే 'గేమ్ ఆన్' కథ" అన్నారు. "రొటీన్ సినిమాలకు భిన్నంగా ఉండే కథ ఇది. యాక్షన్, రొమాన్స్, ఎమోషన్స్ ఆకట్టుకుంటాయి" అన్నారు దయానంద్. ఈ చిత్రానికి కెమెరా: అరవింద్ విశ్వనాథన్, ఒరిజినల్ బ్యాగ్రౌండ్ స్కోర్: అభిషేక్ ఏ.ఆర్.



గీత్ ఆనంద్, నేహా సోలంకి



అతుల్య, కిరణ్

చమక్ చమక్ పోరి..

కిరణ్ అబ్బవరం, అతుల్య రవి జంటగా రమేష్ కాదూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మీటర్'. నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదలకానుంది. ఇందులో భాగంగా చిత్ర మ్యూజిక్ ప్రమోషన్స్‌ని స్టార్ట్ చేసింది యూనిట్. సాయి కార్తీక్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చమక్ చమక్ పోరి..' అంటూ సాగే మాస్ లిరికల్‌ని తొలి పాటగా ఈ నెల 15న విడుదల చేస్తున్నారు. "పక్కా మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'మీటర్'. 'చమక్ చమక్ పోరి..' పాటలో కిరణ్, అతుల్య రవి మాస్ డాన్స్‌ను చూస్తారు" అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: వెంకట్.సి.దిలీప్, సురేష్ సారంగం, లైన్ ప్రొడ్యూసర్: అలేఖ్య పెదమల్లు, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: బాబా సాయి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ నిర్మాత: బాల సుబ్రమణ్యం కేవీవీ.




ఇంగ్లండ్‌కు షాక్: బంగ్లాదేశ్‌దే సిరీస్

టి20 ప్రపంచ చాంపియన్ ఇంగ్లండ్‌తో ఆదివారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో బంగ్లాదేశ్ నాలుగు వికెట్లతో గెలిచి సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. ఈ రెండు జట్ల మధ్య ఇదే తొలి ద్వైపాక్షిక టి20 సిరీస్ కావడం విశేషం. తొలుత ఇంగ్లండ్ 20 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్పిన్నర్ మెహదీ హసన్ మిరాజ్ (4/12) ఇంగ్లండ్‌ను దెబ్బ కొట్టాడు. అనంతరం బంగ్లాదేశ్ 18.5 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసి గెలిచింది.

రన్నరప్ అంకితా రైనా

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో భారత నంబర్‌వన్ అంకితా రైనా రన్నరప్‌గా నిలిచింది. బెంగళూరులో ఆదివారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో 241వ ర్యాంకర్, 30 ఏళ్ల అంకిత 2 గంటల 19 నిమిషాల్లో 6-0, 4-6, 0-6తో చెక్ రిపబ్లిక్‌కు చెందిన 15 ఏళ్ల బ్రెండా ఫ్రువిర్తోవా చేతిలో పరాజయం పాలైంది. అంకిత తొలి సెట్‌ను గెలిచి, రెండో సెట్‌లో 3-0తో ఆధిక్యంలోకి ఉన్నా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది.





హర్మన్‌ప్రీత్ 'హ్యాట్రిక్' ఆసీస్‌పై భారత్ విజయం

రూర్కెలా: కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 'హ్యాట్రిక్' నమోదు చేయడంతో... ప్రొ హాకీ లీగ్‌లో భారత జట్టు 5-4 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా జట్టును బోల్తా కొట్టించింది. టీమిండియా సారథి హర్మన్‌ప్రీత్ సింగ్ 13, 14, 55వ నిమిషాల్లో పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలచగా... జుగ్‌రాజ్ సింగ్ (17వ ని.లో), సెల్వం కార్తీ (25వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఆస్ట్రేలియా తరఫున జోషువా బెల్ట్‌జ్ (3వ ని.లో), విలోట్ (43వ ని.లో), బెన్ స్టెయినెస్ (53వ ని.లో), టిమ్ హోవర్డ్ (57వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. రెండు జట్లకు పది చొప్పున పెనాల్టీ కార్నర్‌లు రాగా... భారత్ మూడింటిని, ఆసీస్ రెండింటిని గోల్స్‌గా మలిచాయి. నేడు జరిగే మరో లీగ్ మ్యాచ్‌లో జర్మనీతో భారత్ ఆడుతుంది.

కివీస్ లక్ష్యం 285

క్రైస్ట్‌చర్చ్: శ్రీలంకతో తొలి టెస్టులో న్యూజిలాండ్ జట్టు విజయానికి 257 పరుగుల దూరంలో ఉంది. 285 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 17 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 28 పరుగులు చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 83/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 105.3 ఓవర్లలో 302 పరుగులకు ఆలౌటైంది. ఏంజెలో మాథ్యూస్ (235 బంతుల్లో 115; 11 ఫోర్లు) వీరోచిత ఆటతో 14వ సెంచరీ సాధించాడు. కెరీర్‌లో 101వ టెస్టు ఆడుతున్న మాథ్యూస్ ఐదో వికెట్‌కు చండీమల్ (42; 2 ఫోర్లు)తో కలిసి 105 పరుగులు జోడించాడు. కివీస్ బౌలర్లలో టిక్నెర్ నాలుగు, హెన్రీ మూడు వికెట్లు తీశారు. ఈ టెస్టులో న్యూజిలాండ్ గెలిచినా, 'డ్రా'గా ముగిసినా... ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టు ఫలితంతో సంబంధం లేకుండా భారత జట్టు ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.

కోహ్లి కొట్టిన సెంచరీతో...

అహ్మదాబాద్ టెస్టుపై పట్టు మనదే • భారత్ 571 ఆలౌట్
విరాట్ కోహ్లి భారీ శతకం • మెరిసిన అక్షర్ పటేల్
టీమిండియాకు 91 పరుగుల ఆధిక్యం • నేడు ఆసీస్ బ్యాటర్లకు పరీక్ష

నాలుగో టెస్టులో నాలుగో రోజు నాలుగో శతకం నమోదైంది. ఒక టెస్టులో నాలుగు సెంచరీలు కొత్తేం కాదు... కానీ ఈ 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో మాత్రం ఇది గొప్ప విశేషం. ఎందుకంటే ఇంతకుముందు జరిగిన మూడు టెస్టులు కూడా మూడో రోజుల్లోనే ముగిశాయి. స్పిన్నర్లు తిప్పేసిన ఆ మ్యాచ్‌ల్లో బ్యాటర్లు విలవిలలాడారు. గత మ్యాచుల్ని శాసించిన బౌలర్లపై ఇరు జట్ల బ్యాటర్లు సెంచరీలతో విరుచుకుపడ్డారు. ఫలితంగా నాలుగో టెస్టులో చివరి రోజు ఆట ఆసక్తికరం కానుంది.



అహ్మదాబాద్: విరాట్ కోహ్లి (364 బంతుల్లో 186; 15 ఫోర్లు) భారీ శతకంతో చివరి టెస్టులో భారత్ పట్టు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 178.5 ఓవర్లలో 571 పరుగుల వద్ద ఆలౌటైంది. నాలుగో రోజు ఆటలో అక్షర్ పటేల్ (113 బంతుల్లో 79; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) కోహ్లితో కలిసి విలువైన భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో కీలకమైన 91 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఆఖరి రోజు సోమవారం ఉదయం ఆతిథ్య బౌలర్లు కూడా సమష్టిగా ఓ చేయి వేసి... ఆసీస్‌ను 200 పరుగుల్లోపు కట్టడి చేస్తే ఛేదించే లక్ష్యం మన ముందుంటుంది. తద్వారా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్ వేటకు శుభం కార్డు పడుతుంది.

1205 రోజుల తర్వాత...

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి... సుదీర్ఘ టెస్టు సెంచరీ నిరీక్షణకు తెరదించాడు. ఆఖరి టెస్టులో మూడంకెల స్కోరు ముచ్చట తీర్చుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 289/3 ఓవర్‌నైట్ స్కోరుతో నాలుగో రోజు ఆదివారం ఆట ప్రారంభించిన భారత్‌కు జడేజా (84 బంతుల్లో 44; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) రూపంలో గట్టిదెబ్బే తగిలింది. బ్యాటింగ్‌కు కలిసొచ్చే పిచ్‌పై కోహ్లికి జతయిన ఆంధ్ర క్రికెటర్ శ్రీకర్ భరత్ (44; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) జతయ్యాడు. 'రన్ మెషిన్' అండతో భరత్ భారీ సిక్సర్లతో అలరించాడు. 363/4 వద్ద లంచ్‌కు వెళ్లొచ్చాక ఎంతో ఓపిగ్గా ఆడిన కోహ్లి 241 బంతుల్లో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. 2019లో నవంబర్ 23న క్రికెట్ మక్కా ఈడెన్ గార్డెన్స్‌లో బంగ్లాదేశ్‌పై కోహ్లి 27వ టెస్టు శతకం సాధించాడు. మళ్లీ 43 టెస్టుల తర్వాత భారత గడ్డపైనే 28వ సెంచరీ చేసి 1205 రోజుల నిరీక్షణకు ముగింపు పలికాడు. ఐదో వికెట్‌కు 84 పరుగులు జోడించాక లయన్ బౌలింగ్‌లో భరత్... హ్యాండ్స్‌కాంబ్ చేతికి చిక్కాడు. అనంతరం అక్షర్ పటేల్ కూడా పట్టుదలతో ఆడటంతో ఆస్ట్రేలియాకు కంగారు తప్పలేదు.





ఇద్దరి జోడీ కుదరడంతో భారత్ భారీస్కోరుకు బాటపడింది. మూడో సెషన్‌లో టీమిండియా 500 మార్క్‌ను అందుకోగా, కోహ్లి 150 పరుగులు పూర్తయ్యాయి. కాసేపటికే అక్షర్ 95 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. అక్షర్‌ను స్టార్క్ బౌల్డ్ చేయడంతో ఆరో వికెట్‌కు 162 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాత కాసేపటికే భారత్ ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన ఆసీస్ ఆట నిలిచే సమయానికి వికెట్ నష్టపోకుండా 3 పరుగులు చేసింది. కునెమన్ (0 బ్యాటింగ్), హెడ్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

56 భారత గడ్డపై అత్యధిక వికెట్లు తీసిన విదేశీ జట్టు బౌలర్‌గా నాథన్ లయన్ గుర్తింపు పొందాడు. భారత్‌లో 11 టెస్టులు ఆడిన లయన్ 56 వికెట్లు పడగొట్టాడు. డెరిక్ అండర్‌వుడ్ (ఇంగ్లండ్: 16 టెస్టుల్లో 54 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును లయన్ బద్దలు కొట్టాడు.

10 తొలి ఇన్నింగ్స్‌లో భారత్ కొట్టిన సిక్స్‌లు. ఆస్ట్రేలియాపై ఓ టెస్టు ఇన్నింగ్స్‌లో భారత్ కొట్టిన అత్యధిక సిక్స్‌లు ఇవే. 1986లో ముంబైలో, 2013లో చెన్నైలో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టుల్లో భారత్ ఎనిమిది చొప్పున సిక్స్‌లు కొట్టింది.

3 ఓ టెస్టు మ్యాచ్‌లో తొలి ఆరు వికెట్లకు 50 అంతకంటే ఎక్కువ పరుగుల భాగస్వామ్యాలు నమోదు చేసిన మూడో జట్టుగా భారత్ నిలిచింది. గతంలో ఆస్ట్రేలియా (1960లో వెస్టిండీస్‌పై), పాకిస్తాన్ (2015లో బంగ్లాదేశ్‌పై) ఈ ఘనత సాధించాయి.

అయ్యర్ అవుట్!

భారత మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ నాలుగో రోజు బ్యాటింగ్‌కు దిగలేదు. వెన్నునొప్పితో బాధపడిన అతనికి స్కానింగ్ కూడా తీశారు. ముందు జాగ్రత్తగా జట్టు మేనేజ్‌మెంట్ అతన్ని ఆడించలేదు. మూడో రోజు ఆటలోనే అతనికి నొప్పి మొదలైనట్లు తెలిసింది. గాయం తీవ్రత దృష్ట్యా అతను ఈ నెల 17 నుంచి జరిగే మూడు వన్డేల సిరీస్‌కు కూడా దూరమయ్యే అవకాశాలున్నాయి.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలిఇన్నింగ్స్: 480; **భారత్ తొలి ఇన్నింగ్స్:** రోహిత్ (సి) లబుషేన్ (బి) కునెమన్ 35; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 128; పుజారా (ఎల్బీడబ్ల్యూ) (బి) మర్ఫీ 42; కోహ్లి (సి) లబుషేన్ (బి) మర్ఫీ 186; జడేజా (సి) ఖాజా (బి) మర్ఫీ 28; భరత్ (సి) హ్యాండ్స్‌కాంబ్ (బి) లయన్ 44; అక్షర్ (బి) స్టార్క్ 79; అశ్విన్ (సి) కునెమన్ (బి) లయన్ 7; ఉమేశ్ (రనౌట్) 0; షమీ (నాటౌట్) 0; అయ్యర్ (అబ్సెంట్ హర్ట్); ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం** (178.5 ఓవర్లలో ఆలౌట్) 571. **వికెట్ల పతనం:** 1-74, 2-187, 3-245, 4-309, 5-393, 6-555, 7-568, 8-569, 9-571. **బౌలింగ్:** స్టార్క్ 22-3-97-1, గ్రీన్ 18-1-90-0, నాథన్ లయన్ 65-9-151-3, కునెమన్ 25-3-94-1, మర్ఫీ 45.5-10-113-3, హెడ్ 3-0-8-0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: కునెమన్ (బ్యాటింగ్) 0; హెడ్ (బ్యాటింగ్) 3; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం** (6 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 3. **బౌలింగ్:** అశ్విన్ 3-2-1-0, రవీంద్ర జడేజా 2-1-1-0, షమీ 1-0-1-0.

ఎదురులేని ముంబై



ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ముంబై ఇండియన్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై ఎనిమిది వికెట్లతో యూపీ వారియర్స్‌ను ఓడించింది. ముంబైకిది వరుసగా నాలుగో విజయం కాగా... టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు సాధించింది. ఓపెనర్, కెప్టెన్ అలీసా హీలీ (46 బంతుల్లో 58; 7 ఫోర్లు, 1 సిక్స్), తాలియా మెక్‌గ్రాత్ (37 బంతుల్లో 50; 9 ఫోర్లు) రాణించారు. అనంతరం ముంబై 17.3 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసి గెలిచింది. యస్తిక భాటియా (27 బంతుల్లో 42; 8 ఫోర్లు, 1 సిక్స్), నట్ సీవర్ (31 బంతుల్లో 45 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (33 బంతుల్లో 53 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) యూపీ బౌలర్లను ధనాధన్ ఆటతో హడలెత్తించారు. **నేడు జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడుతుంది.**

ఫైనల్లో బెంగళూరు ఎఫ్‌సీ



బెంగళూరు: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టోర్నీలో బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్ రెండో అంచె మ్యాచ్‌లో ముంబై సిటీ ఎఫ్‌సీ 2-1తో బెంగళూరును ఓడించింది. తొలి అంచె మ్యాచ్‌లో బెంగళూరు 1-0తో ముంబైపై గెలిచింది. రెండు మ్యాచ్‌ల తర్వాత రెండు జట్లు ఒక్కో విజయం సాధించడం.. గోల్స్ పరంగానూ 2-2తో సమంగా ఉండటంతో... విజేతను నిర్ణయించడానికి 'షూటౌట్'ను నిర్వహించారు. 'షూటౌట్'లో బెంగళూరు 9-8తో ముంబై సిటీపై గెలిచి ఫైనల్ చేరుకుంది. కోల్‌కతాలో నేడు హైదరాబాద్ ఎఫ్‌సీ, ఏటీకే మోహన్ బగాన్ జట్ల మధ్య రెండో అంచె సెమీఫైనల్ జరుగుతుంది. తొలి మ్యాచ్ 'డ్రా' కావడంతో... ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్లోకి ప్రవేశిస్తుంది.

విద్య, ఉద్యోగ సమాచారం

నీట్ యూజీ ప్రవేశ పరీక్ష

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-యూజీ 2023(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యుయేట్) పరీక్షకు నోటిఫికేషన్ విడుదలచేసింది.ఎంబీబీఎస్,బీడీఎస్, బీఏఎంఎస్,బీయూఎంఎస్,బీహెచ్‌ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏటా ఈ పరీక్షను నిర్వహిస్తారు.

» **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బయోటెక్నాలజీతో సైన్స్‌లో ఇంటర్మీడియట్ /ప్రీ-డిగ్రీ పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 17 ఏళ్లు నిండి ఉండాలి.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 06.03.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.04.2023
» **నీట్ 2023 పరీక్ష తేది:** 07.05.2023
» **పరీక్ష సమయం:** మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.20 గంటల మధ్య జరగనుంది.
» **వెబ్‌సైట్:** www.neet.nta.nic.in

ఏపీ హైకోర్టులో 30 సివిల్ జడ్జి పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతిలోని హైకోర్టు.. ఏపీ స్టేట్ జ్యుడీషియల్ సర్వీస్‌లో సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పోస్టుల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 30
» **అర్హత:** న్యాయశాస్త్రంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 01.03.2023 నాటికి 35 ఏళ్లు మించకూడదు. » **వేతనం:** నెలకు రూ.77,840 నుంచి రూ.1,36,520 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), రాతపరీక్ష, మౌఖిక పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 17.03.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.04.2023.
» **స్క్రీనింగ్ టెస్ట్ హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్:** 15.04.2023. » **స్క్రీనింగ్ పరీక్ష తేది(కంప్యూటర్ ఆధారిత పరీక్ష):** 24.04.2023.
» **ప్రాథమిక కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ:** 27.04.2023. » **వెబ్‌సైట్:** hc.ap.nic.in

ఏపీ బీసీ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలు

విజయవాడలోని మహాత్మా జ్యోతిబా పులే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహించే 103 బీసీ బాలబాలికల పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి(ఇంగ్లిష్ మీడియం, స్టేట్ సిలబస్)లో ప్రవేశాలకు సంబంధించి ప్రవేశ ప్రకటన వెలువడింది. అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **పరీక్ష వివరాలు:** మహాత్మా జ్యోతిబా పులే ఏపీ బీసీడబ్ల్యు కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023.
» **విద్యార్హత:** విద్యార్థులు సంబంధిత జిల్లాల్లోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాలుగో తరగతి 2022-23 విద్యా సంవత్సరంలో చదివి ఉండాలి. జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి సంబంధిత జిల్లా లోని పాఠశాలల్లో చదువుతూ ఉండాలి.
» **వయసు:** ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు 9 నుంచి 11 ఏళ్ల మధ్య; ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు 9 నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఆదాయ పరిమితి:** విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదు.
» **ప్రవేశ పరీక్ష:** ప్రవేశ పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఓఎంఆర్ షీట్ విధానంలో 50 మార్కులకు ఉంటుంది.ప్రశ్నపత్రం తెలుగు/ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. తెలుగు(10 మార్కులు), ఇంగ్లిష్(10 మార్కులు),గణితం(15 మార్కులు), పరిసరాల విజ్ఞానం(15 మార్కులు)సబ్జెక్టుల్లో నాలుగో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు.
» **ఎంపిక విధానం:** అర్హులైన అభ్యర్థులకు ప్రవేశపరీక్షలో ప్రతిభ,రిజర్వేషన్, ప్రత్యేక కేటగిరీ(అనాథ/మత్స్యకార)ఆధారంగా సీటు కేటాయిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.04.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 16.04.2023.
» **వెబ్‌సైట్:** www.mjpapbcwreis.apcfss.in

ఏపీఈసెట్-2023

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి(ఏపీఎస్సీహెచ్‌ఈ).. ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీ ఈసెట్)-2023 నోటిఫికేషన్ విడుదలచేసింది. దీని ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ(మ్యాథమేటిక్స్) అభ్యర్థులకు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈ/బీటెక్/బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ విధానంలో రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు.ఈ పరీక్షను కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూకే) నిర్వహిస్తోంది.

» **కోర్సులు:** బీఈ/బీటెక్/బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ. » **అర్హత:**పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ(మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణులవ్వాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.03.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.04.2023.
» **పరీక్ష తేది:** 05.05.2023.
» **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

ఒత్తిడి జయిస్తే.. విజయమే!!

» త్వరలో ఇంటర్, పదో తరగతి పరీక్షలు
» ఆ వెంటనే పలు ఎంట్రన్స్ టెస్టులు
» పరీక్షల ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులు
» కొద్దిపాటి చిట్కాలతో ఒత్తిడిని జయించే అవకాశం



అకడమిక్ పరీక్షలు.. ప్రవేశ పరీక్షలు. ఎగ్జామ్ ఏదైనా..టాప్ మార్కులు సాధించాలని విద్యార్థులు తీవ్రంగా శ్రమిస్తుంటారు! ముఖ్యంగా పరీక్షల సీజన్ మొదలైందంటే.. రేయింబవళ్లు, నిద్రాహారాలు మాని పుస్తకాలే ప్రపంచంగా గడిపేస్తుంటారు. దీంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్న పరిస్థితి! చదివిన అంశాలను గుర్తుంచుకోవడం ఎలా.. పరీక్ష హాల్లో గుర్తుకొస్తాయా.. పరీక్షసరిగా రాయగలనా.. ఇలాంటి ప్రతికూల ఆలోచనలతో మరింత ఆందోళన!! కొద్దిపాటి చిట్కాలతో ఒత్తిడిని జయించి.. పరీక్షల్లో విజయం సాధించొచ్చు అంటున్నారు నిపుణులు. తెలుగు రాష్ట్రాల్లో త్వరలో ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు, ఆ తర్వాత ప్రవేశ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. విద్యార్థులు ఒత్తిడిని జయించి.. పరీక్షల్లో విజేతగా నిలిచేందుకు నిపుణుల సలహాలు..

- అకడమిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు, గ్రేడ్స్ సాధించాలి. అప్పుడే భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు దక్కుతాయి!
- ఎంట్రన్స్ టెస్టులలో బెస్ట్ ర్యాంకు సొంతం చేసుకోవాలి. అప్పుడే ఆశించిన కోర్సుల్లో, కోరుకున్న ఇన్‌స్టిట్యూట్‌లో అడ్మిషన్ లభిస్తుంది.
- నేటి విద్యార్థి లోకంలో ఇలాంటి ఆలోచనలే ఎక్కువ!! ఫలితంగా నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతూ ఒత్తిడికి గురవుతున్నారు. ఫలితంగా సబ్జెక్ట్స్‌లో పొందిన నైపుణ్యాన్ని, పరిజ్ఞానాన్ని పరీక్ష సమయంలో ప్రదర్శించలేక నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు. దీనికి కారణం.. ఎగ్జామ్ ఫోబియా అనేది నిపుణుల అభిప్రాయం. ఈ భయాన్ని అధిగమిస్తే.. ఎలాంటి ఒత్తిడి, ఆందోళన లేకుండా పరీక్షలు రాసి విజయం సాధించొచ్చు అంటున్నారు.

ఆత్మవిశ్వాసమే అలంబనగా

పరీక్షలంటే భయపడుతూ ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు.. దాన్ని అధిగమించేందుకు తొలి సాధనం.. ఆత్మవిశ్వాసం! దీనికోసం స్వీయ సామర్థ్యంపై నమ్మకం పెంచుకోవాలని సూచిస్తున్నారు. పరీక్షల్లో పోటీ గురించి తీవ్రంగా ఆలోచించడం, సహచరులతో పోల్చుకోవడం వంటివి ఒత్తిడి పెంచుతాయి. అందుకే ముందుగా విద్యార్థులు పరీక్షల గురించి అతిగా ఆలోచించడం మానేయాలి అంటున్నారు నిపుణులు. మానసిక వైద్యుల అభిప్రాయం ప్రకారం-పోటీ,పోల్చుకోవడం..ఇవి రెండు విద్యార్థుల ఒత్తిడికి ప్రధాన కారణాలు! కాబట్టి విద్యార్థులు సహచరులతో పోల్చుకోవడం కంటే తమ సామర్థ్యాలపై నమ్మకం పెంచుకుంటే సగం ఒత్తిడిని జయించినట్లే!!

ఫలితం గురించి ఆలోచనలు

ఆయా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల స్ట్రెస్‌కు మరో ప్రధాన కారణం.. ఫలితం గురించి ఆందోళన చెందడం! ఇది ఎంత మాత్రం సరికాదని మానసిక నిపుణులు అంటున్నారు. ప్రిపరేషన్ సమయంలో ఫలితం గురించి ఆందోళన చెందకుండా.. సబ్జెక్ట్‌ను అవగాహన చేసుకోవడంపైనే దృష్టిపెట్టాలని సూచిస్తున్నారు. చదవాల్సిన సిలబస్ అంశాలను క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేస్తూ ముందుకు సాగాలి. అలా కాకుండా ఫలితం ఎలా ఉంటుందో.. టాప్ మార్కులు వస్తాయో లేదో అంటూ ఆందోళన చెందితే.. చదివింది కూడా మరిచిపోయే ప్రమాదం ఉంది. అది చివరకు ఫలితంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి ప్రిపరేషన్ సమయంలో విద్యార్థులు పరీక్ష ఫలితాలు,భవిష్యత్తు పరిణామాల గురించి ఆలోచించడం సరికాదన్నది నిపుణుల సలహా!

ప్రాధాన్యత క్రమం

పరీక్షల ఒత్తిడిని జయించేందుకు ఉపయోగపడే మరో మార్గం.. ప్రాధాన్యత క్రమంలో సిలబస్‌ను పూర్తి చేయడం. విద్యార్థులు తొలుత తాము చదవాల్సిన అంశాలను ప్రాధాన్యత క్రమంలో అంటే పరీక్ష కోణంలో అతి ముఖ్యమైనవి, ముఖ్యమైనవి, ఓ మాదిరిగా చదవాల్సినవి.. ఇలా ఒక జాబితా రూపొందించుకోవాలి. వీటితో డైలీ లేదా వీక్లీ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. వీలైతే వాటిని డైరీలోనో లేదా తమకు నిత్యం కనిపించే విధంగా వాల్ క్యాలెండర్‌లోనో నోట్ చేసుకోవాలి. చాలామంది విద్యార్థులు ప్రాధాన్యత క్రమం పాటించక.. అన్ని అంశాలు చదవాలనే ఆదుర్దాలో ఆందోళనకు గురవుతుంటారు. ఉదాహరణకు ఒక రోజు చదవాల్సిన నాలుగు లేదా అయిదు అంశాల్లో.. మొదట ముఖ్యమైన రెండు టాపిక్స్‌పై దృష్టిపెట్టి సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత మిగతా టాపిక్స్ వేగంగా పూర్తిచేసే ప్రయత్నం చేయాలి.

తొలుత తేలికైనవి

విద్యార్థులు తాము చదవాల్సిన టాపిక్స్‌ను ఈజీ (తేలికైనవి)..మోడరేట్(మధ్యస్థం).. డిఫికల్ట్(క్లిష్టమైనవి).. అనే మూడు విభాగాలుగా వర్గీకరించుకోవాలి. తొలుత తేలికైన అంశాలతో ప్రిపరేషన్ ప్రారంభించాలి. ఫలితంగా మిగతా రెండు విభాగాలను (మోడరేట్, డిఫికల్ట్) ఎదుర్కొనే ముందస్తు సంసిద్ధత లభిస్తుంది. ఇలా కాకుండా.. పరీక్ష కోణంలో ముఖ్యమైనవి అనే భావనతో ఇష్టం లేకున్నా.. కష్టమైన అంశాలతో ప్రిపరేషన్ ప్రారంభిస్తే ఒత్తిడి మరింత పెరుగుతుంది.

ప్రశాంత వాతావరణం

ఆయా పరీక్షలకు ప్రిపరేషన్ సాగించే క్రమంలో.. పరిసరాల ప్రభావం కూడా ఎంతో ఉంటుంది. కాబట్టి విద్యార్థులు తాము చదివే గది వాతావరణం, పరిసరాలు ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. గదిలో టీవీ, కంప్యూటర్ వంటివి లేకుండా చూసుకోవాలి. అదే విధంగా.. బయటి నుంచి ఎలాంటి శబ్దాలు వినిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దీంతోపాటు సహజమైన గాలి, వెలుతురు వచ్చే ప్రాంతంలో కూర్చుంటే.. మానసికంగా, శారీరకంగా ఆహ్లాదకరంగా ఉండడమే కాకుండా.. ప్రశాంతంగా ప్రిపరేషన్ సాగించే వీలుంటుంది.

రిలాక్సేషన్ టెక్నిక్స్

పరీక్షలంటే ఒత్తిడి, ఆందోళనకు గురయ్యే విద్యార్థులు..రిలాక్సేషన్ టెక్నిక్స్ పాటించడం మేలు చేస్తుంది. వాస్తవానికి క్లిష్టమైన అంశాలు చదువుతున్నప్పుడు.. లేదా అప్పటికే చదివిన విషయాలు గుర్తుకురానప్పుడు ఒత్తిడికి గురవుతుంటారు. ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు విద్యార్థులు ఉపశమన చిట్కాలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. టెన్షన్‌కు గురవుతున్న భావన కలిగిన వెంటనే పుస్తకాలను కొద్దిసేపు పక్కనపెట్టేయాలి. తమకు ఇష్టమైన సంగీతం, పాటలు వినడం, లేదా యోగా, మెడిటేషన్, గార్డెనింగ్ వంటివి చేయాలి. కొంతమంది టీవీ చూస్తుంటారు. అలాంటి విద్యార్థులు టీవీల్లో ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. డిస్కషన్స్, డిబేట్స్ వైపు దృష్టి పెట్టకూడదు. ఇవి కొంత ఉద్రేకపూరిత వాతావరణంలో సాగుతాయి. ఇలాంటివి చూడటం వల్ల మరింత టెన్షన్ తప్పితే, దానివల్ల ఫలితం ఉండదు.

సానుకూల దృక్పథం

పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు పూర్తిగా సానుకూల దృక్పథంతో అడుగులు వేయాలి. ముఖ్యంగా తమ చుట్టూ ప్రతికూల వాతావరణం లేకుండా చూసుకోవాలి. ప్రతికూల ధోరణితో ఉండే వ్యక్తులకు దూరంగా ఉండడం ఎంతో ముఖ్యం. దీంతోపాటు తాము గతంలో సాధించిన ఫలితాల నుంచి స్ఫూర్తి పొందాలి. ఒత్తిడికి గురైన సందర్భంలో.. తాము గతంలో సాధించిన విజయాలను గుర్తు చేసుకోవాలి. ఫలితంగా తాము హాజరు కాబోతున్న పరీక్షలో మెరుగ్గా రాణించగలమనే మానసిక ధీమా లభిస్తుంది. తమ సబ్జెక్ట్ నైపుణ్యాలపై నమ్మకం పెరుగుతుంది. ఎలాంటి ఆందోళన లేకుండా ఏకాగ్రతతో ప్రిపరేషన్ సాగించేందుకు వీలవుతుంది.

పరీక్ష రోజుకు సిద్ధంగా

కీలకమైన పరీక్ష రోజు చూపే ప్రతిభే భవిష్యత్తును నిర్దేశిస్తుందని గుర్తించాలి. వాస్తవానికి చాలా మంది పరీక్ష రోజున అనవసర ఆందోళనకు గురవుతారు. దీంతో కొశ్చన్ పేపర్ చేతిలోకి రాగానే అలసటకు లోనవుతారు. దీనికి పరిష్కారంగా పరీక్ష హాల్లోకి వీలైనంత ముందుగా ప్రవేశించాలి. అక్కడి వాతావరణానికి అలవాటు పడాలి. పరీక్షకు వెళ్లేందుకు అవసరమైన హాల్‌టికెట్, ఇతర పత్రాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఫలితంగా చివరి క్షణంలో ఆందోళన నుంచి విముక్తి లభిస్తుంది.

యోగా.. ధ్యానం

ఒత్తిడి నివారణలో యోగా, ధ్యానం అద్భుత సాధనాలని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతి రోజు కొద్దిసేపు మెడిటేషన్ చేయడం ద్వారా ఒత్తిడిని ఎదుర్కొనే సంసిద్ధత లభిస్తుందని చెబుతున్నారు. కాబట్టి విద్యార్థులు ప్రతిరోజు కొంత సమయం యోగా, ధ్యానం వంటి వాటికి కేటాయించాలి.

ఒత్తిడిని జయించడానికి ముఖ్య సూచనలు

- ప్రతిరోజు దినచర్యను తమకు ఇష్టమైన వ్యాపకంతో ప్రారంభించాలి. • రోజూ కొద్దిసేపు యోగా, నడక, వ్యాయామం వంటివి చేయాలి.
- చదవాల్సిన అంశాల జాబితాను ముందుగానే రూపొందించుకోవాలి.
- విసుగు, కోపం, ఆవేదన, నిరాశ నిస్పృహలకు దూరంగా ఉండాలి.
- ఇతరుల విజయాలను చూసి ఆందోళన చెందకూడదు. వారు విజయం సాధించిన తీరుపై సానుకూల దృక్పథంతో సలహాలు స్వీకరించాలి.
- డెడ్‌లైన్స్,లాస్ట్ మినిట్ వరకు వేచి చూడకుండా.. ముందుగానే ప్రీ ప్లాన్ అప్రోచ్ అనుసరించాలి.
- ప్రతి రోజు తప్పనిసరిగా కనీసం ఆరు గంటలు నిద్రకు కేటాయించాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
671	177
59,135	17,413

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	11,139	▽	199
డోజోన్స్	31,910	▽	345
ఎఫ్‌టీఎస్ఈ 100	7,748	▽	132
డాక్స్	15,428	▽	205
షాంఘై	3,230	▽	46
నికాయ్	28,144	▽	479

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.38	83.05
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	96.38	99.64
€	యూరో	ఎస్‌బీఐ	85.60	88.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.23	61.15
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.93	55.28
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.68	61.62
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.88	22.55
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.44	23.23
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.69	12.76

వైవిధ్యమే పెట్టుబడులకు రక్ష!

అన్నీ ఒకే చోట ఉంటే రిస్క్

- ఈక్విటీ, డెట్, బంగారం మంచి కలయిక
- వీటితో మెరుగైన రాబడులు
- కాల వ్యవధి, రిస్క్ ధోరణి ఆధారంగా ఎంపిక
- ఈక్విటీలకు ఎక్కువ కేటాయింపులు అవసరం

రిటైల్ ఇన్వెస్టర్లలో చాలా మందికి పరుగెత్తే కుందేలు అంటేనే ఇష్టం. తాబేలు వైపు చూసేది చాలా కొద్ది మందే. కానీ, అడవి అన్న తర్వాత అన్ని జంతువులకూ నీడనిచ్చిన మాదిరే.. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్లోనూ ఒకటికి మించిన సాధనాలకు చోటు కల్పించాలి. ఇక్కడ కుందేలు అంటే ఈక్విటీ మార్కెట్. తాబేలు అంటే డెట్, గోల్డ్ అని చెప్పుకోవచ్చు. దీర్ఘకాలంలో ఈక్విటీలలో వచ్చినంత రాబడి మరే సాధనంలోనూ ఉంటుందని చెప్పలేం. కానీ, అన్ని కాలాలకూ, పెట్టుబడులు అన్నింటికీ ఈక్విటీ ఒక్కటే వేదిక కాకూడదు. ఏదైనా సంక్షోభం ఎదురైతే.. వేరే సాధనంలోని పెట్టుబడులు కొంత రక్షణనిస్తాయి. ఇన్వెస్టర్లు తమ రిస్క్ సామర్థ్యం ఆధారంగా ఈక్విటీతోపాటు ఇతర సాధనాల మధ్య కూడా కొంత పెట్టుబడులను వైవిధ్యంగా చేసుకోవాలి. అప్పుడే పెట్టుబడుల ప్రయాణం సాఫీగా సాగుతుంది. ఈ వివరాలన్నీ తెలియజేసే కథనమిది...



ఈక్విటీ, డెట్ మార్కెట్లలో గతేడాది నుంచి అస్థిరతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ఏడాది దాటిపోయింది. అన్ని దేశాలూ ద్రవ్యోల్బణ రిస్కును ఎదుర్కొంటున్నాయి. కంపెనీల మార్జిన్లపై దీని ప్రభావం గణనీయంగానే ఉంది. ద్రవ్యోల్బణాన్ని కిందకు దించేందుకు సెంట్రల్ బ్యాంకులు వడ్డీ రేట్ల పెంపు ఆయుధాన్ని నమ్ముకున్నాయి. మన దగ్గరా గతేడాది మే నుంచి రెపో రేటు 2.5 శాతం పెరిగింది. అమెరికా, యూరప్ మాంద్యం ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఐటీ రంగంలో ఉద్యోగాలకు కోతలు పడుతున్నాయి. ఒకవైపు ఈక్విటీ, డెట్ మార్కెట్లు ఆటుపోట్లు చూస్తుంటే.. మరోవైపు బంగారం, వెండి గడిచిన ఏడాది కాలంలో మంచి ర్యాలీని చూశాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇన్వెస్టర్లకు మెరుగైన పెట్టుబడుల విధానమే అస్సెట్ అలోకేషన్. అంటే ఒకే విభాగం కాకుండా, ఒకటికి మించిన సాధనాల మధ్య పెట్టుబడులను వర్గీకరించుకోవడం. ఒక్కో విభాగం ఒక్కో రీతిలో పనితీరు చూపిస్తుంటుంది. కనుక అస్సెట్ అలోకేషన్‌తో దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాన్ని చూడొచ్చు. అంతేకాదు పోర్ట్‌ఫోలియో రిస్కును (ఒక్క బాక్సులోనే అన్ని గుడ్లు పెట్టడం)ను తగ్గించుకోవచ్చు. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)కూడా పెట్టుబడుల వైవిధ్యానికి అందుబాటులో ఉన్న సాధనాలు. గత పదిహేనేళ్ల కాలంలో వివిధ సాధనాలు ఎలా పనిచేశాయి? వైవిధ్యం ఏ విధంగా నష్టాలను పరిమితం చేసి, మెరుగైన రాబడులు ఇచ్చిందన్నది అర్థం చేసుకోవాలంటే కొన్ని గణాంకాలను విశ్లేషించుకోవాల్సిందే.

పనితీరు ఇలా..

2006 నుంచి 2022 వరకు డేటాను పరిశీలిస్తే.. ఈక్విటీ, డెట్, గోల్డ్, వెండి ఎలా ర్యాలీ చేసిందీ తెలుస్తుంది. 2006లో ఈక్విటీ 41.9 శాతం, 2007లో 56.8 శాతం చొప్పున ర్యాలీ చేసింది. డెట్ ఆ రెండు సంవత్సరాల్లో ఒకే అంకె రాబడులను ఇచ్చింది. బంగారం స్వల్పంగా లాభాలను ఇచ్చింది. అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం ప్రభావంతో 2008లో ఈక్విటీ మార్కెట్ 51 శాతం పడిపోయింది. కానీ, బంగారం అదే ఏడాది 26.1 శాతం ర్యాలీ చేసింది. 2011లో యూరోజోన్ సంక్షోభం తలెత్తింది. దీంతో ఈక్విటీ మార్కెట్ 23.8 శాతం పడిపోయింది. కానీ, బంగారం 31.7 శాతం రాబడులను ఇచ్చింది. డెట్‌లో రాబడి 8 శాతంగా ఉంది. అంతెందుకు కరోనా సంవత్సరం 2020లోనూ ఈక్విటీ మార్కెట్ 50 శాతం వరకు పడిపోగా, అంతే వేగంగా రికవరీ అయి, ఆ ఏడాది నికరంగా 16%రాబడినిచ్చింది. అదే ఏడాది బంగారం 28% రాబడులను ఇచ్చింది. 2021లో బంగారం నికరంగా నష్టాలను మిగల్చితే.. ఈక్విటీలు రాబడులు మెరుగ్గా ఉన్నాయి. ఇక్కడి గణాంకాలను పరిశీలిస్తే, అన్ని సాధనాలు ఒకే తీరులో కాకుండా.. భిన్న సమయాల్లో భిన్నమార్గంలో చలిస్తున్నట్టు అర్థం చేసుకోవచ్చు. అందుకనే పోర్ట్‌ఫోలియోలో వీటన్నింటికీ చోటు ఇవ్వాలని చెప్పేది. ఇక్కడ బంగారం రాబడికి ఎంసీఎక్స్, బాండ్ల పనితీరునకు క్రిసిల్ షార్ట్ టర్మ్ ఇండెక్స్ గణాంకాలను పరిగణనలోకి తీసుకోవడం జరిగింది.

పెట్టుబడుల మిశ్రమం

వైవిధ్యం కోసం ఈక్విటీలకు తోడుగా ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల (డెట్) వరకే పరిమితం కాకూడదు. ఈక్విటీ, డెట్‌కు తోడు బంగారం కూడా జోడించుకోవడం మెరుగైన విధానమని చెప్పుకోవచ్చు. కేవలం ఈక్విటీ, డెట్‌తో కూడిన పోర్ట్‌ఫోలియోతో పోలిస్తే, ఈక్విటీ, డెట్, గోల్డ్‌తో కూడిన పోర్ట్‌ఫోలియోలోనే మెరుగైన రాబడులు ఉన్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. 2002 నుంచి 2022 వరకు ఈ సాధనాల్లో మూడేళ్ల రోలింగ్ రాబడులను గమనించినట్టయితే.. 65:35 నిష్పత్తిలో ఈక్విటీ, డెట్ పోర్ట్‌ఫోలియో 67.2 శాతం సమయంలో 10 శాతానికి పైగా వార్షిక రాబడులను ఇచ్చింది. అదే 65:20:15 నిష్పత్తిలో ఈక్విటీ, డెట్, గోల్డ్ పోర్ట్‌ఫోలియో మాత్రం 71.7% కాలంలో 10 శాతానికి పైనే రాబడులను ఇచ్చింది. కానీ, గత 20 ఏళ్ల కాలంలో ఈక్విటీ, డెట్ పోర్ట్‌ఫోలియో వార్షిక రాబడి 14.3 శాతంగా ఉంటే, ఈక్విటీ, డెట్, గోల్డ్‌తో కూడిన పోర్ట్‌ఫోలియోలో రాబడి 15.4 శాతం చొప్పున ఉంది. ఈక్వటీ, డెట్‌కు బంగారాన్ని జోడించుకోవడం వల్ల ఒక శాతం అదనపు రాబడులు కనిపిస్తున్నాయి. మల్టీ అస్సెట్ పోర్ట్‌ఫోలియో రిస్కును అధిగమించి దీర్ఘకాలంలో మెరుగైన రాబడులను ఇచ్చాయి. మిశ్రమ పోర్ట్‌ఫోలియో వల్ల మూడేళ్లకు మించిన కాలంలో ప్రతికూల రాబడులకూ అవకాశం దాదాపుగా ఉండదు. గత ఐదేళ్లలో మల్టీ అస్సెట్ పథకాలు, అగ్రెస్సివ్ హైబ్రిడ్ లేదా డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ మెరుగైన పనితీరు చూపించాయి.





ఎంత చొప్పన..

అస్సెట్ అలోకేషన్ విషయంలో ఏ సాధనానికి ఎంత పెట్టుబడులు కేటాయించాలన్నది ముఖ్యమైన అంశం అవుతుంది. ఇది ఇన్వెస్టర్ రిస్క్ సామర్థ్యం, పెట్టుబడుల కాలం, రాబడుల అంచనాల ఆధారంగా నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. అందరికీ ఒక్కటే ప్రామాణిక సూత్రం పనిచేయదు. యుక్త వయసులో ఉన్న వారు ఈక్విటీలకు ఎక్కువ కేటాయింపులు చేసుకోవాలి. వయసు పెరుగుతున్న కొద్దీ ఈక్విటీలకు కేటాయింపులు తగ్గుతూ వెళ్లాలి. అదే సమయంలో డెట్, గోల్డ్‌కు కేటాయింపులు పెంచుకుంటూ వెళ్లాలి. రిటైర్మెంట్ తర్వాత కూడా కొంత మేర పెట్టుబడులు ఈక్విటీల్లోనే ఉండాలి. అప్పుడే ద్రవ్యోల్బణం నుంచి పెట్టుబడులకు రక్షణతోపాటు, మెరుగైన రాబడులను సొంతం చేసుకోవడానికి వీలుంటుంది. 100 నుంచి ఇన్వెస్టర్ తన వయసును తీసివేయగా, మిగిలేంత ఈక్విటీలకు కేటాయించుకోవచ్చన్నది ఒక సూత్రం. ఉదాహరణకు 30 ఏళ్ల ఇన్వెస్టర్ 70 శాతాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈక్విటీలకు తప్పనిసరిగా మెజారిటీ పెట్టుబడులు కేటాయించుకోవడం అవసరం. దీర్ఘకాలంలో (7 ఏళ్లకు మించి) ఈక్విటీలు సగటున రెండంకెల రాబడులను ఇచ్చాయి. ఇక ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలు (డెట్) స్థిరమైన రాబడులకు మార్గం అవుతుంది. వైవిధ్యంతోపాటు, నష్టాలకు అవకాశం ఉండదు. బంగారం అన్నది ద్రవ్యోల్బణానికి హెడ్జింగ్‌గా అనుకూలిస్తుంది. ఈక్విటీలు ప్రతికూలతలు ఎదుర్కొంటున్న సందర్భాల్లో అండగా నిలిచే సాధనం ఇది. బంగారం కేవలం హెడ్జింగ్ కోసమే కాకుండా, దీర్ఘకాలంలో డెట్‌కు మించి రాబడులను ఇవ్వగలదని గణాంకాలు చెబుతున్నాయి. 2006 నుంచి 2012 మధ్య కాలంలో రెండంకెల వార్షిక రాబడులను ఇచ్చింది. కానీ, ఆ తర్వాత 2013 నుంచి 2015 వరకు నష్టాలను ఎదుర్కొన్నది. ఇక వెండి అన్నది పారిశ్రామిక కమోడిటీ. ఎలక్ట్రానిక్స్, బ్యాటరీలు, స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ ప్యానెళ్లలో దీని అవసరం ఉంటుంది. ఈ రంగాలు వృద్ధి చెందే కొద్దీ వెండికి డిమాండ్ పెరుగుతుంది. ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరు చూపిస్తున్న దశలో వెండికి డిమాండ్ పెరుగుతుంది. ఒకవేళ వెండిలోనూ ఇన్వెస్ట్ చేయాలనే ఆసక్తి ఉంటే సిల్వర్ ఈటీఎఫ్‌లకు 5 శాతం లోపు కేటాయింపులను పరిశీలించొచ్చు. బంగారం కోసం సావరీన్ గోల్డ్ బాండ్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. భౌతిక బంగారం మెరుగైన పెట్టుబడి సాధనం కాబోదు. నేరుగా ఇన్వెస్ట్ చేసుకునే ఆసక్తి లేకపోయినా లేదా అంత పరిజ్ఞానం లేకపోయినా నిరాశ పడక్కర్లేదు. మార్కెట్లో మెరుగైన మల్టీ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ ఉన్నాయి. ఇన్వెస్టర్లు వీటిల్లో ఇన్వెస్ట్ చేసుకోవడాన్ని పరిశీలించొచ్చు. మల్టీ అస్సెట్ పథకాలు చాలా వరకు ఈక్విటీ, డెట్, బంగారానికి 65:20:15 నిష్పత్తిలో పెట్టుబడులు కేటాయిస్తుంటాయి. ఈ విభాగంలో ఐసీఐసీఐ మల్టీ అస్సెట్ అలోకేషన్, హెచ్‌డీఎఫ్‌సీ మల్టీ అస్సెట్, ఎస్‌బీఐ మల్టీ అస్సెట్ తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయి.

నేటితో ముగియనున్న యస్ బ్యాంక్ షేర్ల లాకిన్

అమ్మకాలు వెల్లువెత్తవచ్చని అంచనాలు

ముంబై: ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ షేర్ల మూడేళ్ల లాకిన్ వ్యవధి సోమవారంతో ముగియనుంది. దీంతో మార్కెట్లో భారీ అమ్మకాలు వెల్లువెత్తవచ్చని భావిస్తున్నారు. 2020 మార్చిలో యస్ బ్యాంక్‌లో దాదాపు 49 శాతం వాటాలు కొనుగోలు చేసిన తొమ్మిది బ్యాంకులు తాజాగా షేర్లను అమ్ముకుని నిష్క్రమించేందుకు ప్రయత్నించవచ్చని అంచనా. వ్యక్తిగత ఇన్వెస్టర్లకు (రిటైల్, సంపన్న వర్గాలు, ప్రవాస భారతీయులు) చెందిన 135 కోట్ల షేర్లు, ఈటీఎఫ్‌లకు చెందిన 6.7 కోట్ల షేర్లు లాకిన్ అయి ఉన్నాయి. 2022 డిసెంబర్ ఆఖరు నాటికి ఎస్‌బీఐకి 605 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్.. ఐసీఐసీఐ బ్యాంకులకు తలో 100 కోట్ల షేర్లు ఉన్నాయి. నిర్వహణపరమైన అవకతవకలతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన యస్ బ్యాంకును 2020 మార్చిలో రిజర్వ్ బ్యాంక్ తన చేతుల్లోకి తీసుకుంది. ఆ తర్వాత రూపొందించిన ప్రణాళిక ప్రకారం తొమ్మిది బ్యాంకులు తలో రూ. 10,000 కోట్లు సమకూర్చడం ద్వారా వాటాలు తీసుకుని యస్ బ్యాంక్‌ను నిలబెట్టాయి. అలా తీసుకున్న వాటాల్లో 75 శాతం షేర్లను మూడేళ్ల వరకూ విక్రయించకుండా లాకిన్ విధించారు. ఇతర ఇన్వెస్టర్లకూ ఇదే నిబంధన వర్తింపచేశారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-3-2023	
విశాఖ	435-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	426-00
విజయవాడ	426-00
రిటైల్ ధర (డజను)	66.00
12-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.85

రూ.20 లక్షల ఇన్వెస్ట్‌మెంట్ ఎలా..?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నూతన పన్ను విధానం ప్రకారం ఈక్విటీల్లో దీర్ఘకాల మూలధన లాభాల పన్నును ఎలా పరిగణిస్తారు?
– హుస్సేన్, హైదరాబాద్

నూతన పన్ను విధానంలోనూ ఈక్విటీలు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ విక్రయంపై వచ్చే దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్షపై పన్ను లేదు. రూ.లక్షకు మించిన లాభంపైనే 10 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. నూతన పన్ను విధానాన్ని ఎన్నో తగ్గింపులు, మినహాయింపులను తొలగించి ప్రవేశపెట్టారు. అయినప్పటికీ ఈక్విటీలు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాల మూలధన లాభాల పన్ను ప్రయోజనాన్ని కొత్త విధానంలో తొలగించలేదు. సెక్షన్ 112ఏ కింద క్లెయిమ్ చేసుకోవచ్చు.

నేను రూ.20 లక్షలు ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఐదు నుంచి పదేళ్ల వరకు ఈ పెట్టుబడులు కొనసాగించగలను. ఈ కాలానికి ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి.
– దుర్గాజ్యోతి, అమలాపురం

మీ ప్రశ్నకు మ్యూచువల్ ఫండ్స్ సులభ సమాధానం అవుతుంది. రిటైల్ ఇన్వెస్టర్లు మంచి రాబడులను సమకూర్చుకునేందుకు వారి ముందు అందుబాటులో ఉన్న ఎంపిక మ్యూచువల్ ఫండ్స్. మీరు చెప్పిన కాలానికి ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మంచి ఆప్షన్ అవుతుంది. దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణ ప్రభావాన్ని (కరెన్సీ విలువను హరించేది) మించి రాబడులను ఇవ్వగలవు. స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు రిటైల్ ఇన్వెస్టర్లకు మ్యూచువల్ ఫండ్స్ మార్గం సులభమైనది. ఇప్పుడు ఏ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలన్న ప్రశ్న ఎదురవుతుంది. మొదటి సారి మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నట్టు అయితే, అటువంటి ఇన్వెస్టర్లకు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ అనుకూలం. ఇవి 70 శాతం పెట్టుబడులు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. మిగిలిన 30 శాతం మేర డెట్‌లో పెట్టుబడులు పెడతాయి. ఈక్విటీ పెట్టుబడుల ఆప్షన్‌తో మెరుగైన రాబడులను ఇవి ఇవ్వగలవు. డెట్‌లో పెట్టుబడులు మార్కెట్ అస్థిరతలను ఎదుర్కొనేందుకు రక్షణగా నిలుస్తాయి. ఈక్విటీ మార్కెట్లు పడిపోయినప్పుడు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లోనూ అనిశ్చితులు కనిపిస్తాయి. కాకపోతే అచ్చమైన ఈక్విటీ పథకాలతో పోలిస్తే ఈ క్షీణత అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లో తక్కువగా ఉంటుంది. ఒకవేళ ఈక్విటీ పెట్టుబడుల పట్ల అవగాహన ఉంటే ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఇప్పుడు మీరు రూ.20 లక్షలను తీసుకెళ్లి ఒకే విభాగంలో పెట్టేస్తారా..? అలా చేయకూడదు. ఎందుకంటే ఈక్విటీలు స్వల్పకాలంలో ఎంతో అస్థిరతల మధ్య చలిస్తుంటాయి. కనుక పెట్టుబడులన్నింటికీ ఒకే చోట ఇన్వెస్ట్ చేసినట్టయితే, ఆ తర్వాత మార్కెట్ పతనాన్ని చూస్తే పెట్టుబడుల విలువ గణనీయంగా తగ్గిపోతుంది. కనుక ఒకేసారి ఇన్వెస్ట్ చేయకుండా కొంత కాలానికి క్రమంగా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాలి. దీనివల్ల కొనుగోలు వ్యయం సగటుగా మారుతుంది. అనుకూలంగా లేని సమయంలో మార్కెట్లోకి ప్రవేశించే రిస్క్ కూడా తగ్గుతుంది. మీరు ఈక్విటీల్లో పెట్టుబడులను 12–18 నెలల కాలంలో క్రమంగా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాలి. ఏ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలో మీరు తెల్చుకోలేనప్పుడు మా అనలిస్టుల ఎంపిక జాబితాను పరిశీలించొచ్చు.

స్టార్టప్‌లకు ఎస్‌వీబీ సెగ

- తక్షణ అవసరాలకు నిధులపై ప్రభావం
- రిస్కులో 1 లక్ష ఉద్యోగాలు
- సమస్య స్వల్పకాలికమైనదే కావచ్చని పరిశీలకుల అభిప్రాయం



న్యూఢిల్లీ: సిలికాన్ వేలీ బ్యాంక్ (ఎస్‌వీబీ) మూసివేత వల్ల దానితో ముడిపడి ఉన్న అంకుర సంస్థల్లో ఆందోళన నెలకొంది. తక్షణ ఆర్థిక అవసరాలకు కావాల్సిన నిధుల కోసం అవి వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎస్‌వీబీలో డిపాజిట్లు ఉన్న దాదాపు 10,000 చిన్న సంస్థలు .. వచ్చే 30 రోజుల్లో తమ ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలో విఫలమయ్యే అవకాశం ఉందని అమెరికా ప్రభుత్వానికి సమర్పించిన పిటీషన్‌లో వై కాంబినేటర్ (వైసీ) తెలిపింది. దీని వల్ల 1 లక్ష పైగా ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం పడనున్నట్లు పేర్కొంది. ఇలాంటి పరిణామాలు తలెత్తకుండా కట్టడి చేయకపోతే .. యావత్ అమెరికా టెక్నాలజీ పరిశ్రమపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. 3,500 మంది పైచిలుకు సహ వ్యవస్థాపకులు, సీఈవోలు, రెండు లక్షల మంది పైగా స్టార్టప్ సంస్థల ఉద్యోగులు ఈ పిటీషన్‌పై సంతకం చేశాయి. వీటిలో పేవో, సేవ్ఇన్, శాలరీబుక్ వంటి భారతీయ సంస్థలు కూడా ఉన్నాయి. ఇన్‌క్యుబేటర్ సంస్థ అయిన వై కాంబినేటర్ కమ్యూనిటీలోని మూడో వంతు స్టార్టప్‌లకు ఎస్‌వీబీలో మాత్రమే ఖాతాలు ఉన్నాయి. ఎస్‌వీబీలో భారీగా డిపాజిట్లు ఉన్న కొన్ని బడా టెక్ సంస్థలకు (వై కాంబినేటర్‌తో సంబంధమున్నవి) అమెరికాతో పాటు భారత్‌లోనూ కార్యకలాపాలు ఉన్నాయని ఫిన్‌టెక్ కంపెనీ రికర్ క్లబ్ సీఈవో ఏకలవ్య గుప్తా తెలిపారు. దేశీయంగా గిఫ్ట్ సిటీలో అకౌంట్లు తెరిచేందుకు ఆయా స్టార్టప్‌లకు తాము సహాయం అందిస్తున్నట్లు వివరించారు. మరోవైపు, గతంలోలాగా ఎస్‌వీబీని ప్రభుత్వం బెయిలవుట్ చేయబోదని అమెరికా ఆర్థిక మంత్రి జేనెట్ యెలెన్ స్పష్టం చేశారు. అయితే, డిపాజిటర్లందరికీ వారి సొమ్ము తిరిగి అందేలా చూసేందుకు చర్యలపై కసరత్తు చేస్తున్నామని తెలిపారు. 15 ఏళ్ల క్రితం నాటి ఆర్థిక సంక్షోభానికి నేటి పరిస్థితులకు వ్యత్యాసం ఉందని, అప్పటితో పోలిస్తే ఇప్పుడు అమెరికా బ్యాంకింగ్ వ్యవస్థ మరింత పటిష్టంగా ఉందని చెప్పారు.

సత్వర టేకోవర్‌కు ఆస్కారం..

ఈ సమస్య స్వల్పకాలికమైనదే కావచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. క్లయింట్ల సొమ్మును తిరిగిచ్చేందుకు సరిపడేంత అసెట్లు ఎస్‌వీబీ దగ్గర ఉండటంతో పాటు, పలు ప్రముఖ సంస్థల ఖాతాలూ ఉన్న నేపథ్యంలో బ్యాంకును సత్వరమే ఏదో ఒక సంస్థ టేకోవర్ చేయొచ్చని తెలిపాయి. రాబోయే వారం రోజుల్లోనే ఇది జరగవచ్చని ఇన్‌మొబి గ్రూప్ సహ వ్యవస్థాపకుడు అభయ్ సింఘాల్ చెప్పారు. స్వల్పకాలికంగా ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపు కోసం 7–8 బిలియన్ డాలర్ల నిధులు అవసరం కావచ్చని, అవి అందితే ప్రస్తుతానికి సమస్య పరిష్కారం కావచ్చని ఆయన పేర్కొన్నారు. ఏవో కొన్నింటిపై మినహా మిగతా స్టార్టప్‌లపై ఎస్‌వీబీ సంక్షోభ ప్రభావం ఉండకపోవచ్చని జెన్‌ప్యాక్ట్ వ్యవస్థాపకుడు ప్రమోద్ భాసిన్ అభిప్రాయపడ్డారు. ఈ సమస్య స్థానికమైనదే తప్ప అంతర్జాతీయమైనది కాదని పేర్కొన్నారు. భారతీయ స్టార్టప్‌లకు ఎస్‌వీబీతో చెప్పుకోతగ్గ స్థాయిలో లావాదేవీలేమీ లేవు కాబట్టి అవి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదని పరిశ్రమ నిపుణుడు, 5ఎఫ్ వరల్డ్ చైర్మన్ గణేష్ నటరాజన్ చెప్పారు. ఎస్‌వీబీతో లావాదేవీలు జరిపే సంస్థలు కూడా కాస్త ఓపిక పడితే తమ సొమ్మును తిరిగి పొందడానికి వీలుంటుందన్నారు. మరోవైపు, తమ రెండు అనుబంధ సంస్థలకు (కిడోపియా, మీడియావర్క్జ్) ఎస్‌వీబీలో సుమారు రూ. 64 కోట్లు ఉన్నాయని గేమింగ్, స్పోర్ట్స్ మీడియా ప్లాట్‌ఫామ్ సంస్థ నజారా టెక్నాలజీస్ వెల్లడించింది. అయితే, వాటి చేతిలో తగినన్ని నిధులు ఉన్నాయని, ఎస్‌వీబీ పరిణామం వల్ల వాటి వ్యాపారంపై ప్రభావమేమీ పడబోదని పేర్కొంది.

అంకురాలతో భేటీ కానున్న కేంద్ర మంత్రి..

దేశీ సంస్థలపై ఎస్‌వీబీ పరిణామాల ప్రభావాన్ని అంచనా వేయడంపై కేంద్రం దృష్టి సారించింది. దీనిపై కేంద్ర ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఈ వారంలో దేశీ స్టార్టప్‌ల ప్రతినిధులతో భేటీ కానున్నారు. దేశ నిర్మాణంలో కీలకంగా ఎదుగుతున్న అంకుర సంస్థలకు ప్రభుత్వం ఏ విధంగా తోడ్పాటు అందించగలదన్నది తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడగలదని ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు.




గుంటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, ముస్తఫా, శ్రీదేవి, ఏసురత్నం, అడపా శేషు తదితరులు


విజయనగరం జిల్లా సాలూరులో జరిగిన వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తదితరులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

ఊరూరా సందడే సందడి

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు, నేతలు పండగలా నిర్వహించారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించి.. వైఎస్సార్‌సీపీ జెండాలనూ ఊరూరా ఆవిష్కరించారు. భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించి.. పార్టీ కార్యాలయాల్లో భారీ కేక్‌లు కట్ చేశారు. నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేసి.. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దివంగత వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యంగా.. ప్రజాభ్యుదయమే ధ్యేయంగా 2011 మార్చి 12న వైఎస్సార్‌సీపీని సీఎం వైఎస్ జగన్ స్థాపించిన విషయం తెలిసిందే. ఈ ప్రస్థానంలో 12 ఏళ్లు పూర్తి చేసుకుని ఆదివారం 13వ వసంతంలోకి అడుగు పెట్టింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సేవాకార్యక్రమాలు నిర్వహించారు. తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, పార్టీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి, మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల సునీత తదితరులు పాల్గొన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, నేతలు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మూడున్నరేళ్లుగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ సాగిస్తున్న సంక్షేమాభివృద్ధి పాలనను గుర్తుచేస్తూ యువకులు జై జగన్ నినాదాలు చేశారు.

- విశాఖపట్నం జిల్లా మద్దిలపాలెం కార్యాలయంలో పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మహానేత వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- అనంతపురం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. తిరుపతిలోని తన నివాసంలో మంత్రి పెద్దిరెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. నగరి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంత్రి ఆర్కే రోజా కేక్ కట్ చేశారు. తిరుపతిలో ఎంపీ గురుమూర్తి జెండా ఎగురవేశారు. ఒంగోలులో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, యర్రగొండపాలెంలో మంత్రి ఆదిమూలపు సురేష్ కేక్ కట్ చేశారు.
- గుంటూరులో పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించి, కేక్‌ను కట్‌చేశారు. 500 మీటర్ల వైఎస్సార్‌సీపీ జెండాతో ర్యాలీ నిర్వహించారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నేతలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ పతాకం రెపరెపలాడింది.
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తణుకులో మంత్రి కారుమూరి, ఏలూరులో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని వేడుకల్లో పాల్గొన్నారు.
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన వేడుకల్లో మంత్రి వేణు, హోంమంత్రి తానేటి వనిత, ఎంపీ భరత్‌రామ్ పాల్గొన్నారు.
- విజయనగరంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, సాలూరులో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పార్టీ జెండాను ఎగురవేశారు.

వైఎస్సార్‌సీపీ రోల్ మోడల్

- పార్టీ పతాకావిష్కరణలో ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- త్వరలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం


చీరలు పంపిణీ చేస్తున్న సజ్జల. చిత్రంలో మేరుగ, జోగి రమేష్, అప్పిరెడ్డి తదితరులు

సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు వైఎస్సార్‌సీపీ ఓ రోల్ మోడల్ అని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఎంతమంది ఎన్ని కుట్రలు చేసినా, పార్టీని ఏమీ చేయలేరని, ఓటమి అనేదే ఉండదన్నారు. వైఎస్సార్‌సీపీని దేశంలోనే ఆదర్శవంతమైన పార్టీగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సజ్జల.. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పార్టీ పతాకంలోని రంగుల బెలూన్లను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ 12 ఏళ్ల ప్రస్థానం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా సాగిందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసి ప్రజలతో మమేకమైన నాయకుడు వైఎస్ జగన్ అని కొనియాడారు. పరిపాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా పాలన సాగిస్తున్నారని చెప్పారు. అధికారం అంటే బాధ్యత, సేవ అని చాటి చెప్పిన నేత వైఎస్ జగన్ అని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ విప్లవాత్మకం అని, ప్రజల ఇంటి గడప వద్దకే పరిపాలన అందుతోందన్నారు. ఏ సమస్య అయినా సచివాలయం ద్వారా పరిష్కరించే పరిస్థితి తీసుకువచ్చారని చెప్పారు. మరో అడుగు ముందుకేస్తూ.. త్వరలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం మొదలు పెడుతున్నామని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ.. అన్ని వర్గాల పార్టీ

వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ 12 ఏళ్లు పూర్తి చేసుకుని 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించుకోవటం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ మేరకు తాడేపల్లిలో ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ప్రజలతో మమేకం అవుతోంది. అందుకే ప్రజలంతా తమ హృదయాల్లో పార్టీని పదిలపర్చుకున్నారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఓసీ నిరుపేదల పార్టీగా పేరుగాంచింది. సామాజిక న్యాయానికి, మహిళా, విద్యా, రాజకీయ, ఆర్థిక సాధికారత దేశంలోనే చుక్కానిలా నిలుస్తోంది. ఇది రైతన్నలు, పల్లెలు, నిరుపేదలను ప్రేమించే నాయకుడి పార్టీ. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి 98.5 శాతం వాగ్దానాలను అమలు చేసిన నాయకుడి పార్టీ. పరిపాలన సంస్కరణలు చేసి, వికేంద్రీకరణను సిద్ధాంతంగా ఆచరిస్తున్న పార్టీ. ఇది తెలుగునాట మరో పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతున్న దార్శనికుడి పార్టీ. రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికీ సీఎం జగన్ అండ. నేటి తరానికి ఆలంబన. భావితరానికి భరోసా' అని పేర్కొన్నారు.


పార్లమెంటు సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం ఢిల్లీలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్‌తో సమావేశమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నేత విజయసాయిరెడ్డి.
- సాక్షి, న్యూఢిల్లీ

రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురి దుర్మరణం

- చిత్తూరు జిల్లా నగరి వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురి మృతి
- వీరిలో సింగపూర్ నుంచి వచ్చిన దంపతులు, డ్రైవర్
- ప్రకాశం జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం
- వీరిలో తండ్రీకొడుకులు, భార్యాభర్తలు



నాగజ్యోతి, యువరాజ్ దంపతులు (ఫైల్)



రామకోటేశ్వరరావు, బ్రహ్మేశ్వరరావు (ఫైల్)


రాజయ్య, దానమ్మ దంపతులు (ఫైల్)

నగరి(చిత్తూరు జిల్లా)/కనిగిరి/కొమరోలు: చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. చిత్తూరు జిల్లాలో జరిగిన ప్రమాదంలో సింగపూర్ నుంచి వచ్చిన భార్యాభర్తలు, కారు డ్రైవర్ మరణించారు. ప్రకాశం జిల్లాలో జరిగిన ఒక ప్రమాదంలో తండ్రీకొడుకులు దుర్మరణం చెందగా మరో ప్రమాదంలో భార్యాభర్తలు ప్రాణాలు కోల్పోయారు. చిత్తూరు జిల్లా నగరి మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాపురం వద్ద కారును ట్యాంకర్ ఢీకొట్టడంతో ముగ్గురు మృతిచెందారు. ఉద్యోగరీత్యా సింగపూర్ వెళ్లి అక్కడే స్థిరపడ్డ చెన్నైకి చెందిన యువరాజ్ (42), నాగజ్యోతి (42) దంపతులు తిరుమల శ్రీవారిని దర్శించుకోవడంతోపాటు పలు ప్రాంతాలు సందర్శించేందుకు టూరిస్ట్ వీసాపై ఆదివారం ఉదయం చెన్నైకు వచ్చారు. ఓలా యాప్ ద్వారా కారు బుక్ చేసుకుని తిరుమలకు వెళుతుండగా మార్గమధ్యంలో ధర్మాపురం వద్ద ఎదురుగా వస్తున్న ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డుపక్కనే పల్లపు ప్రాంతంలోకి దూసుకెళ్లింది. కారు పూర్తిగా నలిగిపోవడంతో యువరాజ్, నాగజ్యోతి, తమిళనాడు సరిహద్దులోని మద్దూరు గ్రామానికి చెందిన డ్రైవర్ ఇళంగోవన్ (20) ఘటనాస్థలంలోనే మృతిచెందారు. పోలీసు సిబ్బంది క్రేన్ సాయంతో కారును బయటకు లాగి మృతదేహాలను తీసి నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారకుండైన ట్యాంకర్ డ్రైవర్‌కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రకాశం జిల్లాలో..

ప్రకాశం జిల్లా కనిగిరి మండలంలో కారు అదుపుతప్పి చప్టా గొయ్యిలో పడి తండ్రి, కుమారుడు చనిపోయారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం రాంపల్లికి చెందిన నర్రా రామకోటేశ్వరరావు (67) తన భార్య సత్యవాణి, కుమారుడు నర్రా బ్రహ్మేశ్వరరావు (48)తో కలిసి బాపట్ల జిల్లా రేపల్లె దగ్గర రాయవారిపల్లెలో వివాహానికి కారులో వెళ్లి శనివారం రాత్రి తిరిగి వస్తుండగా, కనిగిరి సమీపంలోని కాశిరెడ్డికాలనీ వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చప్టా గొయ్యిలో పడిపోయింది. రామకోటేశ్వరరావు, బ్రహ్మేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందారు. సత్యవాణికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు కనిగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరో ఘటనలో కొమరోలు మండలం నల్లగుంటకు చెందిన మందా రాజయ్య (62), ఆయన భార్య దానమ్మ (58), వారి కుటుంబ సభ్యులు కలిసి ఆదివారం తాటిచెర్లమోటులో ప్రార్థన కోసం ఆటోలో వెళుతుండగా... అక్కపల్లె సమీపంలో మలుపు వద్ద కుక్కలు అడ్డురావడంతో అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు మందా రాజయ్య, మందా దానమ్మ మృతిచెందారు. మరో ఇద్దరికి గాయాలు కావడంతో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

జీడి పరిశ్రమ.. పల్లెకు వెళ్లెనమ్మా!


జీడి పప్పును ఒలుస్తున్న మహిళలు

- పల్లెలకు విస్తరిస్తున్న జీడి పరిశ్రమలు
- కార్మికులకు పెరిగిన ఉపాధి అవకాశాలు
- ప్రస్తుతం 581 పరిశ్రమల్లో 40వేల మంది కార్మికులు
- 90శాతం మంది మహిళలకే పని

పలాస: పలాస కేంద్రంగా పురుడు పోసుకున్న జీడి పరిశ్రమలు నేడు పల్లెలకు కూడా విస్తరిస్తున్నాయి. ఈ విస్తరణ వేల మందికి ఉపాధి మార్గం చూపెడుతోంది. గతంలో పరిశ్రమలు ఉన్నచోటకే కార్మికులు అనేక వ్యయప్రయాసలను ఎదుర్కొని కాలినడకన వెళ్లేవారు. నేడు కార్మికుల ముంగిటకు పరిశ్రమలు తరలి వెళ్తున్నాయి. దీంతో పల్లె ఒడిలోనే కార్మికులు చక్కని ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాల్లోని 9 మండలాల్లో ప్రభుత్వం లెక్కల ప్రకారం 581 జీడి పరిశ్రమలు ప్రస్తుతం ఉన్నాయి. గతంలో పలాసలో కేవలం 90 పరిశ్రమలు మాత్రమే ఉండేవి.

మహిళలే అధికం

ఈ పరిశ్రమల్లో పనిచేయడానికి ఎంతో కష్టపడి మహిళా కార్మికులు వెళ్తుండేవారు. ప్రస్తుతం ప్రతి పల్లెలో కూడా నాలుగైదు షెడ్లు ఉన్నాయి. ఈ షెడ్లల్లోనే జీడి పరిశ్రమల్లో బాయిలింగ్ చేసిన పిక్కలను కటింగ్ చేసి జీడి పప్పును తీస్తున్నారు. జీడి పప్పును తీసిన తర్వాత వాటిపై పొట్టును కూడా ఈ కార్మికులే తొలగిస్తారు. ఇందుకు గాను ఒక కార్మికురాలికి కిలో జీడి పిక్కలు కటింగ్ చేస్తే రూ.27లు ఇస్తారు. ఈ విధంగా ప్రతి మహిళ రోజుకు కనీసం 20కిలోల పిక్కలను కటింగ్ చేస్తుంది. ఈ విధంగా రోజుకు సుమారు రూ.400లు సంపాదిస్తున్నారు. ఒలిచిన జీడి పప్పునకు కూడా కిలోకు రూ.13లు చొప్పున పరిశ్రమదారులు ఇస్తారు. ప్రతి మహిళా కార్మికురాలు రోజుకి కనీసం 40కిలోల పప్పును ఒలుస్తారు. వీరు కూడా రూ.400లు పై చిలుకు సంపాదిస్తున్నారు. ఈ విధంగా గ్రామాల్లో మహిళలకు వారి సొంత ఊరిలోనే ఈ విధంగా కూలి పనులు లభించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. యాభై ఏళ్ల కిందట జరిగిన ఉద్యమాల కారణంగా ఏ పల్లెల నుంచి గ్రామీణులు దూరమయ్యారో నేడు అవే పల్లెల్లో జీడి పరిశ్రమలు వెలుస్తున్నాయి.

గతంలో పలాస వెళ్లే దాన్ని

గతంలో జీడి పరిశ్రమలో పనిచేయడానికి పలాస వెళ్లేదాన్ని. ఉదయం వెళ్లి రాత్రి 7, 8గంటలకు ఇంటికి చేరేదాన్ని. అప్పుడు కూలి రేట్లు కూడా తక్కువ ఉండేవి. ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు కాళ్ల దగ్గరే పనిదొరుకుతోంది. మా ఊరిలోని జీడి పిక్కల బడ్డీలో పనిచేస్తూ రోజుకు రూ.400లు సంపాదిస్తున్నాను. ఇప్పుడు సంతోషంగా ఉంది.

– నందేటి పద్మ,జీడి కార్మికురాలు. బొడ్డపాడు కాలనీ, పలాస మండలం

కూలి పెరుగుతోంది

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి రెండేళ్లకు ఒక సారి కూలి రేట్లను పెంచుతున్నాం. గతంలో చాలా తక్కువగా ఉండేవి. ఇప్పుడు రేట్లు బాగున్నాయి. అత్యధికంగా 90శాతం మంది మహిళలే పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. వారికి అన్ని రకాల సదుపాయాల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నాం. పలాస నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాలతో కలుపుకుంటే సుమారు 40వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

– బొమ్మాళి తాతయ్య, కార్యదర్శి, పలాస కాష్యూలేబరు యూనియన్

కార్మికుల సహకారంతో..

కార్మికులతో మంచి సంబంధాలు ఉన్నాయి. వారి సహకారంతోనే పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. వారికి కావలసిన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాము. ఇ.ఎస్.ఐ, పి.ఎఫ్ చెల్లిస్తున్నాము. కాన్పులకు, కార్మికుల చనిపోయినప్పుడు తగిన ఆర్థిక సహకారం చేస్తున్నాం. ప్రతి రెండేళ్లకు ఒక సారి వేతనాల ఒప్పందం జరుగుతోంది. అందుకు అనుగుణంగా వేతనాలు చెల్లిస్తున్నాం.

– మల్లా రామేశ్వరరావు, అధ్యక్షుడు, పలాస పారిశ్రామిక వాడ జీడి పరిశ్రమల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, పలాస

రత్నగిరి.. కిక్కిరిసి..


సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రత్నగిరి ఆదివారం కిక్కిరిసిపోయింది. సత్యదేవుని సన్నిధిలో శనివారం రాత్రి వంద వివాహాలు జరిగాయి. వీరితో పాటు ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్నవారు కూడా బంధుమిత్రులతో కలసి రత్నగిరికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చి, వ్రతాలాచరించి, సత్యదేవుడిని దర్శించుకున్నారు. వీరికి ఇతర భక్తులు కూడా తోడవడంతో ఆలయంలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. స్వామివారి నిత్య కల్యాణ మండపంతో పాటు పాత కల్యాణ మండపంలో కూడా స్వామివారి వ్రతాలు నిర్వహించారు. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. వ్రతాలు 3,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు 5 వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో భోజనం పెట్టారు.

సిరుల పంట


పొదలకూరు మండలంలో సాగవుతున్న సవక తోట

- సవక, జామాయిల్‌కు పెరిగిన డిమాండ్
- టన్ను జామాయిల్ కర్ర రూ.4,500
- ఎకరా సవక తోట రూ.3 లక్షలు
- నాణ్యతను బట్టి మరింత ధర
- ప్రభుత్వం చొరవతో గిట్టుబాటు ధరలు

జిల్లాలో..
జామాయిల్ సాగు : 1.20 లక్షల ఎకరాలు
సవక సాగు : 80 వేల ఎకరాలు

పొదలకూరు: జామాయిల్(నీలగిరిచెట్లు), సవక సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. 2016 నుంచి 2019 వరకు వీటిని సాగు చేసిన రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నష్టాలకే సవక, జామాయిల్ అమ్ముకోవాల్సి వచ్చింది. పెట్టుబడులు కూడా రాక, గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడిపోయారు. సబాబుల్‌తోపాటు, సవక, జామాయిల్ కర్రకు మద్దతు ధర కల్పిస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించినా అనంతరం పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా సుబాబుల్ రైతులు గిట్టుబాటు ధర కోసం అప్పట్లో రోడ్లు ఎక్కిన సందర్భాలు కూడా ఉన్నాయి. అప్పట్లో జిల్లాలో లక్షల ఎకరాల్లో జామాయిల్, సవక తోటల సాగు చేశారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న మెట్టప్రాంతాల్లో ప్రత్యామ్నాయం లేక చాలామంది రైతులు జామాయిల్ సాగునే నమ్ముకున్నారు. ఐదేళ్లకొకసారి కటింగ్‌కు వచ్చే జామాయిల్ వల్ల రైతులు ఆర్థిక స్వావలంబన పొందేవారు. క్రమంగా జామాయిల్, సవకను అడిగే వారు లేకుండాపోయారు. ఫలితంగా ఐదేళ్లపాటు దీనావస్థలో రైతులు కొట్టుమిట్టాడారు. జామాయిల్ కర్రను కొనుగోలు చేసే ఫ్యాక్టరీలు రైతులను నిలువునా మోసగిస్తున్నాయనే ఆరోపణలు వినిపించేవి. ఆదుకోవాల్సిన అప్పటి ప్రభుత్వం చేతులెత్తేయడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయితే ప్రస్తుతం అందుకు భిన్నంగా పరిస్థితి మారి డిమాండ్ పెరిగి రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. సవకకు బాగా డిమాండ్ పెరగడంతో ఎకరాకు రూ.3 లక్షల వరకు ధర లభిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

లక్షల ఎకరాల్లో జామాయిల్

సాగు పద్ధతులు సులువుగా ఉండే జామాయిల్ జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో సాగులో ఉంది. లక్ష ఎకరాల్లో తోటలు కటింగ్‌కు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. మరో 80 వేల ఎకరాల్లో సవక తోటలు ఉంటాయని అంచనా. పొదలకూరు మండలంలోని విరువూరు, సూరాయపాళెం, ఇనుకుర్తి, పెదరాజుపాళెం తదితర గ్రామాల్లో సవక తోటలు ఉన్నాయి. జామాయిల్ తోటలు ప్రతి గ్రామంలో సాగులో ఉన్నాయి. ఫైర్ ఉడ్, ఫ్లైఉడ్, కాగితపు తయారీ, భవన నిర్మాణాలకు జామాయిల్, సవక కర్రలను వినియోగిస్తారు. మహారాష్ట్ర బలాసా ఫ్యాక్టరీ యాజమాన్యం టన్నుల కొద్ది తాటతీసిన(డీబార్) జామాయిల్‌ను కొనుగోలు చేస్తుంది. ఇందుకోసం టన్నుకు రూ.4,500(డీబార్) చెల్లిస్తుండగా, అలాగే జిల్లా నుంచి జామాయిల్ కర్రను కొనుగోలు చేస్తున్న శ్రీకాళహస్తి చెంబేడులోని ఫ్లైఉడ్ తయారీ ఫ్యాక్టరీ టన్నుకు రూ.4 వేలు(డీబార్) చెల్లిస్తోంది. నాన్ డీబార్(తాటతీయని) రకం కర్ర అయితే రూ.3,200 వరకు టన్నుకు ధర చెల్లిస్తోంది. అయితే ఇందులో లారీ బాడుగ, కర్ర నరికేందుకు కూలీల ఖర్చులు రైతు భరించాల్సి ఉంటుంది. టన్నుకు నికరంగా రూ.2,100 నుంచి రూ.2,400 వరకు రైతులకు గిట్టుబాటు అవుతోంది. గతంలో అన్ని ఖర్చులు పోను రూ.1,200 నుంచి రూ.1,400 కూడా గిట్టుబాటు అయ్యేది కాదు. ఎకరాల లెక్కన దళారులు కొనుగోలు చేస్తే జామాయిల్ నాణ్యతను బట్టి రూ.90 వేల నుంచి రూ.లక్ష కూడా ధర పలుకుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

మోసాలకు చెక్

జిల్లాలో జామాయిల్ కర్రను 80 శాతం శ్రీకాళహస్తి చెంబేడులోని ఫ్లైఉడ్ ఫ్యాక్టరీ యాజమాన్యమే కొనుగోలు చేస్తోంది. అయితే రైతులు కర్రను అమ్ముకోవడంలో మోసపోతున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో టన్నుకు కనీసం అగ్రికల్చర్ మార్కెటింగ్ చెక్‌పోస్టుల్లో మాత్రం రూ.4,400 ధర చెల్లిస్తున్నట్లుగా వే-బిల్లులను చూపి తరలించారనే ప్రచారం జరిగింది. దీంతో ప్రభుత్వం చొరవతో ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఫ్యాక్టరీల యజమాన్యాలతో చర్చలు జరిపి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాల్సిందిగా కోరారు. ఫలితంగా ఫ్యాక్టరీలు ధరలను పెంచి కర్రను కొనుగోలు చేస్తున్నాయి. అంతేకాక మార్కెటింగ్‌శాఖ చెక్‌పోస్టుల్లో వే-బిల్లులను తనిఖీ చేస్తున్నారు. సవక, జామాయిల్‌కు డిమాండ్ పెరగడంతో దళారులు కూడా విరివిగా ఎకరాలకు ఎకరాలు కొనుగోలు చేస్తున్నారు.

ధరలు పెరగడం మంచిపరిణామం

జామాయిల్, సవక కర్ర ధరలు పెరగడం మంచిపరిణామం. గతంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో చాలామంది రైతులు సవక, జామాయిల్ సాగు జోలికి వెళ్లలేకపోయారు. ప్రభుత్వం చొరవ వల్లనే ప్రస్తుతం ధరలు పెరిగాయి.

– కె.రామిరెడ్డి, రైతు, కొనగలూరు

రైతులు కోలుకుంటున్నారు

జామాయిల్ రైతులు కోలుకుంటున్నారు. గతంలో ధరలు లేక దిగాలు పడి తోటలను పట్టించుకోవడం మానివేశారు. అయితే ప్రస్తుతం జామాయిల్ కర్ర ధరలు ఒక మోస్తరుగా పెరగడంతో ఎకరాకు రూ.లక్షల కూడా లభిస్తుండడం సంతోషంగా ఉంది.

– ఎం.గోపాలయ్య, రైతు, అయ్యగారిపాళెం

సవక అమాంతం పెరిగింది

జామాయిల్ కన్నా సవక కర్ర ధరలు అమాంతంగా పెరిగాయి. ఎకరా సవక తోటకు రూ.3 లక్షల వరకు చెల్లించి నరికి తీసుకువెళుతున్నారు. జామాయిల్‌కు కూడా గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. సవకకు నీటి లభ్యత అవసరం ఉంటుంది. జామాయిల్ వర్షాధారంగా ఖర్చు లేకుండా సాగు చేసుకునేందుకు అవకాశం ఉంది.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22,Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943